సంక్షుభిత వ్యవసాయానికి
సమగ్ర సస్య చికిత్స

అగ్రిక్లినిక్ SM

సంపుటి: 3 సంచిక: 8 జనవరి, 2013 పేజీలు: 56 వెల: ₹ 30/-

సమగ్ర వ్యవసాయ మాసపత్రిక

రైతుల గుండెచప్పుడై మార్గం చూపుతున్న పాదయాత్ర అడుగడుగునా 'అగ్రిక్లినిక్' అధినేతకు ఘనస్వాగతం

వరి మాగాణిలో కోత అనంతరం మినుము, పెసర సాగు

ఆధునిక సాంకేతికతకు అద్దం పట్టిన లాం ఎగ్జిబిషన్

రబీ పాద్యతిరుగుడు విత్తనోత్పత్తిలో యాజమాన్య పద్ధతులు

నోవా అగ్రిటెక్ వారి అద్భుత ఉత్పాదన

మిత్ర™

Mithr™

మోతాదు : 100 మి.లీ. / ఎకరానికి

తయారు చేయువారు మరియు మార్కెట్ చేయువారు:

నోవా అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్

ప్లాట్ నం. 5, విరల్ నగర్, న్యూబోయినపల్లి,
సికింద్రాబాదు-500 011. ఫోన్ నం. 040-27957082,
E-mail : nova.agritech@gmail.com, info@novaagritech.com

An ISO 9001:2008 Certified Company

...for better HARVEST

నోవా అగ్రిటెక్ వారి అత్యున్నత ఉత్పాదన

నోవా స్వర్ణ™

సహజ సిద్ధముగా తయారు చేయబడినది

Nova SWARNA™

A naturally derived product

మోతాదు : 0.15 - 0.30 మి.లీ. 1 ఎకరానికి

తయారు చేయువారు మరియు మార్కెట్ చేయువారు:

నోవా అగ్రిటెక్ ప్రై. లిమిటెడ్.

ప్లాట్ నం. 5, విరల్ నగర్, బినతోకట్ట, న్యూ బోయినపల్లి, సికింద్రాబాద్ - 11.
ఫోన్ : 040-27957082, ఫ్యాక్స్ : 040-27957081
e-mail: nova.agritech@gmail.com, www.novaagritech.com

An ISO 9001 : 2008 Certified Company

...for better HARVEST

అగ్రిక్లినిక్ SM
సమగ్ర వ్యవసాయ మాసపత్రిక
RNI APTEL / 2010 /34567

సంపుటి : 3 సంచిక : 8 జనవరి, 2013

ఎడిటర్
ఏలూరి సాంబశివరావు, M.Sc., (Hort)

అసోసియేట్ ఎడిటర్
వై.వి. నరసింహారావు

బ్యూరో చీఫ్
ఎమ్. హేమసుందర్

మార్కెటింగ్ మేనేజర్
ఉదయ్ పైడిపాటి, M.B.A. (HR)

డిజైనింగ్ & డి.టి.పి.
ఎమ్. ఆదినారాయణ (బాబు)
ఎమ్. మధుబాల

Printer, Publisher, and Owned by :
Yeluri Sambasiva Rao, M.Sc., (Hort)

Printed at Prajasakthi Daily Printing Press
M.B. Bhavan, RTC 'X' Roads, Hyderabad - 20.

Published at :
Plot No. 5, MJR Residency, Vittal Nagar,
Chinatokatta, New Bowenpally,
Secunderabad - 11. A.P. India

Editor :
Yeluri Sambasiva Rao, M.Sc., (Hort)

Editorial & Marketing Office :
Kisan Media Innovations Pvt. Ltd.
Plot No. 5, MJR Residency, Vittal Nagar,
Chinatokatta, New Bowenpally,
Secunderabad - 11. A.P. India
Phone : 040-40206238, Fax :040-27957081
E-mail : agriclinic.org@gmail.com
info@agriclinic.org
kisanmediainnovations@gmail.com,

No Part of this magazine can be reproduced, limited or transmitted in any form, including electronic, mechanical, photo copying, recording or any information stage retrieval system or extracted in any way without permission from the publisher. Views expressed in the magazine need not necessarily be those of the Editor / Publisher

చదవండి! చదివించండి!!
అగ్రిక్లినిక్ SM
సమగ్ర వ్యవసాయ మాసపత్రిక
www.agriclinic.org
www.kisanmedia.com

సంపాదకీయం

సాగు బాగుకు స్వాగతం లభించేనా!

దేశంలో వేల కోట్ల మందికి ఉపాధి కల్పిస్తూ, వందకోట్లకు పైగా ఉన్న జనాభా క్షుద్బాధ తీరుస్తూ, తాను మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి అవమానాల అంపశయ్యపై పరుండి తనకోసం కాకుండా దేశం కోసం త్యాగాలు చేస్తున్న అన్నదాతలకు 2013 సంవత్సరం సాంత్వన కలిగించేనా? దేశ ప్రజల ఆహార అవసరాలకు తమ జవజీవాలను కరిగించి, రక్తాన్ని మరిగించి చేస్తున్న సేవలు సమాజం ఇకనైనా గుర్తిస్తుందా?అనే ఆశ ప్రశ్నార్థకంగానే ఉంది. ఒకనాడు దేశ స్వాతంత్ర్యం కొరకు మిగిలిన ప్రజలతో పాటు ఉద్యమాలు నిర్వహించి, లాఠీలు, తూటాలకు వెరవకుండా, జైలు గోడలను నివాసాలుగా ఏర్పాటు చేసుకుని అకుంఠిత దేశ భక్తులుగా ఉన్నవాళ్ళలో రైతులే అధికం. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన తీవ్ర ఆహార కొరతను నివారించేందుకు ప్రారంభించిన సస్య విప్లవంలో తమతో పాటు భూములను కూడా సమిధలు చేసుకున్నది రైతులే. ఆహారాన్ని వేటాడే సమయంలో కర్కశంగా భూమిపై చేసిన రసాయన ప్రయోగాలు భావితరాలకు నిరాశను మిగిల్చిన సంగతి విధితమే. చీకేసిన తాటిపండులా నిస్సారమైన భూములతో సేద్యాన్ని సక్రమంగా చేయడం వీలుకాక, భూగర్భంలో సారంలేక మోతాదుకు మించి, ఎరువులు, పురుగు మందులను వినియోగించి రాబట్టిన పంట తమకు గిట్టుబాటు కాకపోగా, ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారులకు విషం పంచినట్లుగా వారి ఆరోగ్యాలను సైతం ప్రభావితం చేస్తున్న తీరు చూస్తున్నాం. జనాభా పెరిగిపోయి, కమతాలు కుంచించుకుపోయి, యంత్రాలు ప్రవేశించలేని స్థితిలో, కూలీల కరువు, ఉత్పాదకాల బరువు, ఎరువుల మోత అన్నీకలసి రైతాంగం మూల్గులను పీల్చివేస్తున్నాయి. ప్రకృతి ప్రకోపించి, అతి వృష్టి-అనావృష్టి ఏర్పడి దిగుబడులపై ప్రభావాన్ని చూపుతుండగా తిలాపాపం తలాపిడికెడుగా దళారులు విశృంఖల ప్రవర్తనతో రైతాంగం కష్టం పరాన్న భుక్కుల జేబులు మాత్రమే నింపుతోంది. రాను రాను వ్యవసాయ వృత్తిపై విశ్వాసం సడలి సాగు బాగుపడే స్థితి కనబడడం లేదు. రైతుల గోడు వినిపించుకునే ఓపిక పాలకులకు లేదు. వ్యవసాయ మంత్రులు క్రికెట్ ఆట విధాతలుగా మారిపోయి, మూడు పర్యటనలు, ఆరు విఘటనలుగా విలాసాల్లో తేలియాడుతున్నారు. వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశ పెట్టాలని, ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని, విలువైన ఉత్పత్తిదారుడుగా రైతు తన ఉత్పత్తికి ధరను సంఘాలుగా ఏర్పడి తానే నిర్ణయించే స్థితికి తీసుకురావాలని ఆకాంక్షించడం మాటవరుసకే అమలవుతున్నది. వ్యవసాయ విజ్ఞాన పంపిణీ వ్యవస్థ, వ్యవసాయ విద్యలో నూతనత్వం, దున్నకం నుండి పంట కోసే వరకు కాకుండా మార్కెట్ వరకు ఉత్పత్తులను చేరవేసే విధంగా పరిశోధనలు ముందుకు తీసుకువెళ్ళే వ్యవస్థ ఆవిర్భావానికి 2013 శ్రీకారం చుట్టాలని ఆశించడంలో తప్పులేదు. ఈ రాణి ప్రేమపురాణం, ఆ ముట్టడి కైన ఖర్చులు, మతలబులు, కైఫీయత్తుల మత్తులో బాధ్యతగల ప్రచార, ప్రసార సాధనాలు రైతుల బాధల గాధలను ఇకనైనా వెలికితెస్తాయా! దేశ రాజధానిలో ఒక యువతిపై జరిగిన దారుణాన్ని మీడియాతో సహా సభ్య ప్రపంచం ఖండించడం శుభ సూచికమే అయినా, మారుమూల పల్లెల్లో అమాయక రైతులపై, దళిత గిరిజనులపై అనునిత్యం జరుగుతున్న అమానుషాలు ఆ స్థాయిలో వెలికిరాకపోవడం ప్రశ్నార్థకం కాదా ! నోరున్న వారికే అన్ని సౌకర్యాలు, హక్కులు, వసతులు, ఆహారం లభిస్తుండగా ఆరుగాలం కష్టపడి, సమాజం కొరకు తాను బలియై, నిరంతర దోపిడీ పీడనలో నలిగిపోతున్న గ్రామీణ రైతులు, కూలీలు మహిళల దుస్థితిని గుర్తించి, అట్టడుగునపడి కన్పించని గాథలన్నీ వెలికితీయడం కర్తవ్యమని భావించే రోజులు 2013లో వస్తాయా ? రైతులు, కార్మికులు ఇతర పీడిత వర్గాలు ఏకమై సంఘటిత శక్తిగా ఏర్పడి, బలపడుతున్న కార్పోరేట్ లాబీల కుట్రలను ప్రతిఘటిస్తూ... **నూతన సామాజిక మరియు వ్యవసాయ విప్లవానికి నాంది పలకాలని అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలతో.....**

ఏలూరి సాంబశివరావు

విషయ సూచిక

1. రైతుల గుండెచప్పుడై మార్మోగుతున్న పాదయాత్ర అడుగడుగునా 'అగ్రిక్లినిక్' అధినేతకు ఘనస్వాగతం 5
2. ఈము పక్షుల పెంపకంలో మెలకువలు 9
3. అధిక ఆదాయం కోసం అంతర పంటలు 11
4. ఒక రైతు విజయం ఎందరికో స్ఫూర్తి 13
5. వేరుశనగలో సస్యరక్షణ 15
6. వరి మాగాణిలో కోత అనంతరం మినుము, పెసర సాగు 19
7. ప్రాకృతిక వ్యవసాయానికే ప్రాధాన్యత - రవి శంకర్ గురూజి 22
8. మామిడి పూత - తేనె మంచు పురుగుల నివారణ 25
9. పొగాకులో తెగుళ్ళ సమస్య - నివారణ చర్యలు 29
10. సమస్య - పరిష్కారం 32
11. రబీలో దనియాల సాగు 34
12. రబీ పొద్దుతిరుగుడు విత్తనోత్పత్తిలో యాజమాన్య పద్ధతులు 36
13. ఆధునిక సాంకేతికకు అద్దం పట్టిన లాం ఎగ్జిబిషన్ పరిశోధన, నిపుణత, వ్యవసాయం, వాణిజ్యం, రైతులు ఒకే వేదికపైకి 39
14. రబీ, రైతుకు అదనపు ఆదాయాన్నిచ్చే 'కట్టెజనుము' 44
15. దోపిడీ, దళారులు లేని వ్యవస్థకు స్వాగతం చెబుదాం... రైతన్నకు అండగా నిలుద్దాం 47
16. మిరపలో వైరస్ తెగుళ్ళు - అదుపునకు సూచనలు 49
17. వడివడిగా.. ముందు యుగం దూతలా 'ఏలూరి' సాహసమే ఊపిరిగా... అంకితభావమే ఆలంబనగా.. పైపైకి 50
18. ఉద్యాన మొక్కల రంగంలోకి ఎన్.ఆర్.ఐ. అగ్రిటెక్ 54

ఇటీవల కాలంలో ఈము పక్షుల పెంపకం 5 శాతం సగటు అభివృద్ధి రేటుతో రోజు రోజుకూ వృద్ధి చెందుతోంది. మన దేశంలో కేవలం 2 దశాబ్దాల నుండే ప్రారంభమైన ఈము పక్షుల పెంపకంపై శాస్త్రీయపరమైన మెలకువల్ని పెంపకందార్లకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

9 ఈము పక్షుల పెంపకంలో మెలకువలు

2010వ సంవత్సరంలో 10 ఎకరాల మిరప తోట వేసిన ఆంజనేయులు వ్యాధుల దెబ్బకు దాదాపు పంటను వదిలేసుకున్నారు. విపరీతంగా ప్రబలిన పురుగులు మిరప చెట్లనుకొరికి తినేసి, శిధిలావస్థకు చేరుకున్న దశలో ఎవరో ఆయనకు సోవా వారి ఉత్పాదనల గురించి తెలిపారు.

13 ఒక రైతు విజయం ఎందరికో స్ఫూర్తి

వివిధ ప్రాంతాల వర్షపాతం, గాలిలో అందుబాటులో ఉన్న తేమ శాతాన్ని బట్టి మామిడి మొక్కల పూత ఆధారపడి ఉంటుంది. డిసెంబరు మాసంలో వర్షాలు అధికంగా పడే ప్రాంతాల్లో మామిడి మొక్కల పెరుగుదల ఎక్కువగా ఉంటుంది.

25 మామిడి పూత - తేనె మంచు పురుగుల నివారణ

ఆంధ్రప్రదేశ్‌లో పండించే విత్తన సుగంధ ద్రవ్య పంటలలో ధనియాలు ముఖ్యమైనది. ఈ పంట మన రాష్ట్రంలో సుమారు లక్ష హెక్టార్లలో సాగు చేయబడుతూ 27 వేల టన్నుల ఉత్పత్తిని ఇస్తుంది. రాష్ట్రంలో అన్ని జిల్లాలలోనూ ధనియాల పంట సాగు చేయబడుతుంది.

34 రబీలో దనియాల సాగు

కట్టె జనుముగా, కట్టెలుగా, తట్టెలుగా ఉత్తరాంధ్ర అంతటా పేరుమోసిన మొక్క. దీన్ని శాస్త్రీయంగా 'క్రొటలేరియా జన్సియా' అంటారు. ఇది చిక్కుడు జాతికి చెందిన మొక్క. దీని కాయలు వండేటప్పుడు గింజలు కదిలి గలగలమంటాయి.

44 రబీ, రైతుకు అదనపు ఆదాయాన్నిచ్చే 'కట్టె జనుము'

ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించి, ఆ జీవనంలోని బాధలను గమనించి, ఆ అనుభవాలను అక్షర నైవేద్యాలుగా తీర్చి దిద్దుకొని, తనకు తానే ఎవరి ఆసరా లేకుండా విజయ పరంపరలో దూసుకుపోతున్న వ్యక్తిత్వం ఆయనది. అపజయాలకు వెరవకుండా, తాను నమ్మిన బాటలో, తనదైన శైలిలో పురోగమన పథం వైపు దూసుకువెళుతున్నారు.

47 వడివడిగా.. ముందు యుగం దూతలా 'ఏలూరి'

రైతుల గుండెచప్పుడై మార్మోగుతున్న పాదయాత్ర

అడుగడుగునా 'అగ్రిక్లినిక్' అధినేతకు ఘనస్వాగతం

ప్రకాశం జిల్లా, పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గం పూర్తిగా గ్రామీణ వాతావరణాన్ని సంతరించుకొన్న ప్రాంతం. సేద్య జీవనంలో పచ్చగా వికసించిన ప్రముఖ నియోజకవర్గం. ఎందరో ప్రముఖులు ఈ ప్రాంతం నుండి రాజకీయంగా తారాపథానికి దూసుకుపోయారు. అంతే కాకుండా సినీ, సాంస్కృతిక వైభవానికి ప్రతీక, వాణిజ్య పంటల నిలయం. పత్తి, మిరప, మొక్కజొన్న, జనుము వంటి వాణిజ్య పంటలతో పాటు శెనగ సాగు విస్తారంగా జరిగే ప్రాంతం. పాగాకు సాగుకు ఈ నియోజకవర్గం రైతులు పెట్టింది పేరు. కోస్తాతీరంలోని మండలాల్లో వరి విస్తారంగా పండిస్తారు. ఉప్ప కొటార్లకు , మత్స్య పరిశ్రమలకు కూడా మారుపేరు. వైవిధ్య పంటలకు పెట్టింది పేరుగా ఉన్న ఈ నియోజక వర్గంలోని మార్టూరు మండలంలోని నర్సరీలు దేశవ్యాప్తంగా పేరుపొందాయి. నాగార్జునసాగర్ కుడికాలువ, కృష్ణబ్యారేజ్ నుండి నీటిని కొనివచ్చే కొమ్మమూరు కాలువ ప్రధాన నీటి వనరులు. ఇంకా చెరువులు, వాగులపై ఎత్తిపోతల పథకాలు, కుంటల ఆధారంగా కూడా సాగునీరును రైతులు వినియోగించుకుంటారు. కృష్ణానదిపై ఉన్న రెండు ప్రధాన ప్రాజెక్టుల ఆయకట్టు కాల్వలు, శివారు భూములు కావడంతో ఇక్కడి రైతులకు చాలినంతగా నీరు లభ్యంకావడంలేదు. అంతేకాకుండా ఎగువ జిల్లాల వారు తమ నీటి అవసరాలను అడ్డుకుంటున్నారనే నిరసన సర్వత్రా వ్యక్తమవుతున్నది.

ఈ నేపథ్యంలో ప్రముఖ వ్యవసాయ నిపుణుడు, వ్యవసాయ ఉత్పాదకాల కంపెనీ అధినేత, అగ్రిక్లినిక్ సంపాదకుడు ఏలూరి సాంబశివరావు పర్యాచారు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జిగా పదవీ బాధ్యతలను స్వీకరించి 500 కి.మీ మేర పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో చైతన్యాన్ని కలిగించడంతో పాటు రైతులకు గొప్ప స్ఫూర్తిగా పరిణమించింది. తన స్వగ్రామమైన కోణంకి నుండి మొదలై వలపర్లలో ప్రారంభమైన ఈ యాత్రలో అడుగడుగునా రైతులు ఎదుర్కొంటున్న సాగునీరు, తాగునీరు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా వంటి మౌలిక సమస్యలతో పాటు, సస్యరక్షణ, గిట్టుబాటు ధర వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. **ప్రతి గ్రామంలోనూ రైతులు, మహిళలు తమ సొంత సోదరుడు వచ్చినట్లు భావించి ఆత్మీయ స్వాగతాన్ని పలుకుతున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఆయన ముందు ఏకరువు పెడుతున్నారు. ప్రతిచోటా తనకున్న పరిజ్ఞానంతో రైతు సమస్యలకు పరిష్కారం చూపించే సత్తా ఒక్క తెలుగుదేశం పార్టీకే ఉందని వివరిస్తూ వివిధ చోట్ల పదునైన ప్రసంగాలతో, పరిష్కారాలు సూచిస్తూ రైతులను ఆకట్టుకుంటున్నారు.**

డిసెంబరు 15వ తేదీన మార్టూరు మండలం వలపర్ల గ్రామం నుండి పాదయాత్రకు వెళ్తూ మార్గమధ్యంలో నాగార్జునసాగర్ కుడికాలువ శివారు భూముల్లో నీటి కొరతను పరిశీలించారు. సాగర్ కాలువల నీటి సరఫరాలో ప్రకాశం జిల్లాకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు ఉద్యమించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.

వలపర్ల గ్రామంలో 25 ఏళ్ళ నుండి ఏ ప్రజానాయకుడూ తమ బస్తీని పట్టించుకోలేదని, ఓట్ల సమయంలో చేసిన వాగ్దానాలు నెరవేర్చలేదని వడ్డెర కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. గృహ నిర్మాణం, తాగు, సాగు నీటి సరఫరా సరిగ్గా జరగడం లేదని, పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉందని అక్కడి పౌరులు, రైతులు తెలిపారు. అదే గ్రామ శివారులోని ద్వారకపూడి గ్రామంలో పశువుల కాపరులను కలుసుకొని వారి సమస్యలను తెలుసుకున్నారు. వ్యవసాయం దండగ మారి వృత్తిగా మారిన సమయంలో పశుపోషణ, గొర్రెలు, మేకలు, పందుల పెంపకం ఆవశ్యకతను సాంబశివరావు వివరించారు.

డిసెంబరు 16వ తేదీన మార్టూరు వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా మార్చేందుకు, రైతులతో నిరంతర సంబంధాలను కొనసాగించి, వారిని వెన్నంటే ఉండేందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. ధరలు లేక, కొనుగోలు లేక రైతు దిగాలుపడుతున్న సమయంలో రైతు బజార్లను స్థాపించి, మార్కెట్ జోక్యంతో రైతులను ఓదార్చిన ఘనత చంద్రబాబుదేనని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రైతుల రుణాలను సంపూర్తిగా మాఫీ చేస్తామని వివరించారు.

డిసెంబరు 17వ తేదీన ఆయన పాదయాత్ర యద్దనపూడి మండలం డేగర్లమూడికి చేరుకుంది. ఆ గ్రామంలోని రైతులు, మహిళలు అందరూ కదిలివచ్చి స్వాగతం పలికారు. స్వాగతంతోపాటు రైతులు తమ సమస్యల తోరణాలను ఆయన ముందుంచారు. కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు కేంద్రం సమీపంలో లేకపోవడాన్ని సాంబశివరావు దృష్టికి తీసుకువచ్చారు. సుదూర ప్రాంతానికి పత్తిని తరలించే సమయంలో ఆలస్యం వల్ల పత్తి బరువు కోల్పోయి తమకు నష్టం కలుగుతోందని, వెంటనే సమీప ప్రాంతంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సమాధానంగా సాంబశివరావు సిసిఐకి వెంటనే లేఖ రాస్తానని తెలిపారు. అనంతరం ఆయన గ్రామంలోని వ్యవసాయ యంత్రాలను, వాటి పనితీరును పరిశీలించారు. అదేవిధంగా కోళ్ళ రైతుల సమస్యలను, పశుపోషణ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుండి చింతపల్లిపాడు వెళుతూ మార్గమధ్యంలో శెనగ, పొగాకు పొలాలను పరిశీలించారు. **పొగాకు క్షేత్రంలో టొబాకో మొజాయిక్ వైరస్ ఉన్నట్లు గమనించి ఆ పంటను రక్షించుకునే విధానాలను రైతుకు తెలిపారు.**

డిసెంబరు 18వ తేదీన అనంతవరం గ్రామంలో పాదయాత్ర చేసిన సందర్భంలో కూడా రైతాంగ సమస్యలపైనే ఎక్కువ దృష్టి సారించారు. పత్తి కొనుగోలులో ఎదురవుతున్న అడ్డంకులను రైతులు

ప్రస్తావించారు. ఆ గ్రామం నుండి విజనంపాడు వెళుతూ మార్గమధ్యంలో మహిళా రైతు కూలీలను పరామర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పత్తి పొలంలో పత్తి తీస్తున్న మహిళా కూలీలతో ముచ్చటించారు.

డిసెంబరు 19వ తేదీన యద్దనపూడి మండలం గన్నవరం బహిరంగ సభలో ప్రసంగిస్తూ వ్యవసాయాన్ని పవిత్రవృత్తిగానూ, రైతును విలువైన ఉత్పత్తిదారులుగానూ, సహజ సాంకేతిక నిపుణుడిగానూ గుర్తించే సమాజ ఆవిర్భావానికి కృషి చేస్తానని తెలిపారు.

డిసెంబరు 20వ తేదీన గన్నవరం నుండి ఆయన యద్దనపూడి మండలం పూనూరుకు చేరుకున్నారు. మార్గమధ్యంలో ఏటివడ్డున సాగు నీరు లభ్యత గురించి ఆరా తీశారు. మిరప క్షేత్రాలను దర్శించి సస్య యాజమాన్యంపై రైతులతో యిష్టాగోష్టిలో పాల్గొన్నారు. బొబ్బేపల్లి గ్రామంలో నర్సరీ రైతుల స్థితిగతులను పరిశీలించి, పరిష్కార మార్గాలను సూచించారు. అనంతరం రాజుగారుపాలెంలో రాత్రి 1 గంట వరకు పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. **మార్టూరు మండలం, రాజుగారుపాలెంకు ఉన్న విశిష్టత, సుస్థిర వ్యవసాయ గ్రామంగా దానికున్న పేరు ప్రఖ్యాతులు, రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శ గ్రామంగా వెలుగొందుతున్న తీరును ఆయన ప్రశంసించారు. తన పాదయాత్ర అనంతరం రాజుగారుపాలెం ప్రజలకు తన నిపుణతను, అనుభవాన్ని చూపెట్టి మరింత ప్రత్యేక ప్రాభవాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఇక్కడి ఆదర్శ రైతుల తలలో నాల్కలా పనిచేస్తానని అన్నారు.**

డిసెంబరు 21వ తేదీన రాజుగారుపాలెం నుండి బయలుదేరి వెళుతూ మార్గమధ్యంలో దొండ రైతులతో మాట్లాడి వారి సమస్యలను పంటల తీరును ప్రస్తావించారు. చిమ్మిరిబండ గ్రామం నుండి ద్రోణాదులకు వెళుతూ మధ్యలో నాగార్జునసాగర్ కాలువ స్లూయిస్ దగ్గర మధ్యాహ్నం విరామం తీసుకుని అక్కడి ఆయకట్టు ప్రాంతంలో నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

డిసెంబరు 22వ తేదీన **కోలలపూడి గ్రామాన్ని సందర్శిస్తున్న సందర్భంలో తుంపర్ల సేద్య వ్యవస్థతో శెనగ పంట పండించడాన్ని గమనించారు.** నాగార్జునసాగర్ జలాల అస్థవ్యస్థ సరఫరాతో, నీటి యాజమాన్యానికి ఏర్పడుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు రైతులు అమలు చేస్తున్న ఈ పరిజ్ఞానం అంతటా వ్యాప్తి చెందాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. **బొల్లాపల్లిలో వరిని కుప్పలుగా వేస్తున్న పొలాలను పరిశీలించారు. నూర్పిడి యంత్రాల అవసరాన్ని గుర్తు చేశారు.**

డిసెంబరు 23వ తేదీన పాదయాత్ర ప్రారంభంలోనే పూసపాడు అడ్డరోడ్డులో బ్రహ్మాండమైన రైతు సదస్సును నిర్వహించారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వివిధ పంటల్లో నిష్ణాతులైన రైతన్నలను సాంబశివరావు పట్టుశాలువాలతో, పూలమాలలతో సత్కరించారు.

నాడు పచ్చని చేలలో...నేడు ప్రజల మధ్య రైతు దినోత్సవం :

అగ్రిక్లినిక్ మాసపత్రిక సంపాదకుడిగా, నాణ్యమైన వ్యవసాయ ఉపకరణాల సరఫరా దారుగా ఏలూరి సాంబశివరావు క్రమం తప్పకుండా గత మూడేళ్ళుగా రైతు దినోత్సవాన్ని ఘనంగా

నిర్వహిస్తున్నారు. రైతు ఆత్మగౌరవం, ఆహార భద్రతకు మూల పురుషుడిగా చేస్తున్న సేవలు సమాజం గుర్తింపుకురావడంలేదని, ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, ఈ రంగం పట్ల ప్రదర్శిస్తున్న సాచివేత వైఖరి రైతులను నష్టాలవైపు, వివక్షత వైపు నెట్టివేస్తున్నాయి. స్వయంగా తన బాధలను ఇతరులతో పంచుకోలేని రైతు బిడ్డలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రపంచంలో ఏ ఉత్పత్తి దారునికీ జరగనంత అన్యాయం రైతుకు జరుగుతుంది. ఈ పరిస్థితి నుండి ఒక వ్యవసాయ విద్యావేత్తగా సాంబశివరావు రైతు దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహిస్తూ తన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారు.

గత సంవత్సరం మెదక్ జిల్లా, జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో పంట పొలాల మధ్య 300 మంది రైతు సోదరులకు సన్మానం చేసి, మూడు రోజులపాటు రైతు దినోత్సవాన్ని నిర్వహించారు.

పల్లె పల్లెకూ తెలుగుదేశం పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్న ఆయన తన పర్యటనలో రైతు సమస్యలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబరు 23వ తేదీని మాజీ ప్రధాని, ఝూట్ రైతు నేత చరణ్‌సింగ్ జ్ఞాపికగా జాతీయ రైతు దినోత్సవాన్ని జరుపుకుంటున్న వైనం అందరికీ తెలిసిందే. అయితే అన్ని వర్గాల దినోత్సవాలను ఘనంగా నిర్వహించే సమాజం కానీ, మీడియా కానీ రైతు దినోత్సవానికి ప్రాధాన్యత ఇవ్వని నేపథ్యంలో సుదీర్ఘ పాదయాత్ర సమయంలో తాను నిర్వహించి తీరాలని భావించి ఇంకొల్లు మండలంలోని పూసపాడు అడ్డరోడ్డు వద్ద ప్రత్యేక వేదికను సాంబశివరావు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ పంటల్లో నిష్ణాతులైన 16 మంది భూమిపుత్రులను పట్టుశాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు.

సమాజమే దేవాలయమని, పేదవాడే దేవుడని ప్రవచించిన మహనీయుడు డా॥ నందమూరి తారక రామారావు స్ఫూర్తితో తాను చిన్న నాటి నుండి రైతుల కష్టాలను గమనించానని, తన తాత, తండ్రులు పడుతున్న కష్టాలను, కన్నీటి సేద్యాన్ని దగ్గరుండి చూశానని వివరిస్తూ, ఇతర ఉన్నత విద్యావకాశాల, లాభసాటి వృత్తులు ఎన్ని ఉన్నా వ్యవసాయ విద్యకే ప్రాధాన్యతనిచ్చి, జీవితాన్ని రైతుల సేవకే అంకితం చేశానని తెలిపారు. డా॥ నందమూరి స్ఫూర్తితో పాటు ఈ ప్రాంతపు ప్రముఖులు స్వర్గీయ కాకాని వెంకటరత్నం, ధూళిపాళ వీరయ్యచౌదరి, ఆచార్య ఎన్.జి.రంగా, డా॥ యలమంచలి శివాజీ, వడ్డే శోభనాద్రీశ్వరరావు, డా॥ ఆలపాటి సత్యన్నారాయణ వంటి రైతు బాంధవులు, ఆపద్బాంధవుడిగా వ్యవహరించి, సకాలంలో రైతులను ఆదుకున్న దార్శనిక ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు సకాలంలో చేసిన సేవలు, నాణ్యమైన విద్యుత్ సరఫరా తనను ఆకర్షించాయని వివరించారు.

వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా రూపొందించాలని, కాలికి బలపం కట్టుకొని రైతుల కొరకు దీక్ష చేసి, ఊరూరా పాదయాత్రతో రైతాంగానికి స్ఫూర్తి కలిగిస్తున్న చంద్రబాబు తనను ఆహ్వానించి, పర్చూరు వంటి చారిత్రాత్మక నియోజక వర్గానికి బాధ్యుడిని చేసి, ఇక్కడ ప్రధాన వర్గమైన రైతులకు సేవ చేయడానికి అవకాశమిచ్చారని తెలిపారు. ఆయన ఇచ్చిన ఈ గౌరవాన్ని నిలబెట్టుకొని పర్చూరులో తెలుగుదేశం పార్టీ జండాతో పాటు రైతుల ఆత్మగౌరవ పతాకను ఎగురవేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చట్ట సభల్లో రానురాను రైతు ప్రతినిధులు తగ్గిపోతున్నారని, రైతు బిడ్డగా, వ్యవసాయ నిపుణునిగా, ఆధునిక వ్యవసాయ వేత్తగా, చిరకాలం రైతాంగ సేవకు అంకితమైన తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు.

ఈ సందర్భంగా రైతులు బండారుపల్లి శ్రీనివాసరావు, బోడావుల నాగేశ్వరరావు, పర్చూరి ఏడుకొండలు, అంబటి శరణ్, మద్దుకూరి బ్రహ్మం, గొర్రె పూర్ణ, పర్చూరి హరిబాబు, భవనం శ్రీనివాసరెడ్డి, పిడపర్తి శివారెడ్డి, పులగం కోటేశ్వరరావు, టి. శ్యామ్యూల్, కె. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రైతు దినోత్సవ సభలో తెలుగు రైతు రాష్ట్ర నాయకులు కోటా సాంబశివరావు, జాగర్లమూడి అనీల్‌బాబు, కోణంకి నీటి సంఘం అధ్యక్షులు, ఉప్పలపాటి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

– అగ్రిక్లినిక్ రిపోర్టర్

ఈము పక్షుల పెంపకంలో మెలకువలు

- డా॥ సి.హెచ్ రమేష్, హైదరాబాద్, ఫోన్ : 9966208899

ఆటీవల కాలంలో ఈము పక్షుల పెంపకం 5 శాతం సగటు అభివృద్ధి రేటుతో రోజు రోజుకూ వృద్ధి చెందుతోంది. మన దేశంలో కేవలం 2 దశాబ్దాల నుండే ప్రారంభమైన ఈము పక్షుల పెంపకంపై శాస్త్రీయపరమైన మెలకువల్ని పెంపకందార్లకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈము పక్షుల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులను ఆచరించడం వల్ల పక్షుల పెంపకందార్లు ఆర్థికంగా అభివృద్ధి చెందగలుగుతారు. కాబట్టి పెంపకందార్లు ఈము పక్షి పిల్లల సంరక్షణ, ఆహారం, ప్రునరుత్పత్తి, ఆరోగ్యం, మేళైన యాజమాన్య పద్ధతుల ఆచరణ మొ॥ విషయాల్లో శ్రద్ధ వహించాలి.

ఈము పక్షి పిల్లల సంరక్షణ :

- పిల్ల వయస్సులో సంభవించే మరణాల్ని నివారించాలి. ఒక చిన్న పిల్ల మరణిస్తే, భవిష్యత్‌లో నష్టం వేలల్లో ఉంటుంది.
- పుట్టిన పిల్లల్లో కాలి సమస్యలను, లెగ్ బ్యాండ్స్ వేసి నివారించాలి.
- ఫారాల్లో పిల్లల్లో మరణాలు 10 శాతం కంటే మించకుండా శ్రద్ధ తీసుకోవాలి.
- పిల్లలకు 4-6 వారాల పాటు సరిపోను ఉష్ణోగ్రత దగ్గర బ్రూడింగ్ చేయాల్సి ఉంటుంది.
- పిల్లలు జారిపడిపోకుండా గోనె సంచుల్నిగాని, కాన్వాస్‌గాని పరవాలి.
- శీతాకాలంలో జన్మించిన పిల్లలు, చలిగాలుల బారిన పడకుండా సంరక్షించాలి.
- చిన్నపిల్లలప్పుడే కాలిగోర్లను కత్తిరించాలి.

ఆహారం :

- ఈము పక్షుల వయస్సును దృష్టిలో ఉంచుకుని మాంసకృత్తులు, శక్తినందించే విధంగా దాణా తయారు చేసుకుని అందించాలి.
- తాజా,పరిశుభ్రమైన నీటిని తాగేందుకు అన్నివేళలా అందుబాటులో ఉంచాలి.
- ఆహారంలో మాంసంపొడి, చేపల పొడి వాడకూడదు.
- అందించే ఆహారంలో అకస్మాత్తుగా మార్పులు చేయకూడదు.
- ఆహారంతో పాటు కొద్ది మోతాదులో క్యారెట్, లూసర్ను, అజొల్లా, కూరగాయలు, ఆకు కూరల్ని తరిగి అందించవచ్చు.
- దాణాలో ఇనుప ముక్కలు, సూదులు, ప్లాస్టిక్ పదార్థాలుండకుండా జాగ్రత్త వహించాలి.
- వివిధ సైజుల తాళ్ళను, గులకరాళ్ళను గ్రిట్‌ను అందిస్తే ఆహారం త్వరగా జీర్ణమవడానికి దోహదపడుతుంది.

ఆరోగ్యం :

- గాయాలున్న పక్షుల్ని వెంటనే వేరుచేసి చికిత్స చేయించాలి.
- ప్రతి 6 నెలల కొకసారి "ఐవర్ మెక్టిన్" ఇంజక్షన్ వేయించాలి.
- ప్రతి మూడు మాసాలకొకసారి ''కాల్షియం ద్రావణం'' తాగించాలి.
- సంవత్సరానికొకసారి "ఆర్.డి. టీకాలు" వేయించాలి.

పునరుత్పత్తి :

- కేవలం పక్షుల సంఖ్యకు ప్రాముఖ్యతనివ్వకుండా గుడ్లు పెట్టే సామర్థ్యం, మగ పక్షి సామర్థ్యం వంటి నాణ్యతా ప్రమాణాలకు ప్రాముఖ్యతను ఇవ్వాలి.
- మగ, ఆడ పక్షుల మధ్య అనుగుణం ఉండే విధంగా శ్రద్ధ తీసుకోవాలి.
- గుడ్లను జాగ్రత్తగా సేకరించి, ఇంకుబేషన్ చేయాలి.
- గుడ్ల హచబులిటి 80 శాతం కంటె ఎక్కువగా ఉండేట్లు శ్రద్ధ తీసుకోవాలి.

యాజమాన్య పద్ధతుల ఆచరణ :

- ఫారాల్లోనికి అడవి జంతువులు, కుక్కలు, ఎలుకలు, కప్పలు, కొత్త వ్యక్తులు రాకుండా చూసుకోవాలి.
- రెట్టను ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలి.
- ఈము పక్షులకు తన్నే అలవాటుంటుంది.
- ఈము పక్షులు శబ్దాలకు బెదిరిపోకుండా, ఫారాల్లో ప్రశాంత వాతావరణం కల్పించాలి.
- దాణా తొట్లను, నీటి పాత్రలను ప్రతిరోజు శుభ్రపరుస్తుండాలి.
- పక్షుల సమీపంలో మొనదేలిన వస్తువులు, మేకులు ఉండకుండా జాగ్రత్త వహించాలి.

ఈము పక్షుల పెంపకంలో....

ప్రధాన ఆదాయం పక్షి శరీరంలోని కొవ్వును ప్రాసెసింగ్ చేయగా వచ్చే నూనె ద్వారా సుమారు 14-16 వేల వరకు ఉంటుంది. ఆ తరువాత మాంసం ద్వారా అధిక ఆదాయం లభిస్తుంది. ఇక పక్షుల్ని పెంచి, పిల్లల్ని ఉత్పత్తి చేస్తూ, ఔత్సాహికులకు మార్కెటింగ్ చేసుకుంటూ పోతుంటే, 50 జతల పక్షులపై సుమారు 20 సంవత్సరాలపాటు ప్రతి ఏటా రూ. 40 లక్షల ఆదాయం పొందే వీలుంటుంది. పక్షుల్ని శాస్త్రీయ పరంగా పోషించడం, కొవ్వు ప్రాసెసింగ్‌కు ప్లాంట్‌లు స్థాపించబడడం, మాంసం వినియోగం పట్ల అవగాహన పెంపొందించడం, ఔత్సాహికులకు సహకరించడం ద్వారా పక్షుల పెంపకం లాభసాటిగా మారుతుందని గమనించాలి. ❊

అధిక ఆదాయం కోసం అంతర పంటలు

డా॥ సి.హెచ్ శ్రీలతావాణి, డా॥ పి. కిశోర్‌వర్మ
డా॥ బి. గోవిందరావు, అశ్వరావుపేట, ఖమ్మం, ఫోన్ : 9705799100

మనకు ఉన్న సహజ వనరులైన నీరు, నేల సక్రమంగా వినియోగించుకొని రైతులు నికర ఆదాయం పొందుటకు అంతర పంటలు మంచి అవకాశం. అంతర పంటలు అంటే రెండు లేదా అంతకంటే ఎక్కువ పంటలు ఒకే పొలంలో నియమిత నాళ్ళలో వేయడం, పంటల సాంద్రతను బట్టి అంతర పంటలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. మొదటిది సిఫార్సు చేసిన వందశాతం మొక్కలను ముఖ్యపంటగా విత్తి, దీనికి అదనంగా అంతర పంటలను వేసుకోవడం. రెండో పద్ధతిలో ముఖ్యపంటకు సిఫార్సు చేసిన వంద శాతం సంఖ్యను తగ్గించి దాని స్థానంలో అంతర పంటలను వేసుకోవడం.

అంతర పంటలు ముఖ్యంగా మెట్ట సేద్యంలో చాలా లాభదాయకం. వర్షాధారంగా అంతర పంటలు వేయడం వల్ల బెట్ట పరిస్థితుల్లో ఒక పంట రాకపోయినా మరో పంట వచ్చే అవకాశం ఉంది. దీని వల్ల రైతు ఆర్థికంగా నుస్థిరంగా ఉండటానికి సహాయపడుతుంది. ప్రకృతి వైపరీత్యాల నష్టాన్ని తగ్గించుకొనడానికి ఇది ఒక మార్గం.

అంతర పంటల వల్ల ప్రయోజనాలు :

- ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఒక పంట దెబ్బతిన్నా, మరొక పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు ఎక్కువ దిగుబడి సాధించడానికి దోహదపడతాయి.
- నీరు, పోషక పదార్థాలు సమర్థవంతంగా వినియోగపడతాయి.
- నేలకోత అరికట్టి భూమి యొక్క సారాన్ని పెంచవచ్చు.
- పంటల దిగుబడి నిలకడగా ఉంటుంది.
- మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండడం వల్ల కలుపు సమస్య తక్కువగా ఉంటుంది.
- సరైన పద్ధతిలో సరైన పంటలను ఎన్నుకొని అంతర పంటలుగా పండిస్తే సహజ శత్రువుల్ని పెంపొందించి ప్రధాన పంటపై ఆశించే చీడపీడలను అరికట్టవచ్చు.

మొక్కజొన్న :

రెండు మొక్కజొన్న సాళ్ళ మధ్య ఒక సాలు కంది పంటను లేదా 6 సాళ్ళ వేరు శనగ లేదా 6 సాళ్ళ అపరాలను వేసుకున్నట్లయితే రైతుకు లాభదాయకంగా ఉంటుంది. వరుస క్రమ పంటగా ఎక్కువ పప్పు జాతికి చెందిన పంటలు ముఖ్యంగా వేరుసెనగ రబీలో విత్తుకోవడం వల్ల తదుపరి వచ్చే ఖరీఫ్ మొక్కజొన్నకు భూమిలో స్థిరీకరించిన నత్రజని లభ్యమై రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చు.

కంది :

కంది మరియు ఇతర పంటల నిష్పత్తులు

కంది + జొన్న / మొక్కజొన్న / సజ్జ - 1:2 నిష్పత్తులు
కంది + పెసర / మినుము / సోయా చిక్కుడు / వేరుశనగ -1 : 7 నిష్పత్తిలో

రాగులు :

రాగితో కందిని (8 : 2) లేక చిక్కుడు (8:1) నిష్పత్తిలో సాగు చేయవచ్చు. దానిలో రాగి వరుసల మధ్య దూరం 30 సెం.మీ, మొక్కల మధ్య దూరం 10 సెం.మీ, కంది వరుసల మధ్య దూరం 60 సెం.మీ, మొక్కల మధ్య దూరం 20 సెం.మీ పాటించాలి. చిక్కుడు మొక్కల మధ్య దూరం 20 సెం.మీ పాటించాలి.

పెసర :

పెసరను అంతర పంటగా పత్తి కందిలతో వేసుకోవచ్చు. పెసర, పత్తి, రబీకంది-3 : 1, పెసర తొలకరి కంది -7 : 1 అంతర పంటకు అనువైన పెసర రకాలు -యల్.జి.జి.460, 450, 410, యం.జి.జి-295, డబ్ల్యు.జి.జి-2, 37, యం.యల్స్-267. పెసరను పత్తి లేదా రబీ కందితో అంతర పంటగా వేసినప్పుడు 6 కిలోల విత్తనం, 7 కిలోల నత్రజని, 17.5 కిలోల భాస్వరం ఎకరానికి వేయాలి.

సోయా చిక్కుడు :

సోయా చిక్కుడును కంది (1:7), పత్తి, మొక్కజొన్న (1:1) మరియు పండ్ల తోటల్లో అంతర పంటగా సాగు చేయవచ్చు. తొలకరిలో సోయా చిక్కుడు తరువాత శనగ లేదా ఆవాలు లేదా మినుము సాగు చేస్తే వాణిజ్య పంటల కంటే అధిక ఆదాయం పొందవచ్చు.

వేరు శనగ :

ప్రతి 7 లేదా 10 సాళ్ల వేరు శనగకు ఒక సాలు కంది వేసుకుంటే కంది నుండి సగటున 2-3 క్వింటాళ్ళ దిగుబడి ఒక ఎకరాకు వస్తుంది. వర్షాధార వేరు శనగ పంటలో ప్రతి 7 వేరుశనగ సాళ్ళకు ఒక సాలు ఆముదం కూడా వేసుకోవచ్చు. ప్రతి ఆరు సాళ్ళ వేరు శనగకు రెండు సాళ్ళు సజ్జను కూడా వేసుకోవచ్చు.

పొద్దు తిరుగుడు :

దీన్ని ఏక పంటగానూ లేదా వేరు శనగ + పొద్దు తిరుగుడు 4:2, కంది + పొద్దుతిరుగుడు 1 : 2, పైర్లతో అంతర పంటగా పండించుకోవచ్చు. పొద్దు తిరుగుడు వేరు శనగ మరియు కందితో వేసుకున్నట్లయితే 36 శాతం మరియు 24 శాతం అదనపు ఆదాయం వస్తుంది. పొద్దు తిరుగుడును కందితో 4 : 2 శాతం నిష్పత్తిలో వేసినట్లయితే 2 : 4 నిష్పత్తి కంటే ఎక్కువ దిగుబడి వస్తుంది.

పత్తి :

వర్షాధార పంటగా పత్తి వేసుకున్నట్లయితే

పత్తి + ఉల్లి	-	1:5 నిష్పత్తిలో
పత్తి + మిరప	-	1:1 నిష్పత్తిలో
పత్తి + వేరుశెనగ	-	1:3 నిష్పత్తిలో
పత్తి + సోయాచిక్కుడు	-	1:3 నిష్పత్లిలో

తక్కువ వర్షపాతం గల ప్రాంతాల్లో దేశీ పత్తి + ఉల్లి + కొత్తిమీర మరియు దేశీపత్తి + ఉల్లి + మిరప. రిలే పంటలు లాభదాయకం. పత్తి మరియు మొక్కజొన్న అంతర పంటలుగా వేయడం వల్ల దిగుబడి పెరగడంతో పాటు పురుగుల ఉధృతి తగ్గినట్లు గుర్తించారు.

చెరకు :

చెరకులో అంతర పంటగా పెసర, మినుము, సోయా చిక్కుడు, వేరుశెనగ, బెండ, ఉల్లి, బంగాళాదుంప, తేలిక నేలల్లో పెసర, సారవంతమైన నేలల్లో సోయా చిక్కుడు, మినుము వేసుకోవచ్చు. బోదెలను చదును చేసి చెరకు నాటే రోజునే అంతర పంటలను బోదెలపై వరుసల్లో నాటు కోవాలి. సాళ్ళ మధ్య 80-100 సెం.మీ ఎడం ఉన్నప్పుడు పెసర, మినుము, సోయా చిక్కుడు, వేరు శనగ పంటలను రెండు వరుసల్లో నాటుకోవాలి. ఈ విధంగా చేయడం వల్ల పరాన్న భుక్కుల సంఖ్య పెరిగి పీక పురుగు ఉధృతి తగ్గుతుందని పరిశోధనలో తేలింది.

పసుపు :

పసుపులో మొక్కజొన్న, ఆముదం సాగు లాభదాయకంగా ఉంటుంది. రెండు వరుసల పసుపు, ఒక వరుస మొక్కజొన్న కొన్ని ప్రాంతాల్లో వేస్తున్నారు. అదే విధంగా ఆముదాన్ని అంతర పంటగా 10-12 పసుపు సాళ్ళకు ఒక వరుస చొప్పున నాటవచ్చు. మొక్కజొన్న లేదా ఆముదం పంటలను అంతర పంటగా వేసినప్పుడు రెండు పంటలకు సిఫార్సు చేసిన ఎరువులు వేయాలి. పసుపును కొబ్బరి, మామిడిలో అంతర పంటగా పెంచుటకు 60 × 20 సెం.మీ దూరంలో నాటిన ఎడల అధిక దిగుబడులను పొందవచ్చు. పి.టి.యస్-43, సుగుణ, ఎ.సి.సి-360 అను రకాలు అంతర పంటలు గా అనుకూలమైనవి.

పాటించవలసిన జాగ్రత్తలు :

- పంటలను అవసరాన్ని అనుసరిస్తూ వేర్వేరు సమయాల్లో విత్తాలి.
- అంతర పంటలుగా సాగుచేసే రెండు పంటల మధ్య పోటీ ఉండకూడదు.
- ప్రధాన పంట అంతర పంటలు ఒకేసారి కోతకు రాకూడదు. కనీసం 30 రోజుల వ్యవధి ఉండాలి.
- ధాన్యపు పంటల్లో అంతర పంటగా పప్పుజాతి పంటలు వేసినట్లయితే అంతర పంటకు వేరుగా నత్రజని ఎరువు అవసరం తగ్గుతుంది. భాస్వరం, పొటాష్ కూడా సిఫార్సు చేసిన దానిలో 4వ వంతు వేస్తే సరిపోతుంది. ❋

ఒక రైతు విజయం ఎందరికో స్ఫూర్తి

రైతు వివరములు :
జక్కంపూడి వీరాంజనేయులు
సూరేపల్లి గ్రామం, కంభం మండలం, ప్రకాశం జిల్లా.
ఫోన్ : 9963669386

కృషి ఉంటే కలదు సుఖం అని పెద్దలన్నారు. కృషీవలుడి దార్శనికత మరెందరికో మార్గదర్శకమవుతుంది. నష్టాలు వచ్చినా, కష్టాలు పడినా, కన్నీటి పర్యంతంగా దు:ఖించినా రైతన్న తన నిత్య వ్యవసాయ జీవనాన్ని నిరంతరం కొనసాగిస్తూనే ఉంటాడు. దశాబ్దాలుగా, మిరప, పత్తి పంటలు తమకు కన్నీటినే మిగిల్చినా విరక్తి చెందక పలు ఆధునిక ప్రయోగాలతో ముందుకు వెళుతూనే ఉన్నారు. మార్కెట్‌లో ధరల అస్థవ్యస్త పరిస్థితి కలవర పరుస్తున్నా అంతర్జాతీయ మార్కెట్ కలిగిన ఈ రెండు పంటలను ఏదో ఒక రోజు కలిసి వస్తుందనే ఆశతో ప్రేమగా పోషిస్తూనే ఉంటారు. ఇలాంటి ఆలోచనా ధోరణి గల జక్కంపూడి వీరాంజనేయులు ప్రకాశం జిల్లా, కంభం మండలం, సూరేపల్లి గ్రామానికి చెందిన వారు. మిరప సాగులో ఆయకు ఆయనే సాటి. ఎంతటి వ్యవసాయ నిపుణుడైనా ప్రకృతి తాకిడికి, పురుగులు, వైరస్‌ల దెబ్బకు కుదేలైపోవలసిందే.

2010వ సంవత్సరంలో 10 ఎకరాల మిరప తోట వేసిన ఆంజనేయులు వ్యాధుల దెబ్బకు దాదాపు పంటను వదిలేసుకున్నారు. విపరీతంగా ప్రబలిన పురుగులు మిరప చెట్లను కొరికి తినేసి, శిథిలావస్థకు చేరుకున్న దశలో ఎవరో ఆయనకు నోవా అగ్రిటెక్ కంపెనీ వారి ఉత్పాదనల గురించి తెలిపారు. ఆనోటా ఈనోటా నోవా మందుల గురించి, వాటి లభ్యత గురించి స్వంతంగా ఆరాతీసి ఎవరి ప్రమేయం లేకుండా తెచ్చుకొని శిథిలావస్థలో ఉన్న మిరప పంటను పునరుజ్జీవనం చేసుకున్నారు. పూర్తిగా వదలివేద్దామని అనుకున్న పంట ఎకరాకు 32 క్వింటాళ్ళ దిగుబడితో ఆ రైతన్న గట్టెక్కడానికి ఈ మందులు తోడ్పడ్డాయి. దానితో ప్రతి సంవత్సరం నోవా వారి మిత్ర్, స్వర్ణ, జయం, పండర్ ప్లస్ మందులను ఖచ్చితంగా వినియోగిస్తూ, లాభసాటి వ్యవసాయం వైపు వీరాంజనేయులు

ముందుకు నడుస్తున్నారు. గత సంవత్సరం వర్షాలు లేక, తీవ్రమైన నీటి కొరత ఉన్నా కూడా ఆంజనేయులు ఎకరాకు 27 క్వింటాళ్ళ దిగుబడిని సృష్టించి రికార్డు స్థాపించారు.

ఈ సంవత్సరం 27 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్న వీరాంజనేయులు ఇప్పటి వరకు 8 ఎకరాల మిరప పొలంలో తొలివిడతగా మిత్ర్‌ను ఆ తరువాత స్వర్ణను వినియోగించారు. రెండవ విడత జయంను వినియోగించి ప్రస్తుతం మొదటికాయ కోతను ప్రారంభించారు. ప్రకాశం జిల్లాలో **అత్యంత నీటి కొరత ఉన్న ఈ ప్రాంతంలో మొక్కను సజీవంగా ఉంచి నీటిని సద్వినియోగం చేయగల నీటిలో కరిగే వండర్ ప్లస్‌ను మూడవ విడతకు వినియోగించడానికి సిద్ధపడ్డారు. పూత దశలో జట్‌ఫ్లవర్‌ను వినియోగించి కాపు బాగా విస్తారంగా ఉండే విధంగా చూసుకున్నారు.**

అదేవిధంగా 5 ఎకరాల్లో పండిస్తున్న పత్తి పంటకు సూపర్ 789ను, పోషకాల వృద్ధికి కే-మ్యాగ్‌ను, సస్యరక్షణకు ఎన్-కౌంటర్‌ప్లస్‌ను, పంచామృతాన్ని విస్తృతంగా వాడారు. 10 ఎకరాల్లో వేసిన శెనగ పంటను జయం, స్వర్ణ బ్రహ్మాండంగా ఆదుకున్నాయి. పూత సమయంలో ఒక 5 ఎకరాలకు వి-స్టాప్‌ను, మరో 5 ఎకరాలకు జట్-ఫ్లవర్‌ను వినియోగించగా పూత నిలబడేటందుకు, అధిక దిగుబడి ఇచ్చేందుకు తోడ్పడింది.

వినూత్నమైన సస్యరక్షణ చర్యలు మిగిలిన ప్రాంతాల రైతును కూడా ఆకర్షించాయి. ప్రస్తుతం వీరాంజనేయులు అనేక వందల మంది రైతులకు సుస్థిరమైన, సురక్షితమైన, రసాయన రహిత పంటలు పండించడంలో మార్గదర్శకులైనారు. కంభం, గిద్దలూరు, మార్కాపురం మండలాల్లో, నోవా మందుల ప్రతిభను అనేక మంది కొనియాడడంలో వీరాంజనేయుల పాత్ర విశిష్టమైనది. ప్రతికూల పరిస్థితుల్లో ఆంజనేయులు కష్టాలకడలి నుండి గట్టెక్కి, ఇతర రైతుకు స్ఫూర్తిగా నిలవడానికి కారణం నోవా అగ్రిటెక్ కంపెనీ నిపుణుల సహకారమేనని ఆంజనేయులు అగ్రిక్లినిక్ ప్రతినిధులకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

నోవా మందుల విశిష్టత :

సహజంగా మిరప పంటను తెల్లదోమ ఆశిస్తుంటుంది. పంటపై బొబ్బర కనిపిస్తుంటుంది. పైముడత, కిందిముడతలు ఏర్పడి ఆకులను నాశనం చేసి పంటకు నష్టం కలిగిస్తాయి. ఈ పరిస్థితులను నివారించడానికి ఆంజనేయులు నాలుగు సార్లు ఎన్‌కౌండర్ ప్లస్‌ను, రెండు సార్లు కిన్మోవాను వినియోగించారు. బూడిద తెగులు, బూజుతెగులు కాయపై మచ్చలు లేకుండా ఈ మందులు కాపాడాయి. నాణ్యమైన మిరప దిగుబడుల వల్ల ఆంజనేయులుకు అధిక ధర కూడా లభించనుంది. *

- అగ్రిక్లినిక్ డెస్క్

వేరుశనగలో సస్యరక్షణ

జి. చిట్టిబాబు, శాస్త్రవేత్త, ఏరువాక కేంద్రం, ఆదిలాబాద్,
బి.స్వాతి, వ్యవసాయ కళాశాల, బాపట్ల.

భారత దేశం వేరుశనగ ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉంది. దేశ వ్యాప్తంగా సగటు ఉత్పత్తి 745 కేజి/హె. మన రాష్ట్రంలో వేరుశనగ 17.71 లక్షల హెక్టార్లలో సాగు చేయబడుతుంది. సగటు ఉత్పాదకత 1074 కేజి. / హె. ఇంత ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయబడినప్పటికీ సగటు ఉత్పత్తిలో తగ్గుదలకు గల ముఖ్యకారణం వేరుశనగను ఆశించే చీడలు-పీడలు అని చెప్పవచ్చు. అనేక రకాలైన పురుగులు వేరుశనగను ఆశించి తీవ్ర నష్టం కలుగజేస్తాయి. వాటి వివరాలు, నష్ట లక్షణాలు, నివారణ చర్యలు తెలుసుకుందాం.

రసం పీల్చే పురుగులు (పేనుబంక, పచ్చదోమ, తామర పురుగులు) :

పేను బంక :

ఇవి చిన్న పరిమాణంలో ఉండి, పసుపు పచ్చ లేదా ముదురు ఆకుపచ్చ నుండి నలుపు రంగులో ఉంటాయి. వీటి యొక్క తల్లి, పిల్ల పురుగులు మొక్క లేత భాగాలైన లేత ఆకులు, లేత కాండం, చిగురులను పూతలనుండి రసాన్ని పీలుస్తాయి. దీనివల్ల మొక్కల ఎదుగుదల ఆగిపోయి గిడసబారి ఉంటాయి. ఆకులు వంకరలు తిరిగి ఉంటాయి. అంతే కాక ఇవి స్రవించే తేనె వంటి జిగురు పదార్థం వలన నల్లటి శిలీంధ్రజాల పెరుగుదల అధికంగా ఉంటుంది. ఆకులపై నల్లటి మసి పూతను గమనించవచ్చు. అంతేకాక ఇవి వైరస్ తెగులుకు వాహకాలుగా పని చేస్తాయి.

సస్యరక్షణ / నివారణ :

★ పేను బంక గుర్తించిన ఆకులను, కొమ్మలను కత్తిరించి వేయడం.

★ ట్రైకోడెర్మా విరిడి (4గ్రా./కిలో విత్తనానికి) తో విత్తన శుద్ధి చేయడం.

★ తొలుత వేపకాయల కషాయం 5% పిచికారి చేసుకోవాలి.

★ పురుగు యొక్క సంఖ్య ఆర్థిక నష్టపరిమితి దాటినట్లైతే మోనోక్రోటోఫాస్ 36 శాతం – 300 మి.లీ. లేదా డైమిథోయేట్ 30 శాతం– 300 మి.లీ. మందును 200 లీ. నీటికి కలుపుకుని ఎకరానికి పిచికారి చేయాలి.

పచ్చదోమ :

వీటి యొక్క తల్లి పిల్ల పురుగులు ఆకుల మధ్య భాగాలలో ఉండి రసం పీలుస్తాయి. ఇవి ఆకులలోకి విషపూరిత స్రవాన్ని స్రవించడం వల్ల ఆకుల ఈనెలు తెల్ల రంగులోకి మారి ఆకుల చివరల వద్ద "v" ఆకారపు పసుపు పచ్చ మచ్చలు ఏర్పడుతాయి. దీనివల్ల పంట మొత్తం పసుపురంగుకు మారి కాలిపోయినట్లుగా కనిపిస్తుంది.

★ తట్టుకునే రకాలను సాగు చేయడం.

★ పంట మార్పిడిని అవలంబించడం.
★ అంతర పంటగా సజ్జను వేసుకోవాలి.
★ ఆముదాన్ని అంతర పంటగా వేయరాదు. దీనివల్ల ఉధృతి అధికమవుతుంది.
★ పొలంలో ఉండే మిత్ర పురుగులను సంరక్షించాలి.
★ రసాయనాలైన డైమిథోయేట్ 30 శాతం – 300 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 36 శాతం – 300 మి.లీ. మందును 200 లీ. నీటికి కలుపుకుని ఎకరానికి పిచికారి చేయాలి.

తామర పురుగులు :

వీటి తల్లి మరియు పిల్ల పురుగులు ఆకుల అడుగుభాగాన చేరి మొక్కల లేత ఆకుల నుండి, రసం పీల్చడం వలన ఆకులు పాలిపోయి తెల్లగా మారి పైకి ముడుచుకుపోతాయి. అధిక స్థాయిలో ఇవి ఆశించినపుడు మొక్కలు ఎదుగుదల కోల్పోతాయి. ఇవి బడ్‌నెక్రోసిస్ అనే వైరస్ వ్యాధికి వాహకాలుగా పని చేస్తాయి.

★ తట్టుకునే రకాల సాగు (Kadiri-3 మరియు ×CGS-86031)
★ ఈ పురుగు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి.
★ పొలంలో ఉండే మిత్ర పురుగులను సంరక్షించాలి.
★ మోనోక్రోటోఫాస్ – 300 మి.లీ లేదా డైమిథోయెట్ – 300 మి.లీ. లేదా మిథైల్ డెమటాన్ – 300 మి.లీ. మందును 200 లీ. నీటికి కలుపుకొని ఎకరానికి పిచికారి చేయాలి.
★ మోనోక్రోటోఫాస్ 250 మి.లీ. + వేపనూనె 1 లీ. ను 200 లీ. సబ్బు నీటిలో కలిపి ఎకరాకు ప్రతి పదిరోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

ఆకుముడత :

పిల్ల గొంగళి పురుగులు నల్లని తల కలిగి ఆకుల లోపల చేరి రెండు మూడు ఆకులను కలిపి వాటిలోని ఆకుపచ్చని పదార్థాన్ని తినడం వలన ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడుతాయి. దీని వల్ల ఆకులు ఎండిపోయి, కాలినట్లు కనిపిస్తాయి. దీన్ని అగ్గితెగులు అని కూడా అంటారు.

★ అలసందలు లేదా సోయాబీన్ వంటి వాటిని ఎర పంటలుగా వేయాలి.
★ పంట మార్పిడి పద్ధతి అవలంబించాలి.
★ సోయాబీన్ వంటి చిక్కుడు జాతికి చెందిన పంటలతో పంట మార్పిడి చేయరాదు.
★ తట్టుకునే రకాలను సాగు చేయాలి.
★ సజ్జను అంతర పంటగా వేసుకోవాలి (7:1)
★ ఎకరాకు 4-5 లింగాకర్షక బుట్టల్ని ఉంచి పురుగు ఉధృతిని గమనించాలి.
★ వేప ఆధారిత మందులను ముందుగా చల్లుకోవాలి.
★ ఎండు గడ్డిని మొక్కల వరుసల మధ్య మార్చిగా వేయడం వల్ల పరాన్న భుక్కుల సంఖ్య పెరిగి ఆకుముడత పురుగు ఉధృతి తగ్గుతుంది.
★ పొలంలో పరాన్నజీవులు 50 శాతం ఉన్నప్పుడు క్రిమిసంహారక మందులు వాడనవసరం లేదు.
★ కార్బరిల్ 50 శాతం- 40 మీ.లీ. లేదా క్వినాల్ ఫాస్ 25 శాతం- 400 మి.లీ. లేదా
★ డైమిథోయేట్ 30 శాతం- 400 మి.లీ. లేదా మందును 200 లీ. నీటికి కలుపుకుని ఎకరానికి పిచికారి చేయాలి.

బిహార్ గొంగళి పురుగు :

ఈ గొంగళి పురుగు ఆకుల అడుగు భాగంలో ఉండి, ఈనెలతో సహా ఆకులను తినివేస్తుంది. ఆకులనన్నీ తినడం వల్ల కేవలం కాండం మాత్రమే మిగులుతుంది. అంతేకాక ఇవి లేత కాయలను కూడా తింటుంది. దీని వల్ల పంటకు అధిక నష్టం కలుగుతుంది.

★ లోతైన దుక్కి దున్నటం వల్ల భూమిలో దాక్కున్న ప్యూపాలు సూర్యరశ్మికి గురై నశిస్తాయి.
★ ఈ పురుగుకు ఆశ్రయమిచ్చే ఇతర అతిథేయి మొక్కలను నాశనం చేయాలి.
★ అలసంద, ఆముదం, జట్రోపా వంటి ఎర పంటలను వేసుకోవాలి.
★ ఆరు తడిగా పంటకు నీరు అందిస్తే మంచిది.
★ రాత్రి వేళల్లో గట్ల చుట్టు మంటలను ఏర్పాటు చేసుకోవాలి.
★ గుడ్లు లేదా లేత లార్వాలను గమనించిన వెంటనే ఏరివేసి నాశనం చేయాలి.
★ పొలంలో మిత్ర పురుగులను ఉండేట్లు చూసుకోవాలి.
★ పొలంచుట్టూ లోతైన గుంతలు ఏర్పాటు చేసి 2 శాతం మిథైల్ పెరాథియాన్ పౌడర్‌ను చల్లడం వల్ల లార్వాల సమూహాన్ని నివారించవచ్చు.
★ క్వినాల్ ఫాస్ 25 శాతం – 400 మి.లీ. లేదా క్లోరోపైరిఫాస్ 20 శాతం- 500 మి.లీ. లేదా మందును 200 లీ. నీటికి కలుపుకుని ఎకరానికి పిచికారి చేయాలి.

పొగాకు లద్దె పురుగు :

గుడ్ల సముదాయం నుండి అప్పుడే పొదగబడిన లేత పిల్ల లద్దె పురుగు సమూహంగా లేత ఆకులను గీకి తినటం వల్ల ఆకులు జల్లెడగా మారుతాయి. ముదిరిన లద్దె పురుగు ముదురు గోధుమ లేదా నలుపు రంగులో ఉండి రాత్రి వేళల్లో ఆకులను తిని, మొక్కల కొమ్మలను మాత్రమే మిగులుస్తాయి. ఇవి పగటివేళ భూమి నెర్రెలలోనూ, మొక్కల

మొదళ్ళ వద్ద దాక్కొని ఉంటాయి. తేలిక పాటి నేలల్లో ఇవి కాయలకు కూడా నష్టం కలిగిస్తాయి.

నివారణ :

★ వేసవిలో లోతైన దుక్కి దున్నుకోవాలి.
★ పురుగును తప్పించుకోవడానికి ముందుగానే విత్తుకోవడం మంచిది.
★ ఆరుతడిగా నీటిని అందించడం వల్ల మధ్యస్థ కరువును అధిగమించవచ్చు.
★ ఆముదం, పొద్దుతిరుగుడు వంటి ఎర పంటను పంట చుట్టూ వేయడం వల్ల కొంత ఉధృతి తగ్గుతుంది.
★ పొద్దుతిరుగుడు పక్షి స్థావరంగా కూడా పనిచేస్తుంది.
★ పొలంలో కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.
★ ఎకరాకు 5-6 పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలి.
★ గుడ్ల సముదాయం జల్లెడగా మారి లార్వాలు కలిగిన ఆకులను గుర్తించి ఏరివేయాలి. వాటిని నాశనం చేయాలి.
★ బీటి ఆధారిత మందులను 400 గ్రా. / ఎకరాకు వాడుకోవాలి.
★ వేప ఆధారిత మందులను 5% చల్లుకోవాలి.
★ విషపు ఎరలను పొలంలో ఉంచాలి. (మోనోక్రోటోఫాస్-500మి.లీ. బెల్లం 1/2 కే.జి. + తవుడు 5 కిలో తగినంత నీరు కలిపి ఉండలు చేయాలి).
★ మోనోక్రోటోఫాస్ 300మి.లీ. లేదా క్వినాల్‌ఫాస్ 300 మి.లీ. లేదా నొవాలూరాన్ 200 మి.లీ. మందును 200 లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఎర్ర గొంగళి పురుగు :

పిల్ల పురుగులు గట్లపై లేదా పొలంలో ఉన్న గడ్డి మొక్కలను ఆశించి వాటిపై ఉన్న పచ్చదనాన్ని గోకి తింటాయి. వేరుశనగ ఆకులపై పచ్చదనాన్ని కూడా గీకి తింటాయి. బాగా ఎదిగిన గొంగళి పురుగులు ఆకులను తినేసి, రెమ్మలను మొదళ్ళను మాత్రమే మిగులుస్తాయి. కొన్ని సందర్భాలలో పువ్వులను కూడా తింటాయి.

★ తొలకరి వర్షాల తరువాత లోతు దుక్కి చేయడం వలన భూమిలో ఉన్న కోశస్థ దశలు బయటపడి సూర్యరశ్మికి లేదా పక్షుల బారినపడి చనిపోతాయి.
★ రాత్రి సమయంలో సామూహిక మంటలు వేసి ఎర్ర గొంగళి రెక్కల పురుగులను ఆకర్షించి అరికట్టవచ్చు.
★ గుడ్ల సముదాయాలను, పిల్ల పురుగులను గమనించి ఏరివేయాలి.
★ పొలం చుట్టూ గుంతలు, సాలు ఏర్పాటుచేసి 250 గ్రా. మిథైల్ పెరాథియాన్ పొడిని చల్లాలి.
★ ఆముదం అలసంద వంటి ఎరపంటలను పొలం చుట్టూ వేసుకోవాలి.
★ ఎకరాకు 5-6 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి.
★ పొలంలో మిత్ర పురుగులను ఉండేట్లు చూసుకోవాలి.
★ సజ్జ, జొన్న వంటి వాటితో పంట మార్పిడి చేయాలి.
★ క్వినాల్ ఫాస్ 25 శాతం - 300 మి.లీ. లేదా డైక్లోరోవాస్ 76 శాతం - 300 మి.లీ. లేదా.
★ నొవాల్యూరాన్ 10 శాతం - 200 మి.లీ. మందును 200లీ. నీటికి కలుపుకుని పిచికారి చేయాలి.

శనగ పచ్చ పురుగు :

లేత ఆకులను, చిగురులను, పూతను రంధ్రాలు చేసి తింటాయి. మొగ్గలను తినటం వల్ల అధిక నష్టం వాటిల్లుతుంది. ఆకు చిగురులను రంధ్రం చేసి తినటం వల్ల ఆకులు విచ్చుకున్నపుడు సమాంతరంగా రంధ్రాలు కనిపిస్తాయి.

నివారణ :

★ కందిని అంతర పంటగా వేసుకోవడం వల్ల పురుగులు ఆకర్షించబడి, అసలు పంటకు తక్కువ నష్టం కలుగుతుంది.
★ ఎకరాకు 4-5 లింగాకర్షక బుట్టలు ఉంచడం మంచిది.
★ పొలంలో మిత్ర పురుగులను సంరక్షించుకోవాలి.
★ బి.టి. ఆధారిత పొడులు లేదా మందులను చల్లుకోవాలి.
★ గుడ్లు లేదా లేత లార్వాలు గుర్తించినప్పుడు వేప ఆధారిత మందులను వాడుకోవడం మంచిది.
★ HaNPV వైరస్ ద్రావణం 250 LE పిచికారి చేయాలి.
★ పురుగు ఉధృతి ఎక్కువైనపుడు క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 3 మి.లీ. లేదా ఇండాక్సాకార్బ్ 1.5 మి.లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి.

వేరు పురుగు :

వేరు పురుగు యొక్క తల్లి పురుగులు (పెంకు పురుగులు) తొలకరి వర్షాలు పడిన వెంటనే భూమిలో నుండి బయటకు వచ్చి పొలంలో ఉన్న వేప / రేగు చెట్లను ఆశిస్తాయి. ఆడ పురుగులు భూమిలో గుడ్లు పెడతాయి. బాగా ఎదిగిన వేరు పురుగు "C" ఆకారంలో ఉండి మొక్క వేర్లను కత్తిరిస్తుంది. తేలికపాటి నేలల్లో ఇది ఎక్కువగా ఆశిస్తుంది. వేరు పురుగు ఆశించిన మొక్కలు మొదట వడలిపోయి ఎండిపోయి చనిపోతాయి. మొక్కలను పీకితే సులువుగా ఊడి వస్తాయి. మొక్కలు గుంపులు - గుంపులుగా చనిపోతాయి.

నివారణ :

★ లోతైన దుక్కి చేయడం వలన పురుగు కోశస్థ దశ బయటపడి సూర్యరశ్మి లేదా పక్షుల బారిన పడి చనిపోతాయి.
★ గింజ విత్తేటపుడు ఎకరాకు 6 కిలోల ఫోరైట్ గుళికలు వేయాలి.
★ కిలో విత్తనానికి 6 మి.లీ. క్లోరిపైరిఫాస్‌తో విత్తన శుద్ధి చేయాలి. ❊

నాణ్యతతో నమ్మకం!

నమ్మకంతోనే విశ్వాసం!!

Agastya Agro Limited

Plot No. 39&40, 2nd Floor, Chittareddy Colony, Tarbund 'X' Roads, Hyderabad - 500 009, A.P. India

Tele Fax : +91 - 40 - 2781 1583 Email : agastyaagro@yahoo.com / aalchv@gmail.com

నిరంతర రైతు సేవలో నమ్మకమైన సేవలందిస్తున్న సంస్థ

వరి మాగాణిలో కోత అనంతరం మినుము, పెసర సాగు

- యెనిగళ్ళ శ్రీకాంత్, BSC (Ag), MBA, రీజినల్ మేనేజర్, నోవా అగ్రిటెక్ ప్రై. లిమిటెడ్, హైదరాబాద్, ఫోన్ : 9177515789

వరి మాగాణుల్లో జీరోటిల్లేజ్ పద్ధతిలో, రబీలో పెసర మరియు మినుము పంటల సాగు కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లోనే కాకుండా వరి పండించే ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించింది. ఈ పద్ధతిలో సాగు చేయడం వల్ల ఖర్చు, సమయం ఆదా చేయటమే కాకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చు. ఈ పద్ధతిలో పెసర మరియు మినుము పంటలకు సంబంధించి సాగుచేసే పద్ధతులు, వాటిని ఆశించే చీడపీడలు, వాటి నివారణ ఒకే విధంగా ఉండటం గమనార్హం.

నేలలు :

పెసర, మినుము అన్ని రకాల భూముల్లో సాగుచేయవచ్చు. కానీ చౌడు నేలలు మరియు మురుగు నీరు నిలిచే నేలలు పనికి రావు.

నేల తయారీ :

వరి మాగాణుల్లో జీరోటిల్లేజ్ పద్ధతి ద్వారా సాగు చేయడం వల్ల దుక్కి దున్నవలసిన అవసరం ఉండదు.

విత్తే విధానం :

వరిమాగాణుల్లో డిసెంబరు మొదటి రెండు వారాల్లో విత్తుకోవాలి. మాగాణుల్లో వరి కోయడానికి 2-3 రోజుల ముందు భూమి తేమ పరిస్థితిని బట్టి తడి లేక పొడి విత్తనాలు వెదజల్లాలి.

విత్తన మోతాదు :

వరి మాగాణుల్లో ఎకరానికి 10-12 కిలోల పెసర లేదా మినుము విత్తనాలు ఎంపిక చేసుకుని వెదజల్లాలి.

విత్తన శుద్ధి :

పెసర, మినుము రెంటిలో దాదాపు ఒకే రకమైన చీడ పీడలు మనం చూడవచ్చు. విత్తన శుద్ధి చేసినట్లయితే విత్తిన తొలిదినాల్లో చీడపీడల నివారణ చేయవచ్చు. ముందుగా శిలీంధ్రనాశినులైన

మ్యాంకోజెబ్, కార్బండిజమ్‌లను 3 గ్రా. వంతున లీటరు నీటిలో కలిపి విత్తనాలను నానబెట్టాలి. 10 నిమిషాలు నానిన తరువాత ఆరబెట్టుకొని 24 గంటల తరువాత 1 కిలో విత్తనానికి 30 గ్రా. కార్బోసల్ఫాన్ లేదా 5 గ్రా. మిడచ్‌రోప్రిడ్ లేదా 4 గ్రా. థియోమిథాక్సమ్‌తో విత్తన శుద్ధి చేయాలి. తొలిసారి వేసే భూముల్లో రైజోబియం కల్చర్‌తో విత్తన శుద్ధి చేస్తే మంచిది.

ఎరువులు :

జీరోటిల్లేజ్ పద్ధతిలో ఎరువులు వాడవలసిన అవసరం లేదు. మరీ తేలిక నేలలు అయితే ఎకరానికి 50 కిలోల 20-20 కాంప్లెక్స్ ఎరువును విత్తనంతో పాటు చల్లు కోవచ్చు. 19-19-19 1 కిలో ఒక ఎకరానికి మొలకెత్తిన 20-30 రోజుల వ్యవధిలో పిచికారి చేసుకున్నట్లయితే మంచి ఫలితం ఉంటుంది.

నీటి యాజమాన్యం :

రబీ వరి మాగాణుల్లో పండించే పెసర, మినుముకు నీటి తడులు అవసరం లేదు. మరీ భూమిలో తేమ లేక ఎండిపోయినట్లయితే 20-25 రోజుల దశలో ఒకసారి తేలికపాటి తడి ఇవ్వవచ్చు.

కలుపు నివారణ / అంతర కృషి :

మాగాణి పెసర, మినుములో ఊద, చిప్పెర నివారణకు పెనాక్సాప్రాప్ ఇథైల్ 9 శాతం ఎకరాకు 250 మి.లీ చొప్పున విత్తిన 20-25 రోజులప్పుడు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడల నివారణ :

చిత్త పురుగులు :

ఈ పురుగులు పైరుపై రెండాకుల దశలో ఆశించి రంధ్రాలు చేస్తాయి. వీటి బెడద ఎక్కువగా ఉన్నప్పుడు నివారించకపోతే 80 శాతం మొక్కలు ఈ దశలోనే చనిపోతాయి. నివారణకు 2.5 మి.లీ క్లోరోపైరిఫాస్ 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెల్లదోమ :

తెల్లదోమ ఆకులోని రసాన్ని పీల్చి వేసి నిర్జీవంగా చేస్తుంది. అంతేకాకుండా పల్లాకు తెగులును వ్యాప్తి చేస్తుంది. పెసర, మినుములో పల్లాకు తెగులు అపార నష్టాన్ని కలుగ చేస్తుంది. అందువల్ల తెల్లదోమను నివారించుకోవడం చాలా అవసరం. దీని నివారణకు **నోవా వారి ఎన్-కౌంటర్** ప్లస్ 100 మి.లీ లేదా **పంచామృత్** 250 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా మిథైల్ డెమిలూన్ 2 మి.లీ లేదా ట్రాజోఫాస్ 2 మి.లీ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

మారుకా మచ్చల పురుగు :

పెసర, మినుము పంటల్లో ఈ పురుగు ఉధృతి బాగా పెరిగిపోయింది. ఈ పురుగు పూత, మొగ్గ, పిందె దశల్లో ఆశించి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. దాని నివారణకు ముందుగా పూత వస్తున్న సమయంలో ఒక లీటరు వేపనూనె ఒక ఎకరానికి పిచికారీ చేయాలి. దాని వలన రెక్కల పురుగులు వికర్షితమై ఆకుల పైన గుడ్లు పెట్టవు. పురుగు తొలి దశలో ఎసిఫేట్ 250 గ్రా. లేదా క్లోరోపైరిఫాస్ 2 మి.లీ లేదా క్వినిల్‌ఫాస్ 20 మి.లీ లేదా డైక్లోరోఫాస్ 1 మి.లీ లీటరు నీటిలో ఏదో ఒకటి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే **నోవా వారి స్వర్ణ** 25-35 మి.లీ ఒక ఎకరానికి లేదా ఫ్లుబెండమైడ్ 4 మి.లీ లేదా రెనోకిపర్ 60 మి.లీ ఒక ఎకరానికి పిచికారీ చేయాలి.

పొగాకు లద్దె పురుగు :

ఈ పురుగులు ఆకుల్లోని పచ్చని పదార్థాన్ని గీకి తినడం వల్ల ఆకులు జల్లెడలాగా తెల్లగా మారిపోతాయి. ఆకులపైన పూత, పిందె, కాయలపైన రంధ్రాలు చేస్తాయి. ఈ పురుగులు రాత్రిపూట ఎక్కువగా తింటూ పగటి పూట మొక్కల మొదళ్ళలో భూమి నెర్రెల్లో ఉంటాయి. ఈ పురుగుల నివారణకు కింద సూచించిన సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

- గుడ్ల సముదాయాన్ని ఏరివేయాలి. ఆకుల కింద ఈ గుడ్ల సముదాయాన్ని గమనించవచ్చు.
- జల్లెడలా మారి పిల్ల పురుగులు ఉన్న ఆకులను ఏరి నాశనం చేయాలి.
- ఎకరానికి 30 వేల ట్రైకోగ్రామ బదనికలను వారం తేడాతో 2 పర్యాయాలు వదలాలి.
- ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసి పురుగు ఉధృతిని గమనించాలి.

- ఎకరానికి ఎన్.పి.వి 200 లీటర్ల ద్రావణాన్ని సాయంకాలంలో పిచికారీ చేయాలి.
- పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు పొలంలో విషపు ఎర ముద్దల్ని వెదజల్లాలి. ఎకరానికి 500 మి.లీ క్లోరోపైరిఫాస్ లేదా కార్బండిజమ్ 50 శాతం 500 గ్రా, 5 కిలోల తవుడు, 1/2 కి.లో బెల్లం సరిపడా నీటితో కలిపి చిన్న చిన్న ఉండలుగా చేసి సాయంత్రం సమయంలో వెదజల్లాలి.
- **నోవా వారి స్వర్ణ** 25-35 మి.లీ ఒక ఎకరానికి పిచికారీ చేసినట్లయితే ఈ పురుగును సమర్థవంతంగా నివారించుకోవచ్చు.

తెగుళ్ళు

బూడిద తెగులు :

ఈ తెగులు విత్తిన 30-35 రోజుల తర్వాత గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ముదురు ఆకులపై బూడిద రూపంలో చిన్న చిన్న మచ్చలుగా కనబడి అవి క్రమేణా పెద్దవై ఆకులపైన కింది భాగాలకు మరియు కొమ్మలు, కాయలకు వ్యాపిస్తుంది. నివారణకు లీటరు నీటికి 1 గ్రా. కార్బండిజమ్ 1 గ్రా. థయోఫానెట్‌మిథైల్ 1 మి.లీ కారథాన్ పిచికారీ చేయాలి.

నోవా వారి సంజీవని 3 గ్రా. / లీటరు నీటికి కలిపి 10-15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి లేదా **కిన్నోవా** 3 గ్రా. / లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినట్లయితే మంచి ఫలితాన్ని పొందవచ్చు.

ఆకుమచ్చ తెగులు :

ఈ తెగులు సోకిన ఆకులపై గోధుమ రంగు గుండ్రని చిన్న చిన్న మచ్చలు కనిపించి అనుకూల వాతావరణ పరిస్థితుల్లో ఈ మచ్చలు పెద్దవై ఆకులు ఎండి రాలిపోతాయి. దీని వలన కాయల్లో గింజలు సరిగా నిండవు. దీని నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా 2 గ్రా. క్లోరిపైరిఫాస్ లేదా 1 గ్రా. కార్బండిజమ్ పిచికారీ చేయాలి. **నోవా వారి సంజీవని** 3 గ్రా. / లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినట్లయితే మంచి ఫలితం ఉంటుంది.

తెగులు సోకకముందు **నోవా వారి తారక్** 2.5 గ్రా. / లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినట్లయితే తెగులును నివారించుకోవచ్చు.

కొరినోస్పోరా ఆకుమచ్చ తెగులు :



ఈ తెగులు ఆశించినప్పుడు ఆకులపై చిన్న చిన్న గోధుమ రంగు మచ్చలు ఏర్పడి అనుకూల వాతావరణ పరిస్థితుల్లో అంటే గాలిలో తేమ అధికంగా ఉన్నప్పుడు పెద్ద మచ్చల చుట్టూ పసుపు రంగు వలయాకారంగా ఏర్పడి ఆకులు ఎండి రాలిపోతాయి. ఈ తెగులు 30-35 రోజుల పంటను ఆశిస్తుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. **నోవా వారి సంజీవని** 3 గ్రా. / లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినట్లయితే మంచి ఫలితం ఉంటుంది. ఈ తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్తగా **నోవా వారి తారక్** 2.5 గ్రా. / లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకుముడత తెగులు :

ఇది వైరస్ జాతి తెగులు. తామరపురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు ఆశించిన మొక్కల ఆకుల అంచులు ముడుచుకుని మెలికలు తిరిగి గిడసబారి పోతాయి. ఆకుల అడుగు భాగంలోని ఈనెలు రక్త వర్ణాన్ని పోలి ఉంటాయి. లేత దశలో వ్యాధి సోకిన మొక్కలను పీకి తగులబెట్టడం ద్వారా పైరులోని ఇతర మొక్కలకు వ్యాపించకుండా అరికట్టవచ్చు. తామర పురుగుల నివారణకు **నోవా వారి స్ప్రెపర్** 1 గ్రా. / లీటరు నీటికి లేదా **ఎన్-కౌంటర్** ప్లస్ 0.5 మి.లీ / లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పల్లాకు తెగులు :

ఇది వైరస్ జాతి తెగులు. తెల్ల దోమ ద్వారా వ్యాపిస్తుంది. ఈ తెగులు సోకిన మొక్కల ఆకులు, కాయల మీద పసుపు పచ్చ పొడలు ఏర్పడతాయి. పత్రహరితం కోల్పోయి నిర్జీవంగా తయారవుతాయి. దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. **నోవా వారి పంచామృత్** 2.5 మి.లీ లేదా **ఎన్-కౌంటర్** ప్లస్ 1 మి.లీ / లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసినట్లయితే తెగులు ఉధృతిని అరికట్టవచ్చు. తెగులు సోకిన మొక్కలను వెంటనే పీకి వేయాలి. ❊

ప్రాకృతిక వ్యవసాయానికే ప్రాధాన్యత

రవి శంకర్ గురూజి

వ్యవసాయ రంగంలో ప్రస్తుతమున్న ఉత్పాదన వ్యయం తగ్గించాలంటే ప్రాకృతిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలనీ, ప్రస్తుత భారతదేశంలోని అభివృద్ధికి మూలం వ్యవసాయమేనని, మన పూర్వీకులు వ్యవసాయం చేసి సంపాదించిన సొమ్మునే పరిశ్రమలకు, ఇతర రంగాలకు మళ్ళించడం ద్వారా దేశంపురోగతి సాధించిందనీ, మనదేశం వ్యావసాయిక దేశమని చెబుతూనే వ్యవసాయానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ గురూజీ పేర్కొన్నారు.

నిజానికి మన సంస్కృతి, వృత్తి, వ్యాపారం, వ్యవహారం మొత్తం వ్యవసాయం పైనే ఆధారపడి ఉందని "గ్రామం సొమ్ము గ్రామంలోనే, పట్టణం సొమ్ము గ్రామంలోనే, చివరికి అమెరికా సొమ్ము కూడా గ్రామంలోనే" అనే సుభాష్ పాలేకర్ నినాదాన్ని అందరూ ముఖ్యంగా రైతులు గ్రహించాలని, అప్పుడే నిజమైన గ్రామీణాభివృద్ధి జరుగుతుందని ఆయన వక్కాణించారు.

డిసెంబరు 17వ తేదీన కూకట్‌పల్లిలోని తులసి ఫంక్షన్‌హాల్‌లో సుభాష్‌పాలేకర్ పెట్టుబడిలేని ఆధ్యాత్మిక వ్యవసాయం పేరిట ఒకరోజు సదస్సు నిర్వహించారు.

తులసి ఫంక్షన్‌హాలు ఎం.డి. కృష్ణంరాజు ఈ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో వార్త-పాడిపంటలు సంపాదకులు ఎం.వి.ఇ.ఎస్ ప్రసాద్ రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్, నెల్లూరుకు చెందిన అశోక్‌రెడ్డి, డా॥ జయంతి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

స్వజాతి ఆవుల ప్రత్యేకత :

ఆవు కడుపులో పుట్టే సూక్ష్మజీవులు దాని పేడ, మూత్రం ద్వారా బయటకు వస్తాయి. జీవామృత సంస్కరణ ద్వారా పాలేకర్ వాటి సంఖ్యను కోటిరెట్లు పెంచారు. ఒక స్వజాతి ఆవుతో 60 ఎకరాల సేద్యం చేయవచ్చునని ఆయన నిరూపించారు. మరింత లోతుగా

అధ్యయనం చేసి ఆ ఎకరాల సంఖ్యను 300కు పెంచవచ్చును అనేది పాలేకర్ అభిప్రాయం. ఘన జీవామృతంతో పాటు ఇంకా దశపర్ణి కషాయం, సప్తధాన్యాంకుర కషాయంలో కూడా ఆచరణలో మంచి ఫలితాలిస్తున్నాయని గురూజీ వివరించారు.

ఆచ్ఛాదన లేదా మల్చింగ్ :

- మృద ఆచ్ఛాదన అనే పద్ధతి ద్వారా 4,5-6 అంగుళాల మేరకు దున్ని ఆ మట్టినే విత్తనం నాటినప్పుడు విత్తనాలపై కప్పుతారు.
- ఆచ్ఛాదన అనే పద్ధతి ద్వారా ఎండిన, రాలిన, మరణించిన ఏ జీవపదార్థమైనా ఆకులు, కొమ్మరెమ్మలు, పూలు, పీకిన కలుపు మొక్కలు, కొబ్బరి మట్టలు లాంటి అన్ని సేంద్రీయ పదార్థాలు భూమిని కప్పి ఉంచుతాయి.
- జీవ ఆచ్ఛాదన పద్ధతిలో మొత్తం భూమిలో ఒక్క అంగుళం కూడా వదలకుండా అంతర పంటలు, మిశ్రమ పంటలు వేసుకోవడం. నేలపైన పాకే తీగ పంటలన్నీ జీవ ఆచ్ఛాదనయేకాక, ప్రధాన పంటకు దన్నుగా ఉంటుంది.
- ఆచ్ఛాదన ఎంత మందంగా ఉంటే భూమికి అంత సారం. అది వానపాములకు, ఇతర క్రిములకు, సూక్ష్మజీవులకు నివాసమవుతుంది.
- ఏరిన గడ్డి, కలుపు మొక్కలను కాల్చరాదు. అవి ఆచ్ఛాదనగా ఉపయోగపడి, భూమాతకు పయ్యెదలో రక్షణగా ఉంటుంది.

వ్యవసాయం-పాలేకర్ ప్రయోగం

వ్యవసాయం అన్నది ప్రకృతిని మానవుడు తన అవసరాలను తీర్చుకునేందుకు చేసే సాధన! ఆహారభద్రత కోల్పోతున్నామన్న దిగులుతో "హరిత విప్లవం" అనే ప్రయోగం జరిగింది. అది హింసకు మరో పేరైంది. సృష్టిలోని ప్రతి జీవరాశి సహజీవనం కోరుకుంటుంది. కానీ విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు మరియు విషకర కీటకనాశినులు వాడి, భూమితల్లిని నిర్జీవం చేశాము. భూమిలోని అనంత కోట్ల జీవరాశులు నాశనమయ్యాయి. దీనివల్ల క్యాన్సర్, మధుమేహం (షుగర్), గుండె జబ్బులు మరియు ఎయిడ్స్ లాంటి రోగాలు ప్రబలమయ్యాయి. మానవ మనుగడయే దుర్భరమైంది. ఎకరానికి వంద టన్నుల చెరకు పండించే భూమిలో పదిటన్నులు పండడం మొదలైంది. రాబడి తగ్గింది. పెట్టుబడి తడిసి మోపెడయింది. ఏదో తప్పుచేస్తున్నామన్న ఆలోచన మొదలైంది.

పాడిని వదిలి పంటలేదన్న సత్యం గోచరమయింది. సేంద్రీయ వ్యవసాయం ప్రాచుర్యానికి వచ్చింది. అయితే అది కూడా అధిక ఖర్చుతోకూడినదైన కారణంగా, సేంద్రీయ వ్యవసాయం కూడా నష్టదాయకమైనదేనన్న నిర్ధారణకు వచ్చారు. వానపాముల సేద్యంగా ప్రాచుర్యం పొందిన విధానంలో వాడేవి వానపాములే కాదు. చెత్త తినే ఆసినోఫిటిడా అనెడి ఇవి విషపదార్థాలైన ఆర్సినిక్, పాదరసం, సీసంలను విసర్జిస్తాయి. ఇవి భూమికి మరియు పంటలకే గాక వాటిని తినే మనకు కూడా హానిచేస్తాయి.

ఖర్చులు పెరుగుతూనే ఉన్నాయి. ఎక్కువ దిగుబడి సాధించినా రైతులకు మాత్రం లాభం లేదు. ధరలు పలకవు. పల్లెలు వదిలి ఉద్యోగాలు వెతుక్కొని పట్టణాలకు వలస వచ్చేస్తున్నారు. కూలీలు కూడా దొరకని పరిస్థితి. కరెంటు కొరత మరొకవైపు.

అటువంటి పెను సంక్షోభం ఊబిలో భారతీయ రైతాంగం కూరుకుపోయిన నేపథ్యంలో సుభాష్ పాలేకర్ సునిశిత పరిశోధనతో రూపొందించిన పెట్టుబడిలేని ఆధ్యాత్మిక వ్యవసాయం రైతాంగానికి వెలుగుబాట చూపింది. ప్రకృతి వ్యవసాయం చేయడానికి బండ్లకు బండ్లు పేడ అవసరం లేదు. ఒక్క దేశీయ ఆవు పేడ, మూత్రంతో ముప్పై ఎకరాల్లో పంటను ఆరోగ్యదాయకంగా పండించుకోవచ్చు. అటువంటి దివ్యమైన మార్గమే సుభాష్‌పాలేకర్ తెలియజేస్తున్న పెట్టుబడిలేని ఆధ్యాత్మిక వ్యవసాయం. దీన్ని నిండు మనసుతో అనుసరిద్దాం. నాటు ఆవు ద్వారా పుడమితల్లికి జీవరాశులు అందించి, ధాన్యరాశులను పండించడమే పాలేకర్ ఆశయం.

మహారాష్ట్రలో ప్రముఖ సంఘసేవకుడు, పర్యావరణ జీవ పరిరక్షణ ఉద్యమకారుడు, వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్‌పాలేకర్ అనేక నూతన ప్రక్రియలతో నిత్యం పంటలను పీడించే తెగుళ్ళపై పోరాటం చేస్తున్నారు. పత్తిలో రసంపీల్చే పురుగులు, పలు పంటలలో కాండం,

కాయతొలుచు పురుగులు, పంటకు నష్టంచేసే ఇతర సిలీంద్రాల నివారణకు వేప, గోమూత్రం, పొగాకు చిగురు, వెల్లుల్లి వంటి ప్రకృతి సహజమైన పదార్థాల ద్వారా ఆయన నాలుగు రకాల అస్త్రాలను సంధించారు. ప్రయోగాత్మకంగా మహారాష్ట్రలోని అనేక జిల్లాల్లో, పొరుగున ఉన్న మెదక్, నిజామాబాద్ జిల్లాలలో కూడా రైతుల పై పాలేకర్ అస్త్రం ప్రభావం చూపుతున్నది. గో సంరక్షణలో "బసవశ్రీ" అవార్డును, గోపాల్ గౌరవ అవార్డును అందుకున్న సుభాష్ పాలేకర్ పోషకాహార విలువలతో కూడిన, క్రిమిసంహార మందుల అవశేషాలు లేని పంటల అభివృద్ధికి నిరంతరం కృషి జరుపుతున్నారు. గతంలో ప్రతిష్టాకరమైన బసవశ్రీ అవార్డును పొందిన వారిలో బౌద్ధమత గురువు దలైలామా, ప్రముఖ సంఘ సేవకుడు డా॥ అన్నాహజారే, వందనాశివ, మేదాపట్కర్, మన రాష్ట్రానికి చెందిన ప్రజాగాయకుడు గద్దర్ ప్రముఖ సినీనటి, సామాజిక కార్యకర్త షబానాఆజ్‌మి ఉన్నారు. కర్నాటక రాజ్య రైతు సంఘాల సమాఖ్య పాలేకర్‌కు ప్రతిష్టాకరమైన భారత్ కృషిక్ రత్న అవార్డును బహూకరించింది. అంతేకాకుండా జీరో బడ్జెట్‌తో సహజ సేద్యాన్ని ఆచరించే పాలేకర్ విధానాన్ని మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళ, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లతో సహా అనేక లక్షల మంది రైతులు ఆచరిస్తున్నారు. మన పశువుల కొట్టంలో లభించే పదార్థాలతో ఇళ్ళలోనే ఔషధాల తయారీకి రంగం సిద్ధం చేసుకోవచ్చు. పెద్ద ఖర్చుతో కూడా పనిలేదు. ఆయన పురుగుల నివారణకు నాలుగు అస్త్రాలను సంబంధించారు. అవి

జీజామృతం :

ప్రకృతి వ్యవసాయంలో ఇది అతి ముఖ్యమైన ప్రక్రియ. బీజశుద్ధి చేసిన విత్తనాలను వాడాలి. పైరుమడి నాటేటప్పుడు కూడా వేర్లు బీజామృతంలో అద్దిన తరువాతనే నాట్లు వేయాలి. కొమ్మల కటింగులు కూడా శుద్ధిచేసి నాటాలి. అంటు కట్టినా మొదట శుద్ధి చేయాలి.

కావలసిన పదార్థాలు :

1. నీరు 20 లీటర్లు
2. ఆవు మూత్రం 5 లీటర్లు
3. ఆవు పేడ 5 కిలోలు
4. సున్నం పొడి 50 గ్రాములు

తయారు చేసే విధానం :

1. 20 లీటర్ల నీరు ఒక పాత్రలో తీసుకోవాలి.
2. అందులో ఆవు పేడ 5 కిలోలు బాగా కలపాలి.
3. అందులో ఆవు మూత్రం 5 లీటర్లు కలపాలి.
4. అందులో సున్నం పొడి 50 గ్రా. కలపాలి.
5. కర్రతో ఈ ద్రావణాన్ని సవ్యదిశ (గడియారం ముల్లు తిరుగు దిశ)లో కలియబెట్టాలి.
6. 12 గంటల కాలం నీడలో మూత పెట్టి ఉంచాలి.
7. గుడ్డతో వడబోసిన ద్రావణాన్ని బీజామృతంగా ఉపయోగిస్తారు.
8. అద్దిన విత్తనాలను నీడలో ఆరనిచ్చి నాటాలి.
9. కొట్లలో కొన్న విత్తనాలను మొదట శుభ్రమైన నీటితో కడిగి, బీజామృతంతో శుద్ధి చేయాలి.
10. తయారైన 24 గంటల్లో వాడుకోవాలి.

నీమాస్త్రం :

పత్తిలో రసంపీల్చే పురుగులు ఇతర తెగుళ్ళ నివారణకు సహజసిద్ధమైన వేపాకుల కషాయం ఎంతగానో తోడ్పడుతుంది. ఐదు కిలోల పచ్చివేపాకు లేదా ఐదుకిలోల వేప ఎండు ఆకులు లేదా వేప పండ్ల పొడిని వంద లీటర్ల నీటిలో వేయాలి. అందులో ఐదులీటర్ల గోమూత్రం, కిలో ఆవుపేడ కలపాలి. ఒక కర్ర సహాయంతో బాగా కలియబెట్టి 24 గంటలు మూసి ఉంచాలి. ఆ తరువాత గుడ్డలో చుట్టి పంటపై పిచికారీ చేయాలి.

బ్రహ్మాస్త్రం :

పంటలను బాగా నష్టపరచే తెగుళ్ళు, విస్తృతంగా హానిచేసే ప్రభావశీలమైన పురుగుల నివారణకు పాలేకర్ ఇదే విధంగా సహజ ప్రక్రియల ద్వారా మరో అస్త్రాన్ని తయారు చేశారు. దీనిలో 10 లీటర్ల గోమూత్రంతో పాటు రెండు కిలోల వేపాకు జిగురు, రెండు కిలోల సీతాఫల ఆకుల జిగురు, రెండు కిలోల నల్లేరు ఆకుల జిగురు, రెండు కిలోల ఉమ్మెత్త ఆకుల జిగురులను మిశ్రమం చేసి ఒక పెద్ద కర్రతో బాగా కలియతిప్పాలి. ఆ పాత్రపై మూతపెట్టి బాగా ఉడికించాలి. 48 గంటలు చల్లారనిచ్చి గుడ్డతో వడపోస్తే వచ్చే ద్రవానికి ఆయన బ్రహ్మాస్త్రంగా నామకరణం చేశారు. ఎకరాకు 100 లీటర్ల నీటిలో రెండున్నర లీటర్ల బ్రహ్మాస్త్రం కలిపి పిచికారి చేయాలి. ఆరు నెలల వరకు ఈ మందును నిలువ ఉంచుకోవచ్చు.

అగ్ని అస్త్రం :

కాయతొలుచు పురుగు, కాండం తొలుచు పురుగుల నివారణకు ఈ అగ్ని అస్త్రాన్ని ప్రయోగించవచ్చు. ఒక పాత్రలో 10 లీటర్ల గోమూత్రం తీసుకుని అందులో ఒక కిలో పొగాకు చిగురు, ఐదు కిలోల వేపాకు జిగురు, ఒకటి లేదా రెండు కిలోల పచ్చిమిరప కాయల జిగురు, అర కిలో వెల్లుల్లి జిగురు వేసి పాత్రపై మూతపెట్టి నాలుగుసార్లు పొంగువచ్చే విధంగా ఉడికించాలి. 48 గంటల తరువాత చల్లారిన ద్రవాన్ని ఒక డబ్బాలో వేసి ఉంచాలి. పాలేకర్ అగ్ని అస్త్రంగా నామకరణం చేసిన ఈ మందును 100 లీటర్ల నీటిలో రెండు, రెండున్నర లీటర్లు కలిపి పంటలపై పిచికారీ చేయాలి. ❊

– అగ్రిక్లినిక్ డెస్క్

మామిడిపూత - తేనె మంచు పురుగుల నివారణ

యన్.వి.యస్ వర్మ (రిటైర్డు), వ్యవసాయ సహాయ సంచాలకులు, నరసాపురం, ఫోన్ : 9491011925

మామిడి చెట్లు పూతకు ఎక్కువగా వాతావరణ పరిస్థితులు, మామిడి సాగుచేసే రకాలు మరియు భూమిలో అందుబాటులో ఉన్న పోషకాలు ఆధారంగా మారుతూ ఉంటాయి. ఉత్తర భారత దేశం సాగుచేస్తున్న మామిడి రకాలు ఆలస్యంగా కాపుకు వస్తాయి. దక్షిణ భారతదేశంలో సాగు చేస్తున్న మామిడి రకాలు త్వరగా కాపుకు వస్తాయి. కన్యాకుమారి వాతావరణ పరిస్థితుల్లో మామిడి రకాలు సంవత్సరం పొడవునా పూత పూసి చిగురునిస్తాయి.

వాతావరణ పరిస్థితులు :

- వివిధ ప్రాంతాల వర్షపాతం, గాలిలో అందుబాటులో ఉన్న తేమశాతాన్ని బట్టి మామిడి మొక్కల పూత ఆధారపడి ఉంటుంది. డిసెంబరు మాసంలో వర్షాలు అధికంగా పడే ప్రాంతాల్లో మామిడి మొక్కల పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. కాపు తక్కువగా ఉండి పూత సరిగ్గా రాదు.
- డిసెంబరు, జనవరి మాసాల్లో చలి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొన్ని మామిడి రకాలు పూతకు రావు.
- జనవరి నెలలో గాలిలో తేమశాతం అధికంగా ఉన్న ప్రాంతాల్లో మామిడి పూతపై తెగుళ్ళ బెడద ఎక్కువగా ఉంటుంది.
- మామిడిలో శాఖీయ పెరుగుదల పూత చిగుర్చుటకు ప్రతి బంధకంగా చెప్పవచ్చు. అక్టోబరు నుండి డిసెంబరు నెలల మధ్య శాఖీయ పెరుగుదల ఉండే కొమ్మలు గాని, చెట్లుగాని పుష్పించవు. ఆలస్యంగా పుష్పించిన చెట్ల నుండి కాయలు పొందే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది.

సాగు చేసే రకాలు :

- ఉత్తర భారత దేశం సాగుచేస్తున్న మామిడి రకాలు దశేరీ, లంగ్రా, అల్ఫాంజో, చేసా, బాంబేక్వీన్ వంటివి. నవంబరు, డిసెంబరు మాసాల్లో వర్షాలు అధికంగా ఉండి చలి ఎక్కువగా ఉండటంవల్ల ఫిబ్రవరి మాసంలో పూతకు వచ్చి ఆలస్యంగా కాపుకు వస్తాయి.
- భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో మామిడి సాగు చేసినప్పుడు పూత తొందరగా వస్తుంది. ఉత్తర భారతదేశంలో సాగు చేయబడుతున్న మామిడి రకాలు భూమధ్యరేఖకు దూరంగా ఉండడం వల్ల పూత ఆలస్యంగా వస్తుంది.
- మామిడి సాగు చేసే రకాలు పగటి ఉష్ణోగ్రత 19^0 సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రత 13^0 సెల్సియస్ మధ్యన ఉన్నప్పుడు ఫలదీకరణ చెందిన మామిడి పువ్వులు కాయలుగా ఏర్పడడానికి ఎక్కువ అవకాశం కలుగుతుందని పరిశోధనలు తెలియచేస్తున్నాయి. వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగినప్పుడు ఫలదీకరణ చెందినప్పటికీ ఏర్పడిన కాయలు రాలిపోతాయి.

మామిడి పూత :

- మామిడిలో మగపూలు మరియు మిశ్రమ పూవులు మాత్రమే అందుబాటులో ఉంటాయి.
- కేవలం మిశ్రమ పూవులు మాత్రమే పరాన్న జీవులచే పరపరాగ సంపర్కం చెంది, ఫలదీకరణ జరగడానికి సహాయపడతాయి.
- ఫలదీకరణ జరిగిన తరువాత 75 శాతం మిశ్రమ పూవులు పిందెలు తయారవకముందే రాలిపోతాయి. మిగిలిన 25 శాతంలో ఒక శాతం మాత్రమే పిందెలు కట్టి ఫలాలనిస్తాయి.
- ప్రతి చెట్టు కాపునిచ్చే 1000 పూగుత్తుల్లో సుమారు రెండు లక్షల పూల వరకూ ఉంటాయి. దీని నుండి 200 మామిడి కాయలు మాత్రమే కోతకు తయారవుతాయి.
- ఐదు పూగుత్తులకు ఒక కాయ లేదా 1000 పూలకు ఒక కాయ సాధారణంగా కాయగా మార్పు చెందుతుందని పరిశోధనల్లో తేలింది.
- వాతావరణ పరిస్థితుల ఆధారంగా దక్షిణ భారతదేశంలో సాగులో ఉన్న మామిడి రకాలలో మిశ్రమ పూవులు తక్కువగాను, ఉత్తర భారత దేశంలో సాగులో ఉన్న మామిడి రకాలలో మిశ్రమ పూవులు ఎక్కువగాను ఉంటాయి.
- వాతావరణంలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మిశ్రమ పూవులు ఎక్కువగాను, ఉష్ణోగ్రత తక్కువగాను ఉన్నప్పుడు మిశ్రమ పూవులు తక్కువగాను ఉంటాయి. ఉదాహరణకు ఉత్తర భారత దేశంలో సాగులో మామిడి రకాలలో మిశ్రమపూవులు దశేరీరకంలో 30.6

శాతం, లంగ్రా మామిడి రకంలో 69.8 శాతం వరకూ అందుబాటులో ఉంటాయి.

- దక్షిణ భారతదేశంలో సాగులో ఉన్న మామిడి రకాలలో మిశ్రమపూలు లంగ్రా మరియు దశేరీ రకాల కన్నా తక్కువగా ఉంటాయి. మిశ్రమ పూలు, నీలం మామిడిరకంలో 16.40 శాతం, అలంపూరు బేనిషాన్ రకంలో 3.17 శాతం, బెంగుళూరు రకంలో 6.60 శాతం, మల్గోవా మామిడి రకంలో 0.75 శాతం ఉంటాయి.

- ఉత్తర భారతదేశంలో దశేరీ మామిడి రకం ఆలస్యంగా పూతకు వస్తుంది కనుక మగపూవులు 5-7 రెట్లు అధికంగా ఉంటాయి.
- మామిడి చెట్టు పూగుత్తులలోపలి భాగంలో, బయటి భాగంలో ఉన్న గుత్తుల కన్నా రెండు రెట్లు ద్విలింగపుష్పములు అధికంగా ఉంటాయి. అందువల్ల ఉత్తర భారతదేశంలో దశేరీ మామిడి రకం దిగుబడి ఎక్కువగా ఉంటుంది. దక్షిణ భారతదేశంలో సాగుచేస్తున్న మామిడి రకాల్లో మగపూవులు మరియు మిశ్రమ పూల లభ్యత దానిపై పిచికారి చేసే హార్మోన్ల మీద ఆధారపడి పెరుగుతుంది.
- మామిడిలో తొలిసారి పూత మొదలైనప్పుడు, రెండవసారి పిందె తయారయ్యే దశలో జిబ్బరిల్లిక్ ఆమ్లం 20 పిపియమ్ అనగా 20 మి.లీ లీటర్లు పదార్థాన్ని ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేసి మిశ్రమ పూవుల శాతం పెంచవచ్చు.

మామిడి పూత, తేనె మంచు పురుగులు :

- మామిడి పూత దశలో ఆశించే పురుగుల్లో తేనెమంచు పురుగులను ప్రత్యేకంగా చెప్పవచ్చు. ఈ పురుగుల వల్ల నష్టం ఎక్కువగా నవంబరు నెల నుండి ఫిబ్రవరి నెల ఆఖరి వరకు ఉంటుంది.
- ఈ పురుగులు ఆశించినప్పుడు పూత పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోతుంది. ఈ పురుగులు తేనె వంటి జిగురు పదార్థాన్ని విసర్జిస్తాయి. చీమలు మామిడి చెట్టుపై పాకుతూ కనబడతాయి. మామిడి పూత రాలిపోవడానికి తేనె మంచు పురుగులు ముఖ్యకారణమని చెప్పవచ్చు.

తేనె మంచు పురుగుల్లో రకములు :

మామిడి చెట్లను మూడు రకాల తేనె మంచు పురుగు ఆశించడానికి అవకాశముంటుంది.

- మొదటి రకం పురుగులు పెద్దవిగా ఉండి, వీపు భాగంలో రెండు నలుపు రంగుతో కూడిన గుండ్రని మచ్చలు ఉంటాయి.
- రెండవ రకం పురుగులు మధ్యస్థ పరిమాణంలో ఉండి వీపు భాగాన మూడు నలుపు రంగుతో కూడిన గుండ్రని మచ్చలు ఉంటాయి.
- మూడవ రకం పురుగులు పై రెండు రకాల కన్నా చిన్నవిగా ఉంటాయి. వీపు భాగంలో రెండు నలుపు రంగు మచ్చలతో బాటు నలుపు రంగులో పొడవైన గీత కలిగి ఉంటాయి.
- ఫిబ్రవరి-ఏప్రిల్ నెలల మధ్య ఆశించే తేనె మంచు పురుగులు లేత కొమ్మలు, చిగుళ్ళు, పూత నుండి రసాన్ని పీల్చి ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తాయి.
- జూన్-ఆగష్టు నెలల మధ్య ఆశించే తేనె మంచు పురుగులు ఆకులు మరియు కాండం నుండి పీల్చి తమ మనుగడను సాగిస్తాయి. సాధారణంగా రెండవ రకం పురుగులు మామిడి పూతకు ఎక్కువ నష్టం కలుగ చేస్తాయి.

లక్షణాలు :

- మసి తెగులు ఆశించిన మామిడి మొక్కల ఆకులు, రెమ్మలు, కొమ్మలు నలుపు రంగు మసితో కప్పబడి ఉంటాయి.
- మామిడి మొక్కల్లో పిండి పదార్థాలు తయారు చేయగల శక్తి తగ్గిపోతుంది.
- తీయని తేనెమంచుపైన నలుపు రంగులో బూజు లాంటి మసి తెగులు వృద్ధి చెందుతుంది.

నివారణ చర్యలు :

- తేనె మంచు పురుగుల నివారణకు ఫాసలోను 20 మి.లీ పది లీటర్ల నీటిలో కలిపి గాని లేదా ఎండో సల్ఫాన్ 20 మి.లీ 10 లీటర్ల నీటితో కలిపిన ద్రావణం కొమ్మలు, రెమ్మలు పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.
- తేనె మంచుతో బాటు మసి తెగులు కూడా ఆశించినప్పుడు కార్బరిల్ పొడిమందు 30 గ్రా. మరియు నీటిలో కరిగే గంధకం 30 గ్రా. పది లీటర్ల నీటితో కలిపిన ద్రావణం పిచికారీ చేయాలి.
- ఫాసలోను వంటి పురుగు మందులతో గంధకం కలిపి పిచికారీ చేయరాదు.
- ఫాసలోను మందు చల్లినప్పుడు మాత్రం 24 గంటల తరువాత గంధకం పొడి మందును చల్లవచ్చు.
- ముందు జాగ్రత్త చర్యగా తేనె మంచు పురుగులు ఆశించకుండా నివారణ చర్యలు చేపట్టవచ్చు.
- మొదటి పూత అంకురం ఏర్పడిన సమయంలో కార్బరిల్ 50 శాతం పొడి మందును, రెండవ దఫా పూత దశలో మోనోక్రోటోఫాస్ 16 మి.లీ 10 లీటర్ల నీటితో కలిపిన ద్రావణం పిచికారీ చేయాలి.
- మూడవ దఫా మామిడి పిందెలు బఠాణీ పరిమాణంలో ఉన్నప్పుడు క్లోరోపైరిఫాస్ 25 మి.లీ 10 లీటర్ల నీటిలో కలిపి గాని క్వినాల్ఫాస్ 20 మి.లీ పది లీటర్ల నీటితో కలిపిన ద్రావణం కానీ పిచికారీ చేసుకోవాలి.
- వాతావరణం తేమగా ఉన్న సమయంలో చిన్నరసం మరియు సువర్ణ రేఖ రసాలకు తేనె మంచు పురుగులతో పాటు, బూడిద తెగులు ఆశించడానికి ఎక్కువ అవకాశముంటుంది.

- తేనె మంచు పురుగుల నివారణకు సస్యరక్షణ మందులు పిచికారీ చేసేటప్పుడు ఆకులపైనే కాకుండా చెట్టు మొదలు వద్ద మరియు కొమ్మల పైన కూడా పిచికారీ చేయాలి. వీలైనంత వరకూ పురుగు మందులను పూత ఎక్కువగా ఉన్నప్పుడు పిచికారీ చేయకూడదు.

పురుగు లక్షణాలు :

- తేనె మంచు తల్లి పురుగులు లేతగా ఉన్న పూ కాడలపై 100-200 గుడ్లు పెడతాయి. గుడ్లు 7-10 రోజులకు పొదిగి పిల్ల పురుగులు బయటకు వస్తాయి.
- పిల్ల పురుగులు 2-4 వారాల వరకు జీవించి పూతకు నష్టం కలుగ చేస్తాయి. తరువాత పెద్దవిగా మారతాయి. తేనెమంచు పురుగుల ఉధృతి దక్షిణ భారతదేశపు వాతావరణ పరిస్థితులలో నవంబరు నుండి మార్చి నెలల మధ్యకాలంలో ఎక్కువగా ఉంటుంది. ❖

AN ISO 9001:2008 CERTIFIED COMPANY
NOVA AGRITECH

అన్ని రకాల పంటలలో వివిధ సూక్ష్మపోషక లోపాల నివారణకు మరియు నాణ్యమైన అధిక దిగుబడులకు

నోవా అగ్రిటెక్ వారి విశిష్ట ఉత్పాదనలు

నోవా ఎస్.ఒ.పి. (Sulphate of Potash)

కె-మ్యాగ్ (Potassium Schoenite)

నోవా మ్యాగ్ (Magnesium Sulphate 9.6%)

నోవా సిఎల్ఎక్స్ (AP Formula I)

లిక్విమ్యాక్స్ (AP Formula VI)

నోవా మ్యాక్స్ (AP Formula IV)

నోవా సూపర్ 789 (AP Formula IV Chelated)

నోవా బూస్ట్ (AP Formula VII)

నోవా బోరాన్ (Boron 10.5%)

నోవా జింక్ 33% (Zinc Sulphate Mono Hydrate 33%)

నోవా జింక్ 12% (12% EDTA Chelated)

ఎన్-కప్ (Copper Sulphate 24%)

నోవా ఫెర్ (12% EDTA Chelated)

నోవా ఫెర్ 19%

NOVA Agri Tech Pvt Ltd

® నోవా అగ్రిటెక్ ప్రై. లిమిటెడ్

(సూక్ష్మపోషక ఉత్పత్తులు, నీటిలో కరిగే ఎరువుల విభాగం)

ప్లాట్ నెం. 5, ఎమ్.జె.ఆర్. రెసిడెన్సి, విరల్‌నగర్, చిన్నతోకట్ట, న్యూ బోయినపల్లి, సికింద్రాబాద్ - 11 కస్టమర్ కేర్ నెం. 040-27957082, E-mail : nova.agritech@gmail.com

Visit us at : www.novaagritech.com

An ISO 9001 : 2008 Certified Company ...for better HARVEST

పొగాకులో తెగుళ్ళ సమస్య - నివారణ చర్యలు

డా॥ పి. కిషోర్ వర్మ, డా॥ సి.హెచ్ శ్రీలతావాణి, డా॥ ఎమ్ సత్యనారాయణ, ఫోన్ : 9705799100

మన రాష్ట్రంలో పండించే వాణిజ్య పంటలలో అతి ముఖ్యమైనది పొగాకు. భారత దేశంలో పొగాకు 0.45 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతోంది. పొగాకు ఉత్పత్తిలో భారత దేశం రెండవ స్థానంలో ఉంది. దీని ద్వారా సంవత్సరానికి సుమారు 4,402 కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభిస్తుంది. దీని ద్వారా సుమారు 36 మిలియన్ల ప్రజలు ప్రత్యక్షంగా పంట సాగులోనూ మరియు పరోక్షంగా ప్రొసెసింగ్, ఎగుమతులు, మార్కెటింగ్, బీడి మరియు సిగరెట్ పరిశ్రమల ద్వారా జీవనోపాధిని పొందుతున్నారు.

పొగాకు యొక్క దిగుబడి మరియు నాణ్యతను పెంచాలన్నా మన ఉత్పత్తులు విదేశీ మార్కెట్‌లో నిలదొక్కుకోవాలన్నా పొగాకు పంటను ఆశించే కొన్ని తెగుళ్ళపై రైతులకు అవగాహన అవసరం.

పొగాకు పంటకు నష్టాన్ని కల్గించే తెగుళ్ళు :

మాగుడు తెగులు :

నర్సాపూరణంగా నారుమడిలో అధిక నష్టాన్ని కల్గిస్తుంది. లేత మొక్కల కాండం మొదలు వద్ద నీటి మచ్చలు మొదలై, కాండం చుట్టూ పైకి, కిందికి వ్యాపిస్తాయి. అనుకూల వాతావరణ పరిస్థితుల్లో 2-3 రోజులు వ్యవధిలో కాండం పూర్తిగా కుళ్ళిపోయి మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోయి. ఆకులు మరియు వేర్లు కూడా కుళ్ళిపోతాయి. తెగులును సరైన సమయంలో గుర్తించి యాజమాన్యం చేపట్టనట్లయితే నారుమడి మొత్తం నాశనమయ్యే అవకాశం ఉంది.

నివారణ :

నారును ఎత్తు నారు మళ్ళలో వేసుకోవాలి. మొక్కల సాంద్రత సక్రమంగా ఉండాలి. 0.4 శాతం బోర్డోమిశ్రమంతో నారు పోయడానికి ముందు నేలను తడపాలి. 20 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ 10 లీ. నీటికి కలిపి 10 చ.మీ విస్తీర్ణంలో చల్లాలి. మెటలాక్సిల్ మరియు మాంకోజెబ్ 10 లీ. నీటికి 20 గ్రా. వంతున కలిపి మొలకెత్తిన 20-30 రోజులకు రెండు సార్లుగా చల్లి తెగులును అరికట్టవచ్చు.

కప్ప కన్ను తెగులు :

ఈ తెగులు నారుమడి మరియు నాటిన తరువాత కూడా అన్ని ప్రాంతాల్లో కన్పిస్తుంది. మొక్కల ముదురు ఆకుల్లో గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. వాటి మధ్య భాగం బూడిద రంగులో ఉంటుంది. అంచులు ముదురు రంగులో ఉంటాయి. మచ్చలు ఎక్కువగా ఏర్పడినట్లయితే అవి కలిసిపోయి

అకుల అంచుల నుండి ఎండుతున్నట్లు కన్పిస్తాయి. ఈ తెగులు వల్ల పొగాకు నాణ్యత తగ్గుతుంది.

నివారణ :

బోర్డో మిశ్రమం 0.2 శాతం (20 గ్రా. కాపర్ సల్ఫేట్, 20 గ్రా. సున్నం, 10 లీ. నీరు) లేక కార్బండిజమ్ లేక బినోమిల్ లేక థయోఫానేట్ మిథైల్ 10 లీ. నీటికి 3 గ్రా. వంతున కలిపి లేదా 2 గ్రా. జైనబ్ లీటరు నీటికి కలిపి చల్లితే ప్రయోజనం ఉంటుంది. అంతర్వాహిక శిలీంధ్రనాశినులు 15 రోజులకు ఒకసారి రెండు పర్యాయాలు చల్లాలి. మామూలు శిలీంధ్రనాశినులను 4-6 సార్లు వారం వ్యవధిలో చల్లాలి.

గోధుమ మచ్చ :

ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఉంగరాల వలె ఏర్పడతాయి. మచ్చలు ఎక్కువై కలిసిపోయినట్లయితే ఆకులు ఎండిపోతాయి.

నివారణ :

0.4 శాతం బోర్డోమిశ్రమం లేదా జైనెబ్ లీటరు నీటికి 2 గ్రా. వంతున లేదా కాపర్‌ఆక్సీక్లోరైడ్ అదే మోతాదులో కలిపి వారానికి ఒకసారి రెండు దఫాలుగా చల్లితే ఉపయోగం ఉంటుంది.

నల్లమచ్చ / నల్లకాడ / ఆకుమాడు :

మొక్కల కాండం మొదళ్ళ వద్ద నల్లని మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలు చిన్న నల్లని మచ్చలుగా మొదలై, కాండం మరియు వేరు వెంబడి పాకుతూ ఆకారం లేని ప్రదేశాలు ఏర్పడతాయి. తెగులు సోకిన ప్రదేశాలు కృంగి, కాండంపై సొట్టలు ఏర్పడి మొక్కలు ఎండిపోతాయి. ఈ మొక్కల కాండం నిలువుగా చీల్చినప్పుడు బెండు భాగం ఎండి డిస్క్ లాంటి పళ్ళాలు కన్పిస్తాయి.

నివారణ :

పంట అవశేషాలను, తెగులు సోకిన మొక్క భాగాలను తగుల బెట్టాలి. నివారణకు 0.2 శాతం బోర్డోమిశ్రమం లేక కాపర్‌ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి 2 గ్రా. వంతున మొక్కల మొదళ్ళ వద్ద చల్లాలి. నల్ల మొదలు మరియు ఆకు ఎండు రెండింటికీ 2 గ్రా. మెటలాక్సిల్ లీటరు నీటిలో కలిపి రెండుసార్లు చల్లి లేదా 3-4 సార్లు కాపర్‌ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి 2 గ్రా. వంతున కలిపి మొక్కకు 100 మి.లీ వంతున చల్లి అరికట్టాలి.

వెర్రి తెగులు / మొజాయిక్ :

లేత ఆకుల ఈనెల వెంబడి లేత గోధుమ రంగులో కన్పిస్తాయి. తరువాత ఆకులు లేత మరియు ముదురు ఆకుపచ్చ ప్రదేశాలు ఎక్కువగా వృద్ధి చెందటం వలన ఆకులపై బొబ్బలు ఏర్పడతాయి. లేత మొక్కలకు తెగులు సోకినప్పుడు అవి గిడసబారతాయి. తీవ్రమైన సందర్భాల్లో ఆకులు సన్నగా, పలుచగా గుర్తు పట్టడానికి వీలు లేనంతగా మారిపోతాయి.

నివారణ :

తెగులు మొక్కల రసిక ద్వారా, గాయాల నుండి మొక్కల్లోనికి ప్రవేశిస్తుంది. పొలంలో మొక్కల తలలు విరిచేటప్పుడు తేలికగా మొక్కల మధ్య వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకిన పొగాకుతో తయారు చేసిన పదార్థాలు ఆరోగ్యకరమైన పంటల్లో పనిచేస్తున్న కూలీల ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది. తెగులు తట్టుకునే రకాలను వాడాలి. పొలంలో పరిశుభ్రత పాటించాలి. కలుపు నివారణ చర్యలు చేపట్టాలి. తెగులు సోకిన మొక్కలను కన్పించిన వెంటనే జాగ్రత్తగా వేరు చేసి దూరంగా తగులబెట్టాలి.

ఆకు ముడుత :

తెగులు సోకిన ఆకులు కింది వైపుకు ముడుచుకుంటాయి. ఆకుల అంచులు లోపలివైపుకు చుట్టుకుని కన్పిస్తాయి. ఈనెలు మందంగా పత్రహరితాన్ని కోల్పోయి ఉంటాయి. తెగులు ముదిరిన కొద్ది మొక్కలు గిడసబారి, పూగుత్తులు కుంచించుకుపోయి, పూరెమ్మలు దళసరిగా, ఆకుపచ్చ రంగులో ఉంటాయి. ఆకుల అడుగువైపున ఈనెల వెంబడి లేత ఆకులను పోలిన పెరుగుదల కన్పిస్తుంది.

నివారణ :

తెగులు తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. నారు దశ నుండి తెల్లదోమను అరికట్టడానికి 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ / మోనోక్రోటోఫాస్ లీటరు నీటికి కలిపి లేదా 1.5 మి.లీ మిథైల్ డెమటాన్ లేక 1 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి 10-15 రోజుల వ్యవధిలో చల్లాలి. ❊

NRI Seeds®
రైతన్న ప్రగతికి ప్రపంచ పరిజ్ఞానం

రైతన్నలకు వరాలు.. ఎన్.ఆర్.ఐ. రకాలు..

(NRI OH-3)
హైబ్రిడ్ బెండ

(ASB-001)
మినుము

(ASG-001)
పెసర

NRI-001 BG II
NRI-002 BG II

NRI Agritech Pvt. Ltd.,

4-5-29/85, 4th Line, Vidya Nagar,
GUNTUR - 522 007. Ph: **0863-2253567**

An ISO 9001 : 2008 Certified Company

NRI Agritech
Technology Outreach

సమస్య - పరిష్కారం

నోవా రైతు సేవా కేంద్రం వారి సౌజన్యంతో

మీ ప్రశ్నలు పంపించవలసిన చిరునామా:
అగ్రి క్లినిక్ సమగ్ర వ్యవసాయ మాసపత్రిక
ప్లాట్ నెం. 5, MJR రెసిడెన్సీ,
విరల్ నగర్, చినతోకట్ట,
న్యూ బోయినపల్లి, సికింద్రాబాద్ - 11
Phone : 040 - 40206238
E-mail : agriclinic.org@gmail.com

మిరపలో వైరస్ / బొబ్బర తెగులు నివారణ చర్యలు తెలపండి.

వి. లక్ష్మయ్య, బుధవాడ గ్రామం,
ఇంకొల్లు మండలం, ప్రకాశం జిల్లా.
ఫోన్ : 9951849051

మిరపలో వైరస్ / బొబ్బర తెగులు అధికంగా ఉన్నపుడు నివారించలేము. కానీ వ్యాధి సోకిన మొక్కల నుండి మిగిలిన మొక్కలకు సోకకుండా అరికట్టవచ్చు. ఈ తెగులు దోమ మరియు రసం పీల్చు పురుగుల ద్వారా వ్యాపిస్తుంది. అందువల్ల ఈ పురుగులను నివారించగలిగితే బొబ్బర తెగులును కొంతవరకు నివారించవచ్చు. దోమ నివారణకు **నోవా వారి పంచామృత్** 250 మి.లీ. /ఎకరానికి మరియు **బి-స్టాప్** 400 గ్రా. / ఎకరానికి పిచికారి చేయాలి. తెగులు వ్యాపించిన కొమ్మలను పంటనుండి వేరుచేసి దూరంగా వేసి తగలబెట్టాలి.

మిరపలో బుడ్డకాయలు, పూత అధికంగా రాలుతుంది. కాయలు వంకరగా మారుతున్నాయి. దీనికి నివారణ చర్యలు తెలుపుము.

కె. సంగయ్య,
తిరుమలాయపాలెం మండలం, ఖమ్మం జిల్లా.
ఫోన్ : 9573195338.

మిరపలో బుడ్డకాయలు, కాయలు వంకరగా మారడం అనేది మిడ్జ్ ఈగ వల్ల వస్తుంది. ఈ ఈగ మొదటగా పువ్వులోనికి వెళ్ళి అండాశయంపై ఒక గుడ్డు పెడుతుంది. తరువాత గొంగళి పురుగుగా మారి అండాశయాన్ని తింటుంది. దీనివల్ల పూతరాలడం జరుగుతోంది. ఒక్కొక్కసారి ఈ గొంగళి పురుగు అనేది సగం అండాశయాన్ని తింటుంది. ఇలా తినడం వల్ల వంకర తిరిగిన కాయలు రావడం జరుగుతుంది. వీటి నివారణకు **నోవా వారి కాన్ఫ్లక్స్** 100 మి.లీ. / ఎకరానికి మరియు **జెట్ ప్లవర్** 250 మి.లీ. / ఎకరానికి పిచికారి చేయడం వల్ల మిడ్జ్ ఈగ వల్ల వచ్చే బుడ్డకాయలు, పూత రాలుట, వంకర తిరిగిన కాయలను నివారించవచ్చు.

వేరుశనగలో పచ్చపురుగు మరియు లద్దెపురుగు నివారణ చర్యలు తెలుపుము.

ఉప్పర రాము, నీలాంపల్లి గ్రామం,
బుక్కరాయసముద్రం మండలం,
అనంతపురం జిల్లా. ఫోన్ : 9676223766.

వేరుశనగలో పచ్చపురుగు అనేది లార్వా దశలో ఆకులను, పూతను, కాయలను తింటూ ఉంటుంది. సీతాకోకచిలుక దశలో పూతపైన, కాయలపైన గుడ్లను ఒక్కొక్కటిగా పెడుతుంది. గుడ్ల నుండి వచ్చిన పురుగు కాయలను తొలచి గింజలను తింటుంది. లద్దె పురుగు వేరుశనగలో తల్లి రెక్కల పురుగులు ఆకు అడుగు భాగాన గుంపుగా గుడ్లు పెడతాయి. పిల్ల పురుగులు గుంపులు, గుంపులుగా ఉండి ఆకుపై పత్రహరితాన్ని గోకి తినేసి, జల్లెడ ఆకులుగా మారుస్తాయి. బాగా ఎదిగిన పురుగులు ఆకులని తినివేస్తాయి. రాత్రిపూట ఇది మొక్కలను ఆశించి ఆకులను పూర్తిగా తినివేస్తాయి. పగటివేళ ఈ పురుగులు భూమిలో దాగి ఉంటాయి. ఈ పచ్చపురుగు మరియు లద్దెపురుగు నివారణకు **నోవా వారి స్వర్ణ** 0.15-0.3 మి.లీ. / లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించవచ్చు.

వేరుశనగలో తిక్క ఆకుమచ్చ తెగులు నివారణ తెలుపుము.

బాషా, క్రిష్ణాపురం గ్రామం,
ఆర్లగడ్డ మండలం, కర్నూలు జిల్లా.
ఫోన్ : 7702073732

వేరుశనగలో ఆకుపై భాగాన గుండ్రని ముదురు గోధుమ రంగు మచ్చలు మరియు అడుగు భాగాన నల్లని రంగు మచ్చలు కల్గి ఉంటాయి. కాండం మీద, ఆకు కాడల మీద, ఊడల మీద కూడా మచ్చలు ఏర్పడతాయి. ఈ తెగులు సోకకుండా ఉండేందుకు తెగులును తట్టుకునే రకాలైన వేమన, జెసిబి-88 వంటి విత్తనాలను సాగు చేయాలి. దీని నివారణకు కార్భండిజం మందును 2 గ్రా./ లీటరు నీటికి లేదా మ్యాంకోజెబ్ 3 గ్రా. / లీటరు నీటికి లేదా క్లోరోథలానిల్ 2 గ్రా. / లీటరు నీటికి లేదా **నోవా వారి సంజీవని** 300 గ్రా. / ఎకరానికి పిచికారి చేసి ఈ తెగులును నివారించవచ్చు.

మిరపలో కొమ్మ ఎండు మరియు కాయకుళ్ళు తెగులు నివారణ తెలుపగలరు.

ఎస్. కృష్ణారెడ్డి, కామేపల్లి గ్రామం & మండలం,
ఖమ్మం జిల్లా. ఫోన్ : 8790620550

మిరపలో ముదురు కొమ్మల బెరడుపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. కొమ్మలు పైనుండి కిందకి ఎండుతాయి. పండు కాయల మీద నల్ల మచ్చలు ఏర్పడి, కాయలు కుళ్ళిపోతాయి. దీని నివారణకు **నోవా వారి సంజీవని** 300 గ్రా. / ఎకరానికి మరియు ప్లాంటామైసిన్ 30 గ్రా. / ఎకరానికి కలిపి పిచికారి చేసి నివారించవచ్చు. లేదా **నోవా వారి కిన్నోవా** 300 గ్రా. / ఎకరానికి పిచికారి చేయాలి.

పత్తిని పేను, దోమ తీవ్రంగా వ్యాపిస్తుంది. దీని నివారణ తెలపండి.

శ్రీను, బేతంపూడి గ్రామం,
టేకులపల్లి మండలం, ఖమ్మం జిల్లా.
ఫోన్ : 9160861324.

ఈ పేనుగాని, దోమ గాని పత్తిలో ఉన్నట్లయితే ముడత వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ రసం పీల్చు పురుగులు ఆకులోని రసాన్ని పీల్చడం వల్ల ఆకులు జీవాన్ని కోల్పోయి, ఎండిపోవడం జరుగుతుంది. దీనివల్ల పంట దిగుబడిలో తీవ్రనష్టం వస్తుంది. కావున దీని నివారణకు నోవా వారి **ఎన్-కౌంటర్** థ్లస్ 100 మి.లీ. / ఎకరానికి, **బి.టి. ఎక్సెల్** 250 మి.లీ. / ఎకరానికి కలుపుకొని పిచికారి చేయాలి. లేక **పంచామృత్** 25 మి.లీ. / ఎకరానికి పిచికారి చేసి నివారించవచ్చు. ఒకవేళ రసం పీల్చు పురుగులతో పాటు కాయ తొలుచు పురుగును కూడా గమనించినట్లయితే **నోవా వారి టెర్మినేటర్ గోల్డ్** 250 మి.లీ. / ఎకరానికి పిచికారి చేయాలి.

మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు నివారణ తెల్పుము.

చంద్రశేఖర్‌రెడ్డి, సిందనూర్ గ్రామం,
ఐజా మండలం, మహబూబ్‌నగర్ జిల్లా.
ఫోన్ : 8498079779.

మొక్కజొన్నలో ఇవి రెండు రకాలు మచ్చలు లేక చారలు. కాండం తొలుచు పురుగు ఎక్కువగా పైరును ఆశిస్తుంది. రబీలో ఎక్కువగా గులాబిరంగు కాండం తొలుచు పురుగు ఆశిస్తుంది. ఇది 10-20 రోజుల పైరును ఆశిస్తాయి. ఇవి మొదటగా ఆకులపై పత్రహరితాన్ని గోకి తింటాయి. తరువాత ముడుచుకుని ఉన్న ఆకుల ద్వారా కాండం లోకి చేరతాయి. ఆకులు విచ్చుకున్న తరువాత పొడవాటి చిల్లుల వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వా ఎదిగే ఆకులను తినడం వల్ల మొక్క చనిపోతుంది. దీని నివారణకు 10 జి గుళికలు, 4 జి గుళికలు మొవ్వులలో వేయాలి. మరియు **నోవా వారి టెర్మినేటర్** 2.5 మి.లీ. / లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.





రబీలో ధనియాల సాగు - సూచనలు

డా॥సి.హెచ్ శ్రీలతావాణి, డా॥. పి కిషోర్ వర్మ, కె. గోపాలకృష్ణమూర్తి

ఆంధ్రప్రదేశ్‌లో పండించే విత్తన సుగంధ ద్రవ్య పంటలలో ధనియాలు ముఖ్యమైనది. ఈ పంట మన రాష్ట్రంలో సుమారు లక్ష హెక్టార్లలో సాగు చేయబడుతూ 27 వేల టన్నుల ఉత్పత్తిని ఇస్తుంది. రాష్ట్రంలో అన్ని జిల్లాలలోనూ ధనియాల పంట సాగు చేయబడుతుంది.

ఉపయోగాలు :

1. నిత్యం వంటల్లో రుచి, వాసన కోసం వాడతారు.
2. సలాడ్‌గా కూడా ఉపయోగిస్తారు.
3. ధనియాలు రసాన్ని షర్బత్తులలోను, ఔషధాలలోనూ, ఆయుర్వేద మందులలోనూ వాడుతున్నాము.
4. ధనియాల నుండి తీసిన నూనెలను పరిమళ నూనెల్లో వాడతారు.
5. ధనియాలలో ఉండే కొన్ని ఈ రకాల ఉత్పత్తులు కాలేయం నుండి విడుదలయ్యే బైలు ఎంజైము రక్తంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి తోడ్పడుతుంది.
6. ధనియాల రసాన్ని పసుపుతో కలిపి మొటిమల నివారణకు వాడవచ్చు.
7. ఇది యాంటి బ్యాక్టీరియల్ గుణాన్ని కలిగి ఉంటాయి.

ధనియాల పోషక విలువలు (100 గ్రా. ధనియాలలో) :

శక్తి	-	23 కి. క్యాలరీలు
పిండి పదార్థాలు	-	4 గ్రా.
పీచు	-	3 గ్రా.
క్రొవ్వు	-	0.5 గ్రా.
ప్రొటీన్	-	2 గ్రా.
విటమిన్-ఎ	-	37 మైక్రో గ్రా.
విటమిన్-సి	-	27 మి.గ్రా.

అనువైన వాతావరణం :

చల్లని వాతావరణంతో పాటు, రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా తగినంత మంచు అవసరం. అందువల్లనే ఈ పంటను రబీలో సాగు చేస్తున్నాము.

నేలలు :

వర్షాధారం క్రింద సాగు చేయడానికి తేమను ఎక్కువ నిల్వ చేసుకోగల్గి మురుగు నీరు పోయే వసతి గల నల్ల రేగడి భూములు చాలా అనుకూలం. ఆమ్ల, క్షార గుణాలు ఉన్న భూములు, లోతట్టు భూములు ఈ పంట సాగుకు పనికి రావు.

విత్తేకాలం :

అక్టోబరు 15 నవంబరు 15 వరకు నీటి సదుపాయం ఉన్న చోట నవంబరు నెలాఖరు వరకు విత్తుకోవచ్చు. అక్టోబరుకు ముందే నాటినట్లయితే మొలకశాతం తగ్గుతుంది. నవంబరు తరువాత నాటితే తెగుళ్ళ ఉధృతి పెరుగుతుంది.

అనువైన రకాలు :

సింధు, సాధన, స్వాతి, సుధ.

నేల తయారీ, విత్తుట :

మెత్తటి పదును వచ్చే వరకు భూమిని 3-4 సార్లు దున్నాలి. సరిగా దుక్కి చేయకుండా విత్తితే మొలకశాతం బాగా తగ్గే అవకాశం ఉంది. ఆఖరి దుక్కిలో ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు వేయాలి. ఎకరాకు 4-6 కిలోల విత్తనం వాడుకోవాలి. కిలో విత్తనానికి 2-5 గ్రా. మాంకోజెబ్‌తో గానీ, 1 గ్రా. కార్బండాజిమ్‌తో గాని విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి. విత్తనాన్ని సాలుకు సాలుకు మధ్య 30 సెం.మీ మొక్కల మధ్య 10 సెం.మీ దూరం ఉండేటట్లు 4 సెం.మీ లోతులో

గొర్రుతో విత్తుకోవాలి. విత్తిన 8వ రోజు మొలక ప్రారంభం అవుతుంది. 12-14 రోజులకు మొక్క పైకి కనబడుతుంది. విత్తనాలను బద్దలు చేసి విత్తడం వలన విత్తనం ఆదా అవడమేకాకుండా మొలక కూడా తొందరగా వస్తుంది. విత్తే ముందు 5-6 గం॥ నానబెట్టి ఆరిన తరువాత విత్తినట్లయితే మొలక త్వరగా వస్తుంది. విత్తేముందు అజోస్పైరిల్లం ఎకరాకు 600 గ్రా. చొప్పున మోతాదు విత్తనానికి కలిపి శుద్ధి చేసినట్లయితే దిగుబడి 10-15 శాతం వరకు పెరుగుతుంది. బయోఫెర్టిలైజర్ మరియు శిలీంధ్ర నాశినులతో విత్తన శుద్ధి చేయవలసినప్పుడు శిలీంధ్ర నాశనితో రెండు - మూడు రోజుల ముందు విత్తన శుద్ధి చేయాలి. బయోఫెర్టిలైజర్‌తో మాత్రం విత్తే ముందు విత్తన శుద్ధి చేయాలి.

ఎరువులు :

ఎకరాకు 25 కిలోల యూరియా, 75 కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 15 కిలోల మ్యూరేట్‌ఆఫ్ పొటాష్ ఆఖరి దుక్కిలో వేయాలి. విత్తిన 30 రోజులకు 15 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పై పాటుగా వేసి మంచి దిగుబడులు పొందవచ్చు.

అంతర కృషి :

విత్తిన తరువాత 6-7 రోజులకు తేలికగా గుంటక తోలాలి. మొలక శాతం ఎక్కువగా ఉండి, మొక్కల సాంద్రత ఎక్కువ అయినట్లయితే అధికంగా ఉన్న మొక్కలు తీసివేయాలి. పైరు తొలిదశలో పెరుగుదల తక్కువగా ఉంటుంది. కాబట్టి కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. కలుపు నిర్మూలనకు ఎకరానికి పెండిమిథాలిన్ 1 లీటరు లేక అలాక్లోర్ 1.6 లీటర్లు, 200 లీ॥ నీటితో కలిపి విత్తనం వేసిన వెంటనే నేలంతా తడిసేలా పిచికారి చేయాలి. కలుపు మందు స్ప్రే చేసే ముందు నేలలో తేమ ఉండాలి. పైరు తొలిదశలో (40 రోజుల్లో) 2-3 సార్లు గొర్రుతో అంతర కృషి చేయాలి.

సస్య రక్షణ :

- ధనియాలను ముఖ్యంగా రసం పీల్చే పురుగులు, లద్దె పురుగులు ఆశిస్తాయి. పేనుబంక ఆకులు పూత నుండి రసాన్ని పీల్చి గింజలు ఏర్పడకుండా చేస్తాయి. దీని నివారణకు లీటరు నీటిలో 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ లేదా మిథైల్ డెమిటాన్ 2.0 మి.లీ, లేదా డైమిథోయేట్ 2 మి.లీ కలిపి పిచికారి చేయాలి.
- ఎర్రనల్లి పంటను ఆశించినట్లయితే నీటిలో కరిగే గంధకం పొడిగాని, ట్రైకోఫాల్ అరుకు మందులు గాని పిచికారి చేసి నివారించాలి.
- ఆకులపై లద్దె పురగులు, ఆకు తొలిచే పురుగులు ఆశిస్తే మోనోక్రోటోఫాస్ గాని క్వినాల్‌ఫాస్ గాని పిచికారి చేసి నివారణ చేయవచ్చు.
- బూడిద తెగులు ఆశించినట్లయితే నీటిలో కరిగే గంధకం పొడి గాని కార్బండిజమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి గాని పిచికారి చేయాలి.
- గింజ నలుపు తిరగడాన్ని గమనించినట్లయితే మాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పూత నుండి గింజ పట్టే దశలలో 2 సార్లు పిచికారి చేయాలి.

కోత :

పైరు రకాన్ని బట్టి 40-45 రోజులకు పూత మొదలై, 80-100 రోజులకు కోతకు వస్తుంది. మొక్కలపై 60 శాతం గింజలు పక్వానికి వచ్చి గింజలు పసుపు రంగులోనికి మారినప్పుడు కోత కోయాలి. తరువాత 2-3 రోజులు పొలంలోనే ఆరనిచ్చి నూర్చుకోవాలి. ధనియాలు 7-10 రోజులు సాయంత్రం ఎండలో ఆరబెట్టాలి. అలా చేసినట్లయితే మంచి రంగు, సువాసన అభివృద్ధి చెందుతాయి. మిట్ట మధ్యాహ్నం ఎండలో ఆరబెడితే గింజ బరువు, నాణ్యత తగ్గుతాయి. గింజలలో తేమ శాతం ఎక్కువ ఉంటే బూజు తెగులు ఆశిస్తుంది. 10 శాతం కంటే ఎక్కువ తేమ లేకుండా ఆరబెట్టాలి. గింజలను విత్తనంగా నిల్వ ఉంచినట్లయితే సంచులలో మలాథియాన్ చల్లడం, విత్తనం అప్పుడప్పుడు ఆరబెట్టడం ద్వారా నిల్వలో ఆశించే పురుగుల నుండి రక్షించుకోవచ్చు. ❊

రబీ పొద్దుతిరుగుడు విత్తనోత్పత్తిలో యాజమాన్య పద్ధతులు

ఎస్. మధుసూదన్ రెడ్డి, జి. గోపాలకృష్ణ, ఆర్. సాయికుమార్, నాగేందర్, పి.హెచ్.డి రిసెర్చ్ స్కాలర్స్, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్,
అసిస్టెంట్ ప్రొఫెసర్ వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట, ఫోన్ : 9492357905

పొద్దుతిరుగుడు చాలా ముఖ్యమైన నూనెగింజల పంటగా ప్రాముఖ్యత సంతరించుకుంది. పొద్దుతిరుగుడులో నూనె (49 శాతం) మరియు మాంసకృత్తులు (22 శాతం) ఉంటాయి. ఈ నూనెలో లినోలిక్ ఆమ్లం (65 శాతం) ఎక్కువగా ఉండడం మూలాన ఆరోగ్యపరంగా కూడా వేరుశనగ మరియు నువ్వుల నూనె కంటే శ్రేష్టమైనది. అంతేగాక ఈ నూనెను వనస్పతి తయారీకి, వార్నిష్, సబ్బు, కలప పరిశ్రమల్లో విస్తారంగా వాడుతున్నారు. నూనె తీసిన తరువాత వచ్చిన పిప్పిని పశువులకు కోళ్ళకు దాణాగాను విరివిగా వాడుతున్నారు.

ఖరీఫ్ సమయంలో పండించే పొద్దుతిరుగుడు దిగుబడి కంటే రబీ సమయంలో సాగు చేసే పొద్దుతిరుగుడు దిగుబడి అధికంగా సాధించవచ్చు. పలు యాజమాన్యంతో పాటు విత్తనోత్పత్తిలో మెలకువలను పాటిస్తే మరింత దిగుబడులను సాధించవచ్చు. తాలు గింజలు అధికంగా ఏర్పడకుండా ఏమి జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే విత్తనం అధిక శాతం ఏర్పడటానికి ఏమి మెలకువలను పాటించాలి. పలు విషయాలను రైతులు తెలుసుకున్నట్లయితే పొద్దు తిరుగుడులో అధిక దిగుబడులు సాధించవచ్చు.

అనువైన వాతావరణ పరిస్థితి :

ఈ పంట యొక్క ఎదుగుదల 12 గంటల పగటి సమయం ఉన్నట్లయితే అధికంగా ఉంటుంది. ఈ పంట సాగుకు 20-25^0 ఉష్ణోగ్రత అనువైనది. పూత గింజకట్టు దశలో అధిక వర్షపాతం లేనట్లయితే అధిక దిగుబడి సాధించవచ్చు. నీటి పారుదల కింద ఈ పంటను సంవత్సరం పొడవునా పండించవచ్చు. అయితే పంట విత్తేటప్పుడు గుర్తుంచుకోవలసిన ముఖ్య విషయమేమిటంటే పూత గింజలు తయారయ్యే దశలో ఎక్కువ తేమ శాతం, ఉష్ణోగ్రత ఉండకుండా చూసుకోవాలి.

విత్తే సమయం :

రబీలో నవంబర్ - డిసెంబరు మరియు జనవరిలో కూడా విత్తుకోవచ్చు. వరి తరువాత పొద్దుతిరుగుడు వేసుకునే వారు డిసెంబరు ఆఖరి వారం నుండి జనవరి మొదటివారం వరకు విత్తుకోవాలి. విత్తే సమయం కూడా నూనె నాణ్యతను పెంచుతుంది. పువ్వు వికసించే మరియు విత్తనం గట్టిపడే సమయంలో ఎక్కువ పగలు సూర్యరశ్మి ఉన్నట్లయితే నూనె శాతం ఎక్కువ వస్తుంది.

అనువైన నేలలు :

నీటి వసతి అనుకూలంగా ఉన్నట్లయితే తేలిక నేలలు అత్యంత అనుకూలమైనవి. నీరు నిల్వఉండని తటస్థ భూములైన ఎర్ర, ఇసుక, రేగడి మరియు ఒండ్రునేలలు దీని సాగుకు శ్రేష్ఠం.

నేల తయారీ :

భూమిని మూడు నుంచి నాలుగు సార్లు బాగా దున్ని మెత్తటి దుక్కిని తయారు చేసుకోవాలి.

ఏర్పాటు దూరం :

పునాది విత్తనం	ధృవీకరణ	విత్తనం
రకాలు	400	200
సంకరాలు	600	400

విత్తనం, విత్తుట :

అధీకృత సంస్థల నుండి విత్తనాన్ని సేకరించి దానికి సంబంధించిన చీటి మరియు రశీదు పొందాలి. తాజా విత్తనాలకు నిద్రావస్థ 45-60 రోజుల వరకు ఉంటుంది. అందుకని మంచి మొలకశాతం పొందుటకు 2-3 మాసాల ముందు పండించిన విత్తనం వాడటం మంచిది. మొలక శాతం పెంచుటకు తాజా విత్తనాన్ని 300 పిపిఎమ్ ఇథరిల్ ద్రావణంలో 8 గంటలు లేదా 0.5 శాతం నైట్రోజన్ ద్రావణంలో 16 గంటల పాటు నానబెట్టి, ఆరిన తరువాత విత్తుకోవాలి.

విత్తన మోతాదు	విత్తేదూరం
రకాలు : 6కి/ఎకరానికి	45×20 సెం.మీ
సంకర రకాలు :	
జనని: 4.8 కి/ఎకరానికి	60×30 సెం.మీ
జనక : 1.6 కి / ఎకరానికి	45×20 సెం.మీ

వరుసల నిష్పత్తి : 8:1 లేదా 4:1

విత్తన శుద్ధి :

2 గ్రా. కార్బండిజమ్ అనే మందును కిలో విత్తనానికి వాడాలి. 4 గ్రా. ఇమిడాక్లోపిడ్ అనే మందును 1 కిలో విత్తన శుద్ధికి వాడాలి.

పలుచన చేయుట :

విత్తనం మొలకెత్తిన 10-15 రోజుల తరువాత కుదురుకు ఆరోగ్యవంతమైన ఒక మొక్కను ఉంచి మిగిలిన మొక్కలను తీసివేయాలి. ఈ విధంగా చేయడం వల్ల మొక్కల మధ్య నీరు పోషకాల కోసం పోటీ తగ్గి పువ్వు పరిమాణం పెరిగి అధిక దిగుబడి పొందుటకు దోహదపడుతుంది.

తాలు విత్తనాలు ఏర్పడటానికి కారణాలు :

1. పరాగ సంపర్కం : పొద్దు తిరుగుడు పరపరాగ సంపర్క పంట. ఈ సంపర్కం తేనెటీగల ద్వారా సిద్ధిస్తుంది. తేనెటీగల సంఖ్య కీటక నాశినుల ఉపయోగం పై ఆధారపడి ఉంటుంది. కీటకాల చర్య తక్కువగా ఉన్నప్పుడు విత్తనం ఏర్పడేవి కూడా తగ్గుతుంది. తాలు విత్తనాలు ఏర్పడతాయి.

2. గ్రీవ పుష్పాలు : వెలుగు తీవ్రత ఎక్కువగా ఉన్న వేసవి కాలంలో సాధారణంగా గ్రీవ పుష్పాలు ఏర్పడతాయి. ఇవి తల పెరుగుదలకు

పోషకాలను తీసుకోవడం మూలాన ప్రధాన తలకి పోషకాలు సరిగా అందవు.

3. సూక్ష్మ పోషక లోపాలు : Zn : IAA ఉత్పత్తి, Fe, B : పుప్పొడి వంధ్యత్వం మరియు పుప్పొడి మొలకెత్తుటకు ఉపయోగం లాంటిది లోపిస్తే తాలు విత్తనాలు ఎక్కువగా వస్తాయి.

4. స్వ విరుద్ధత వలన తన పువ్వులోని విత్తనాలను సరిగా కట్టలేదు.

తీసుకోవలసిన జాగ్రత్తలు :

ఎరువుల యాజమాన్యం :

ఎకరాకు 3 టన్నుల చివికిన పశువుల ఎరువును విత్తే 2-3 వారాల ముందు వేయాలి. భూసార పరీక్ష ఆధారంగా సిఫారసు చేయబడిన మోతాదులో పోషకాలు వాడాలి. నత్రజని మొదటి దఫా విత్తేటప్పుడు 2-6 కిలోల యూరియా తరువాత రెండవ దఫాగా విత్తిన 30 రోజుల తరువాత మొగ్గ తొడిగే దశలో 13 కిలోల యూరియా మూడవ దఫాగా 50 రోజుల తరువాత పువ్వు వికసించే దశలో 13 కిలోల యూరియా ఒక ఎకరానికి వేసుకోవాలి. మొత్తం భాస్వరాన్ని, పొటాష్ (150 - 20 కిలోలు) ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. పైపాటు ఎరువు వేసేటప్పుడు నేలలో తగినంత తేమ ఉండేటట్లు చూసుకోవాలి. గంధకం తక్కువగా ఉన్న నేలల్లో ఎకరాకు 10 కిలోల గంధకాన్ని జిప్సం రూపంలో 55 కిలోలు వేస్తే నూనె శాతం పెరిగి అధిక దిగుబడులను పొందవచ్చు. 2 గ్రాముల బొరాక్స్ లీటరు నీటికి చొప్పున కలిపి పైరు పూత దశలో ఎకరాకు 200 మందు ద్రావణం పిచికారీ చేయాలి. దీనివల్ల గింజలు ఎక్కువగా తయారవుతాయి.

నీటి యాజమాన్యం :

వాతావరణాన్ని బట్టి ఎర్రనేలల్లో 6-10 రోజుల వ్యవధిలో నల్ల రేగడి నేలల్లో 15-20 రోజుల వ్యవధిలో నీటి తడులు పెట్టాలి. నీటి తడులకు కీలక దశలు మొగ్గ తొడుగు దశ, పువ్వు వికసించు దశ, గింజకట్టు దశలు.

అనుబంధ సంపర్కం :

అనుబంధ సంపర్కం 50 శాతం పూత సమయంలో మెత్తటి గుడ్డను చేతితో పువ్వులపై ఉదయం 7-11 గంటల మధ్య రోజు విడిచి రోజు సున్నితంగా రుద్దడం వల్ల సిద్ధిస్తుంది. తేనెటీగల పెట్టెలను కూడా అమర్చి ఈ ఫలితాన్ని పొందవచ్చు.

తలలు తుంచుట :

సంకర విత్తనోత్పత్తిలో ఉపయోగించే మగ, వరుసల్లో పక్క కొమ్మలు వస్తాయి. ఇవి పరాగ సంపర్కం జరిగి అధిక విత్తనం పొందుటకు దోహదపడతాయి. అయితే పునాది విత్తనోత్పత్తిలోని మగ వరుసల్లో ఈ పక్క కొమ్మలు తుంచివేయడం ద్వారా ప్రధాన తలలోని విత్తన దిగుబడి పెరుగుతుంది.

కల్తీల ఏరివేత :

శాఖీయ దశ నుండి పంట కోత వరకు విత్తన పొలంలోని కల్తీ మొక్కలను ఎత్తు, తల పరిమాణం, కొమ్మలు వేసే గుణం, పూతల సంఖ్య, గింజరంగు మొదలగు లక్షణాల ఆధారంగా తీసివేయాలి.

పక్షుల బెడద :

ఈ పంటకు ముఖ్యంగా రామచిలుకల బెడద ఎక్కువ. వీటి నివారణకు పైరును పెద్ద కమతాలతో వేయాలి. మెరుపు రిబ్బనులను పైరుపైన అడుగు ఎత్తున సూర్యరశ్మి రిబ్బనుపై పడేటట్లు ఉత్తరం, దక్షిణ దిశగా కట్టాలి. శబ్దం చేయడం వల్ల కాని, దిష్టి బొమ్మలను ఉపయోగించి కాని పక్షులను తరిమికొట్టాలి.

పంట కోత :

తల రంగు ఆకుపచ్చ నుండి నిమ్మ పసుపు రంగుకు మారినప్పుడు పక్వానికి వచ్చినట్లుగా గుర్తించవచ్చు. ఇది దాదాపు పూత తరువాత 40-45 రోజులు తీసుకుంటుంది. తలాన్ని ఒక్కసారిగా కోత చేపట్టవచ్చు. సంకర విత్తనోత్పత్తిలో మగ వరుసలు ముందుగా కోసిన తరువాతనే ఆడ వరుసలను కోసుకోవాలి. పక్వతను ముందుగా పొందడానికి mgcl 2 ను 8 కిలోలు ఎకరానికి వేసుకోవాలి.

నూర్పిడి :

కోత తరువాత తలలను 15-18 తేమ శాతానికి ఆరబెట్టి తరువాత గింజలను వేరు చేయాలి.

ఆరబెట్టుట :

తలల నుండి వేరు చేసిన విత్తనాలను 10-12 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టాలి.

ఈ విధంగా రబీ సమయంలో వేసుకునే పొద్దుతిరుగుడు విత్తనోత్పత్తిలో మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తూ, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తున్నట్లయితే నాణ్యమైన విత్తన దిగుబడిని పొందవచ్చు. ❋

ఆధునిక సాంకేతికతకు అద్దంపట్టిన లాం ఎగ్జిబిషన్

పరిశోధన, నిపుణత, వ్యవసాయం, వాణిజ్యం, రైతులు ఒకే వేదికపైకి

వ్యవసాయాన్ని ఆధునీకరించి, దాన్ని లాభసాటి వృత్తిగా మార్చాలనే అభిలాష ఎప్పటినుండో వ్యక్తమవుతున్నది. ఈ కృషిలో భాగంగా భారతీయ పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) అనుబంధ సంస్థ ఎపిటిడిసి సంయుక్తంగా నిర్వహించిన ఎపిటెక్-2012 రైతుల కోలాహలం, శాస్త్రవేత్తల సమాహారం, వినూత్న వ్యవసాయ ప్రక్రియలకు శ్రీకారంచుట్టి రైతులను నూతన వ్యవస్థ వైపు మళ్ళిస్తున్న నిపుణుల బృందం, ఉత్పాదక సంస్థలు అన్నీ కలసి ఒకే వేదికపైకి వచ్చాయి. గుంటూరు పంటలకే కాకుండా, వ్యవసాయ వాణిజ్యానికి కేంద్ర బిందువు కావడం, దేశ సస్య విప్లవంలో కీలకపాత్ర వహించిన లాం పరిశోధనా కేంద్రం వేదిక కావడం ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి హేతువుగా మారాయి.

జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (నార్మ్), ఆచార్య ఎన్.జి.రంగా విశ్వ విద్యాలయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ, సహకార శాఖ, యాంత్రీకరణకు సూత్రధారిగా వ్యవహరిస్తున్న ఆగ్రోస్‌ల సారధ్యంలో ఈ మహత్తర కార్యక్రమం డిసెంబరు 6-8 తేదీల్లో ఘనంగా విజయవంతమైంది. నాలుగు రాష్ట్రాల పొగాకు రైతులకు దశ-దిశ చూపిస్తున్న కేంద్ర పొగాకు బోర్డు, వైవిధ్య వ్యవసాయ, పారిశ్రామిక కార్యకలాపాలతో వన్నెకెక్కిన ఐటిసి కంపెనీ, నాబార్డు సంస్థలు మద్దతుగా నిలవగా, ప్రముఖ దినపత్రిక ఈనాడు, అన్నదాత మాసపత్రికలతో పాటు అగ్రిక్లినిక్ వ్యవసాయ మాసపత్రిక మరియు కిసాన్‌మీడియా ఇన్నోవేషన్స్ సంస్థలు మీడియా పార్టనర్లుగా వ్యవహరించడం విశేషం. పలు బహుళజాతి కంపెనీల సరసన, వినూత్న వ్యవసాయ పథం చేపట్టిన నోవా అగ్రిటెక్ సంస్థ, సాంకేతిక సదస్సుల నిర్వహణలో ప్రముఖపాత్ర వహించింది.

వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేసిన ఎగ్జిబిషన్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన సంస్థలు, వ్యవసాయ యంత్రాలు, పరికరాలు కన్నుల పండుగగా మారాయి. అభ్యుదయ ఆలోచనలకు, ముందుచూపుకు పేరొందిన గుంటూరు జిల్లా రైతులతో పాటు కృష్ణా, ప్రకాశం జిల్లాల నుండి కూడా ఒక ప్రవాహంలా సందర్శకులు తరలి వచ్చారు. ప్రదర్శనలో అత్యధిక శాతం పంట పొలాలకు అనుగుణంగా ఉపయోగపడే పరికరాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా రోటావేటర్లు అధిక సంఖ్యలో వివిధ ప్రమాణాలకు అనుగుణంగా దర్శనమిచ్చాయి. వరి నాట్లు , నూర్పిడి యంత్రాలు విశేష ఆకర్షణగా నిలిచాయి. వాటితో పాటు పెద్ద, మధ్యతరహా, చిన్న టిల్లర్లు రైతులను ఆకర్షించాయి. ఉద్యానవనాలకు ఉపయోగపడే వాటర్ స్టోరేజ్ ట్యాంకులు వివిధ సామర్థ్యాలతో అనేక రూపాల్లో చౌక ధరలకు లభించే అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకున్నారు. అలాగే పశుదాణా, పామాయిల్ సాగుకు ఉపకరించే పరికరాలు, సాంకేతికత కనువిందు చేసింది. ట్రాక్టరుకు అనుబంధంగా భూమిని చదునుచేసే యంత్రాలు పదుల సంఖ్యలో దర్శనమిచ్చాయి. అదే విధంగా భూసార పరీక్షలు నిర్వహించేందుకు కావల్సిన సాంకేతికత, కరెంటు వైర్లను సుదూరం నుండి నియంత్రించగలిగిన సమాచార సాంకేతిక పరికరాలు ప్రదర్శనలో ప్రముఖ పాత్ర వహించాయి. బేయర్, నూజివీడుసీడ్స్, గోద్రేజ్ ఆగ్రోవెట్, ఇండో అమెరికన్ హైబ్రీడ్ సీడ్స్, జెసిబి ఇండియా లిమిటెడ్, జాన్‌డీర్ ఇండియా ప్రై. లిమిటెడ్ లాంటి, నాందారీ సీడ్స్ వంటి ప్రముఖ ఉత్పాదక సంస్థలు తమ స్టాళ్ళను నిర్వహించారు.

సిఐఐకు అనుబంధ సంస్థగా ఉన్న ఏపిటిడిసి గత ఏప్రిల్‌లో హైటెక్స్‌లో నిర్వహించిన సదస్సు, ప్రదర్శనలకు రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా రాగా, ఇటువంటి సదస్సులు గ్రామీణ రైతులకు చేరువలో నిర్వహించడం మంచిదనే ఆయన సూచనకు, అనేక మంది మద్దతు పలకడంతో గుంటూరులో ఈ కార్యక్రమం ఘనంగా జరగడానికి ఏర్పాట్లు జరిగాయి. రాష్ట్ర

గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ఎగ్జిబిషన్‌ను, సాంకేతిక సదస్సులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం నిజయవంతం కావడానికి జిల్లా కలెక్టరు సురేష్ కుమార్, జె.డిఏ డా॥ శ్రీధర్ విశేష కృషి జరిపారు. జెడిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యవసాయ శాఖ స్టాలు రైతులను విశేషంగా ఆకర్షించింది. లాం పరిశోధనా కేంద్రం అదనపు సంచాలకులు డా. వీర రాఘవయ్య, ఆయన సహ శాస్త్రవేత్తల సహకారంతో ఈ కార్యక్రమం ఆద్యంతం సుసంపన్నమైంది.

ఆకట్టుకున్న సాంకేతిక సదస్సులు :

సిఐఐ-ఎపిటిడిసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎపిటెక్-2012 కార్యక్రమంలో భారీ స్థాయి వ్యవసాయ ప్రదర్శనతో పాటు వ్యవసాయాన్ని ఆధునీకరించేందుకు రైతులకు కావలసిన పరిజ్ఞానాన్ని అందించడానికి ఏడు సాంకేతిక సదస్సులను నిర్వహించారు. ఈ సదస్సుల్లో సేంద్రీయ వ్యవసాయం, ఆరోగ్యకరమైన ఆహార అవసరాలు, ఎగుమతుల లక్ష్యాలపై జాతీయ వ్యవసాయ పరిశోధనా అకాడమి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా॥ పి. రమేష్, హనీక్లిన్ టెక్నాలజీ డైరెక్టర్ శ్రావణ్ బండా, ధరణీ ఫారెస్ట్రీ సంస్థకు చెందిన పి. వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయంతో ఆహార భద్రత ఎలా లభిస్తుంది. పోషకాహారాన్ని తగినంతగా అందించగలమా? అందరూ చెబుతున్నట్లు సేంద్రీయ వ్యవసాయం వల్ల ప్రామాణిక ఆహారం లభించేనా? సేంద్రీయ వ్యవసాయం లాభసాటి వృత్తేనా, ఈ తరహా వ్యవసాయం వల్ల నిజంగా పురుగులను, వ్యాధులను నివారించగలమా? అనే సందేహాలకు డా॥ రమేష్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమాధానమిచ్చారు. ప్రపంచంలోని 160 దేశాల్లో 37.2 మిలియన్ హెక్టార్ల భూమిపై సేంద్రీయ వ్యవసాయం నిర్వహిస్తున్నారని, ఇది కేవలం మొత్తం భూమిలో 0.9 శాతం మాత్రమేనని ఆయన తెలిపారు. మనదేశంలో 4.43 మిలియన్ హెక్టార్లలో 3.88 మిలియన్ టన్నుల సేంద్రీయ ఆహార ఉత్పత్తి జరుగుతున్నదని బాస్మతి బియ్యం, పప్పుధాన్యాలు, తేనె, తేయాకు, సుగంధ ద్రవ్యాలు, కాఫీ, నూనెగింజలు, పండ్లు ఔషధ మొక్కలు తదితర పంటలు సేంద్రీయ పద్ధతిలో పండిస్తున్నారు. ఆహార రంగంలోనే కాకుండా సేంద్రీయ పత్తి ఉత్పత్తి కూడా జరుగుతుంది. 2010-11 సం॥లో 69 వేల 837 మెట్రిక్ టన్నుల సేంద్రీయ పదార్థాలను 86 ఉత్పత్తులను భారత్ ఎగుమతి చేసింది. వీటి విలువ 157.22 మిలియన్ డాలర్లుగా నమోదైంది.

భారతదేశం పండ్ల ఉత్పత్తిలో రెండవస్థానంలో ఉండగా ఉత్పత్తి అయిన సరుకు మార్కెట్లోకి వెళ్ళేలోగా మౌలిక సౌకర్యాలలేమితో వృధాగా పాడైపోతున్నాయి. అదే రకంగా కూరగాయలు కూడా. ఇలా వృధా అయ్యే దిగుబడి మొత్తం ఉత్పత్తిలో 25 శాతంగా ఉందని శ్రావణ్ బండా తెలిపారు. ఇలా వృధా అయిన పండ్లు, కూరగాయలను మున్సిపల్ చెత్తలో కలిపివేసి పనికి రాకుండా చేయడం కంటే దీన్ని సేంద్రీయ ఎరువుగా వినియోగించుకొని పంటలకు వేయవచ్చు. అలాగే రెస్టారెంట్లలోనూ, గృహాల్లోనూ, వృధా అవుతున్న ఉత్పత్తులను సమీకరించి వేడి చేసి కరిగించి అమినోయాసిడ్స్, సూక్ష్మపోషకాలుగా మొక్కలకు వినియోగించుకోవచ్చు. వీటి ఉపయోగం వల్ల రసాయన అవశేషాలు లేని పండ్లు, పూలు, కూరగాయల ఉత్పత్తులను తీయవచ్చు. ఈ రకమైన ద్రవపదార్థాన్ని మొక్కలపై స్ప్రేచేసి నాణ్యమైన పంటను తీయవచ్చని శ్రావణ్ తెలిపారు.

భూసారాన్ని పెంచేందుకు రసాయనాలను వినియోగించకుండా తమ సంస్థ ధరణి హెర్బల్ పౌడర్, పోలియాస్ప్రేయర్ మార్కెట్లోకి ప్రవేశపెట్టామని ఆ సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. రెండవ సదస్సుకు వ్యవసాయ యాంత్రీకరణపై రాజేంద్రనగర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల డీన్ డా॥ టి.వి.వి సత్యన్నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ మహంతేష్ బి. పాటిల్

ప్రసంగిస్తూ ఖచ్చిత వ్యవసాయం ద్వారా రైతును పరిపుష్టం చేసేందుకు పిలుపునిచ్చారు. ఈ దిశగా రైతుకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు.

కోత అనంతరం వృధాను అరికట్టేందుకు శీతలీకరణ రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయాలని కోల్ట్ చైన్ నిపుణుడు సుభంశ్రీవాత్సవ సూచించారు. ప్రపంచంలో సంవత్సరానికి 105 మిలియన్ మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తితో అగ్రస్థానంలో ఉన్నామని 6.5 మిలియన్ టన్నుల మాంసం, కోడి మాంసం 6.1 మిలియన్ టన్నుల చేపల ఉత్పత్తి సంవత్సరానికి నమోదవుతుందని తెలిపారు. అయితే శీతలీకరణ రవాణా ఇబ్బందుల వల్ల 30 శాతం ఉత్పత్తిని వృధాగా నష్టపోతున్నామని, అదే సమయంలో మనకన్నా చిన్నదేశమైన థాయిలాండ్ కంటే అతి తక్కువగా పండ్ల రవాణా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా ఉత్పత్తుల ఎగుమతులు, స్వదేశంలో వాటి రవాణా నిల్వ సౌకర్యాలు వృద్ధి చేసుకుంటేనే ఉత్పత్తిదారులకు మేలు జరుగుతుందని వివరించారు.

సాంకేతిక సదస్సుల్లో ఇంకా ప్రముఖ శాస్త్రజ్ఞులు డా॥ సి.హెచ్ శ్రీనివాసరావు, కార్పోరేట్ ప్రముఖులు జగదీష్ సుంకడ్, పి.జి శ్రీనివాస్, డా॥ కరీముల్లా, డా॥ గురవా రెడ్డి, ఐటిసికి చెందిన హెచ్.ఎన్ రాంప్రసాద్, శ్రీనాధ్ రామకృష్ణన్, సంజీవశర్మ తదితరులు పాల్గొన్నారు. సదస్సులో ప్రముఖ శాస్త్రవేత్త ఎన్ఆర్ఐ అగ్రిటెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డా॥ ఆలపాటి సత్యన్నారాయణ, హైబ్రీడ్ మిరప సాగు సమృద్ధి అనే అంశంపై ప్రసంగించారు. గుంటూరును మిరప రాజధానిగా విస్తీర్ణంలోనూ, దిగుబడుల్లోనూ ప్రధమ స్థానంలో ఉందని అభివర్ణించారు. ఇక్కడ ఉత్పత్తి అయిన మిరప విత్తనాలు ఖండాంతరాల్లో ప్రాముఖ్యత పొందాయని అందులో హైబ్రీడ్ రకాలు మరింత ఆదరణకు నోచుకున్నాయని తెలిపారు. అధిక దిగుబడులతో పాటు రంగు, ఘాటు, నిలకడైన ప్రామాణికత కలిగి ఉండడం విశేషమని తామర పురుగులు, వైరస్‌లను తట్టుకొని ఎన్నోయేళ్ళుగా మార్కెట్లను శాసిస్తున్నాయని వివరించారు. జన్యుపరమైన స్వచ్ఛత కలిగిన హైబ్రీడ్ విత్తనాల సరఫరాలో ప్రైవేటు కంపెనీలు కూడా గణనీయంగా పాలు పంచుకుంటున్నాయని తెలిపారు. మొదటి సస్య విప్లవంలో ఆహార భద్రత అవసరాల దృష్ట్యా రసాయనాల ఎరువుల వినియోగం ద్వారా ఎక్కువ దిగుబడులు సాధించవలసిన అవసరం ఏర్పడింది. దాంతో ఉత్పత్తి ఖర్చులు ఎక్కువ కావడం ధరలు నిలకడ లేక రైతులు ఇబ్బంది పడడం జరుగుతుంది. అవసరమున్నా లేక పోయినా అధిక మోతాదులో రసాయనాలను పంటలపై ప్రయోగించడం వలన శత్రు పురుగులతో పాటు మిత్ర పురుగులు కూడా నశించిపోవడం, మొక్క విషపూరితమై పంటలపై దాని ప్రభావం పడడం మనం చూస్తున్నామని అన్నారు. ముఖ్యంగా సూక్ష్మజీవులు నశించడం వలన నేల ఆరోగ్యం దెబ్బతినడం, సేంద్రీయ కర్బన శాతం పడిపోవడం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది రైతులు చైనాలో అధిక దిగుబడి గురించి తనను అడిగారని, అక్కడ వ్యవసాయం చేయడంలో రైతులు మనకంటే గొప్పవారేమి కాదని, భూమిలో 2.5 శాతం వరకు ఉన్న కర్బనమే వారి పంటలకు కల్పతరువుగా పనిచేస్తుందని వివరించారు. 10 వేల సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్న భారత్‌లో మన అనాలోచిత ధోరణుల వలన కర్బనశాతం పడిపోయిందని, 0.1, 0.2 శాతానికి మించి కర్బనం లేకపోవడంతో పంటల దుస్థితి ఘోరంగా ఉందని అన్నారు. ముఖ్యంగా దేశానికి ఆహార భద్రత కల్పించేందుకు సస్య విప్లవంలో అత్యధికంగా రసాయనాలు, ఎరువులు, వినియోగించడం వలన భూమి సారాన్ని కోల్పోయిందని వివరించారు. వేదకాలం నుండి భారత్ వ్యవసాయ సాంప్రదాయాలు సమున్నతమైనవని, అప్పటి వ్యవసాయ పద్ధతులపై రచనలను కాపీకొట్టి ఆసియా వ్యవసాయ చరిత్ర పేరుతో ఆంగ్లంలో పుస్తకాలు ప్రచురించి మన పద్ధతులను విదేశీయులు తస్కరించారని ఆరోపించారు.

ఎన్నో తరాలుగా సాంప్రదాయ వ్యవసాయానికి పుట్టినిల్లుగా పేరొందిన గుంటూరు, ప్రకాశం జిల్లాల రైతులు ఎంతో పవిత్రమైన ఒంగోలు జాతి పశువుల పెంపకానికి దూరమైనారని ఆవేదన వ్యక్తం చేస్తూ సేంద్రీయ ఎరువుల ఆవశ్యకత గురించి సవివరంగా తెలిపారు. ముఖ్యంగా మనకు ఎంతో పవిత్రమైన ఒంగోలు జాతి పశువుల పెంపకం వలన పంటకు వచ్చే లాభాలను మనం ప్రస్తుతం కోల్పోయామని తెలిపారు. ఒక ఆవు-దూడ ఒక రోజు విసర్జించిన మూత్రానికి పేడకు ఉన్న ఔషధ గుణాలతో ఎంతో లాభం పొందవచ్చునని తెలిపారు. పంచగవ్యగానూ, అమృతజలంగానూ, వాటిని తయారుచేసి పొలంలో కోట్ల సంఖ్యలో సూక్ష్మజీవులను

పెంచడం ద్వారా నేల గుల్లబారి వ్యవసాయానికి ఎంతో తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. అంతేకాకుండా, మిరప, వరి, ఇతర పంటల వ్యర్థాలను భూమిలో కలియదున్నకుండా, వాటిని తగులబెట్టడం ద్వారా మనం విలువైన శక్తిని కోల్పోతున్నామని వివరించారు. కూలీల వినియోగంతో ఖర్చు పెరిగిపోతుందని, భయపడకుండా దీనినే పెట్టుబడిగా భావించి రైతులు భూసారాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పచ్చిరొట్ట పైర్లను సాగుచేసి భూమిలో కలిపివేయడం ద్వారా జరిగే ఉపయోగాలను మరచిపోకూడదని తెలిపారు. ముఖ్యంగా మొక్కలకు ప్రధాన ఆలంబనగా నిలిచే వేరు వ్యవస్థ గురించి రైతులు, రైతులతోపాటు శాస్త్రవేత్తలు కూడా అసలు ఆలోచించడం లేదని, ఇది దురదృష్టకరమని అన్నారు. మిరపలో రసాయన అవశేషాలు లేని ఉత్పత్తులను తీయడం ద్వారా కేవలం ఎగుమతి లక్ష్యాలనే సాధించుకోవడం కాకుండా, స్వజాతి జనుల ఆరోగ్య స్థితులను మెరుగుపరచేదిగా కూడా భావించాలని కోరారు.

అందరినీ ఆకర్షించిన జీరోటిల్లేజ్ పత్తి సాగు : నోవా కంపెనీ సాగు పద్ధతులపై విస్తృత చర్చ :

ఎన్నో వ్యయప్రయాసలకోర్చి కూడా రైతు పత్తిని సాగు చేస్తున్నాడంటే దానికున్న అంతర్జాతీయ ఆదరణ, ఎగుమతుల అవకాశాలను దృష్టిలో పెట్టుకొనే అనేది అందరికీ తెలిసిన విషయమే. రోజు రోజుకూ ఖర్చులు పెరిగిపోవడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం అన్నీ సజావుగా ఉన్నా ధరలు గిట్టుబాటు కాకపోవడం పత్తిలో ఉన్న ప్రధాన సమస్య. దానితో పాటు పెరుగుతున్న కూలీల సమస్య, ముఖ్యంగా పత్తితీతలో ఎదురవుతున్న చేదు అనుభవాల నేపథ్యంలో నోవా అగ్రిటెక్ కంపెనీ విస్తృత రీతిలో, ఇంతకు ముందు పత్తి పంట చరిత్రలో లేని విధంగా జీరోటిల్లేజ్ సాగుకు నడుంకట్టడం, ఆ ప్రయోగం విజయవంతం కావడం అందరికీ తెలిసిందే. లాంఫాంలోని ఆడిటోరియంలో వందలాది మంది వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతుల సమక్షంలో కంపెనీ టెక్నికల్ మేనేజర్ శ్రీకాంత్ యెనిగళ్ళ ఈ నూతన ఆవిష్కరణలను పరిచయం చేశారు.

రోజు రోజుకూ ప్రతికూల వాతావరణం వల్ల నీటి వనరులు తరిగిపోవడం, అతివృష్టి అనావృష్టితో సున్నితమైన పత్తి పంటకు నష్టం వాటిల్లడం, ఎందరు వారించినా పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిపోవడం వంటి అనుభవాల నేపథ్యంలో పత్తి రైతులకు నూతన సాంకేతికతను అందజేసే కర్తవ్యాన్ని నోవా అగ్రిటెక్ కంపెనీ స్వీకరించిందని వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి రాబట్టేందుకు, ప్రధాన అవరోధంగా ఉన్న కలుపు నివారణకు, అంతర కృషి ద్వారా జరిగే వ్యయాన్ని తగ్గించేందుకు అన్వేషిస్తున్న నేపథ్యంలో మల్చింగ్‌పై పత్తిని నాటి జీరోటిల్లేజ్ పద్ధతిలో సాగు చేయడం వల్ల వచ్చిన ఫలితాలు మెరుగుగా ఉండడం ఈ ప్రయోగం కొనసాగింపునకు మార్గం సుగమం చేసిందని తెలిపారు.

వాస్తవానికి ఈ జీరోటిల్లేజ్ విధానంలో ఉపయోగించిన మల్చింగ్ ఇప్పటిది కాదు. అంతకుముందు సీజన్‌లో మల్చి పరచిన బోదెలపై, డ్రిప్, ఫెర్టిగేషన్ సహకారంతో మిరప పంటను పండించారు. రాష్ట్రంలోనే వివిధ వాతావరణ పరిస్థితుల్లో మల్చిపై మెరుగైన మిరప సాగుకు శ్రీకారం చుట్టి, ఆ పంట తీసివేసిన తరువాత మొదళ్ళు తొలగించి వాటి పక్కనే పత్తి గింజలు నాటడం, రెండు నెలల్లో మొక్క ఉజ్వలంగా పెరిగి మంచి ఫలితాలను ఇస్తున్న నేపథ్యంలో జహీరాబాద్ సమీపంలోని హుగ్గెల్లి పరిశోధనా-అభివృద్ధి క్షేత్రంలో 20 ఎకరాల్లో పత్తిని, 10 ఎకరాల్లో మొక్కజొన్నను మరో 4, 5 ఎకరాల్లో కూరగాయల పంటలను నాటినట్లు తెలిపారు. జీరోటిల్లేజ్ పత్తి సాగు విధానాన్ని ఆయన ఈ కింది విధంగా వివరించారు.

పత్తి సాగుకు అనువైన పరిస్థితులు :

1. పత్తి సాగుబడికి చాలినంత సూర్యరశ్మి అవసరం. తక్కువ చలికాలం, మధ్యతరహా వర్షపాతం ఉండాలి
2. కండగల భూమి అవసరం
3. నేలలో ఖనిజాలు మధ్యస్థంగా ఉంటే చాలు
4. అతిగా, అల్పంగా నీటి లభ్యత ఉండరాదు

పత్తి పంట సాగులో విస్తార అనుభవమున్న సందర్భంలో పత్తి రైతుల కడగండ్లను స్వయంగా చూసి వారి బాధలకు నివృత్తిగా రాష్ట్రంలోని పలు వాతావరణ పరిస్థితుల్లో నోవా అగ్రిటెక్ కంపెనీ ఈ సంవత్సరం 180 ఎకరాల్లో విస్తృత రీతిలో పత్తి సాగుకు

ఉపక్రమించింది. ప్రకృతి వైపరీత్యాలకు, నీటి ఎద్దడికి, ముంపుకు పరిష్కారంగా మల్చి పరచిన బోదెలపై బిందుసేద్య వ్యవస్థను అనుసంధానించి, పంటకు నష్టం రాకుండా పటిష్టమైన యాజమాన్య పద్ధతుల ద్వారా జీరోటిల్లేజ్ పద్ధతిలో అత్యధిక దిగుబడులను సాధించింది. ఆ ప్రాంతంలోని వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు, తీరుతెన్నులను వివరించారు.

మల్చింగ్, డ్రిప్ వినియోగం వల్ల పంట ఖర్చులు పెరిగిపోతాయని, మల్చిపరచడం, డ్రిప్‌కు అనుసంధానం చేయడం కష్టమని భావించిన కొంతమంది రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు నోవా అగ్రిటెక్ కంపెనీ యాజమాన్యం నూతన విధానాన్ని అనుసరించింది. 25 మైక్రాన్ల మల్చిషీటును మొదటి పంటలో మిరపకు వినియోగించి పంట పూర్తికాగానే మొక్కల మొదళ్ళను కత్తిరించి వాటిలో పత్తి విత్తనాలను ప్రయోగాత్మకంగా మార్చిలోనే రెండెకరాల్లో నాటారు. మిరప పంటకు వేసిన పోషకాలు, ఎరువుల బలం భూమిలో మిగిలి ఉండడంతో పాటు, మల్చింగ్ వలన గుల్లబారి ఉన్న నేలలో మొక్క వేరు వ్యవస్థ బలపడి తేజస్సుతో ఎదగడం, ఇప్పటికే రెండెకరాల్లో 10 క్వింటాళ్ళకు పైగా దిగుబడి రావడం, మార్చి వరకు పత్తి సీజన్ కొనసాగనుండడంతో ఇబ్బడి ముబ్బడిగా ఫలసాయం లభించనున్నది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో మిగిలిన పొలంలో కూడా మల్చిపై పత్తిని నాటారు. సమగ్ర నస్య, నీటి యాజమాన్యంతో ఏపుగా, మెత్తగా ఎదుగుతున్న పత్తి పంటతో పాటు విత్తన మొక్కజొన్న, టమాటా, ఉల్లి పంటలను వేశారు. మల్చింగ్ వేయని ప్రాంతంలో మొక్కజొన్నతో పాటు, బెండ, చిక్కుడు, గోరుచిక్కుడు, వంగ వంటి కూరగాయ పంటలను వేశారు. వాటితో పాటు క్యారెట్, బీట్‌రూట్ వంటి దుంప పంటలనూ సాగు చేస్తున్నారు.

పత్తిలో మల్చింగ్‌తో జీరోటిల్లేజ్ సాగు వల్ల లాభాలు :

1. ప్రారంభంలోనే దుక్కిదున్నే ఖర్చు తగ్గుతుంది.
2. పరచి ఉన్న బెడ్లపై మల్చింగ్ ఉండడం వల్ల కలుపు బాగా తగ్గుతుంది.
3. మల్చి పరచడం వల్ల భూమి గుల్లగా ఉండి వేరు వ్యవస్థ బలపడి కాండం, కొమ్మలు, రెమ్మలు బలిష్టంగా, తేజోవంతంగా ఎదుగుతాయి.
4. మనుషులతో రెండుసార్లు, యంత్రాలతో మరో రెండుసార్లు అంతరకృషి చేయవలసిన అవసరం ఉండదు.
5. మల్చింగ్‌తో డ్రిప్ అనుసంధానించి నీటి యాజమాన్యాన్ని చేపట్టడం వల్ల 30 శాతం నీరు ఆదా అవుతుంది.
6. మల్చిపరచడం వల్ల మొక్క మొదళ్ళలోకి నేరుగా వర్షపు నీరు చేరకుండా కాలువల ద్వారా బయటకు వెళ్ళిపోవడంతో ముంపు సమస్య ఉండదు.
7. అదే విధంగా డ్రిప్ లేటరల్ ద్వారా ప్రవహించే నీరు, ఎరువులు, పురుగు మందులు నేరుగా మొదళ్ళలోకే చేరడం వల్ల వాటి వృధా ఎక్కువగా ఉండదు.
8. మొదటి పంటకు ఉపయోగించిన నోవా కంపెనీ వారి మల్చిషీటు (25 మైక్రాన్లు) చెక్కుచెదరకుండా వేసింది వేసినట్లు ఉండడంతో దానిలోని సుగుణాలు ముఖ్యంగా అతినీలలోహిత కిరణాల ద్వారా జరిగే హానిని నివారించడం, సూర్యరశ్మి నుండి పత్రహరితాన్ని పొందే అవకాశాన్ని పత్తి మొక్క వినియోగించుకోవడం ద్వారా పూత, పిందె అధికంగా ఉండి, దిగుబడులు అత్యధికంగా లభించే అవకాశం ఉంది.
9. అత్యధికంగా కూలీల అవసరం ఉండి, అంతరకృషి, కలుపు నివారణ వంటి వాటికి అయ్యే ఖర్చు దాదాపు 10-15 వేల రూపాయలు ఈ పద్ధతి ద్వారా రైతుకు ఆదా అయ్యే అవకాశముంది. *

- అగ్రిక్లినిక్ డెస్క్

రబీ రైతుకు అధనపు ఆదాయాన్నిచ్చే కట్టెజనుము

డా. కె. తేజేశ్వరరావు (సైంటిస్టు), అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్, సీతంపేట, శ్రీకాకుళం జిల్లా, ఫోన్ : 9493084826

కట్టె జనుముగా, కట్టెలుగా, తట్టెలుగా ఉత్తరాంధ్ర అంతటా పేరుమోసిన మొక్క. దీన్ని శాస్త్రీయంగా "క్రొటలేరియా జన్సియా" అంటారు. ఇది చిక్కుడు జాతికి చెందిన మొక్క. దీని కాయలు పండేటప్పుడు గింజలు కదిలి గలగలమంటాయి. అందుకే కొందరు దీన్ని గిలిగిచ్చకాయలు అని కూడా అంటారు. భారతదేశమంతటా ఇది పండించబడుతుంది. వ్యవసాయ రంగంలో ముఖ్యమైన పచ్చిరొట్ట ఎరువు పంటగా చెబుతాం.

విశిష్ఠమైన చరిత్రగల ఈ మొక్క క్రీస్తు పూర్వం 4 వేల సంవత్సరం నుండి సాగు చేయబడుతుంది అని చరిత్ర చెబుతుంది. 1792 సంవత్సరంలో ఈస్టు ఇండియా కంపెనీ సన్‌హమ్‌ప్‌ను యూరప్‌లో నార మొక్కగా ప్రవేశపెట్టారు. నార ఉత్పత్తిలో చైనా, బంగ్లాదేశ్, బ్రెజిల్ తరువాత భారతదేశం నాల్గవ స్థానంలో ఉంది. కానీ మనం ఇంకా నార పంటగా కాక, రొట్ట పంటగానే పరిగణిస్తున్నాం.

పచ్చిరొట్ట ఎరువుగా ఖరీఫ్ కాలంలో పండిస్తారు. ఇది తక్కువ పగటి కాలపు పంట అయినప్పటికీ, ఎక్కువ పగటికాలం ఉన్న దినాల్లో సేద్యం చేస్తే ఆకులు, కాండం బాగా పెరుగుతుంది. ఈ పంటకు 49 నుండి 429 మి.మీ వర్షపాతం అవసరం అవుతుంది.

సగటు ఉష్ణోగ్రత 15^0 - 37.5^0 సెల్సియస్ మరియు 5-8.4 ఉదజని సూచిక విలువ గల నేలల్లో పెరుగుతుంది. పి.హెచ్ 6-7 విలువ అంటే ఫాస్ఫేట్ కారణంగా పెరుగుదల రేటు అధికంగా ఉంటుంది. ఉత్తర భారతదేశంలో $17-30^0$ ఉత్తర అక్షాంశాల మధ్య పండే ఖరీఫ్ పంట. దక్షిణ భారత దేశంలో రబీ పంటగా పేరుంది. కట్టె జనుము ఏప్రిల్-సెప్టెంబరు మధ్య రుతు పవనాల సమయంలో విత్తుకుంటే సెప్టెంబరు-అక్టోబరు మధ్య పూతకు వస్తుంది.

కట్టెజనుము రకాలు :

భారతీయ శాస్త్రవేత్తలు ఆయా నేలలు శీతోష్ణ స్థితులను బట్టి పలు రకాల కట్టెజనుము వంగడాలను రూపొందించి విడుదల చేశారు. కె.12 గా (పసుపు రంగు) చాలా ప్రసిద్ధి చెందిన వంగడం. ఇది హెక్టారుకు 12 క్వింటా నార దిగుబడినిస్తుంది. ఇప్పటికీ నార ఉత్పత్తిలో జాతీయస్థాయిలో అగ్ర స్థానంలో ఉంది. దీన్ని కేంద్రీయ జనపనార మరియు పీచు పరిశోధనా స్థానం (బరక్‌పూర్) వారు రూపొందించారు.

కట్టె జనుము పరిశోధనా స్థానం ప్రతాపఘర్ వారి ద్వారా రూపొందించబడిన ఎస్.ఎస్.11అనే వంగడం కె.12 (నలుపు, పసుపు) ఎస్.జె-67.42 కంటే అధిక దిగుబడిని 90 రోజుల్లో సమకూరుస్తుంది. $23-30^0$ సెల్సియస్ ఉష్ణోగ్రత 400 మి.మీ వర్షపాతం దీని పెరుగుదలకు అనుకూలం. ఇది ముంపునీటి నిల్వను తట్టుకోలేదు. నేలలో తేమ శాతం 30కి తగ్గకుండా బాగుగా దున్నబడి, చదునుచేయబడిన పొలాల్లో విత్తుకోవాలి.

విత్తే సమయం :

మే-జూన్ మాసాల్లో నైరుతి రుతు పవనాలు వీస్తాయి. ఇది కట్టెజనుము విత్తుకోవడానికి మంచి సమయం. మేలో విత్తినవి అక్టోబరులో కోతకు సిద్ధమవుతాయి. పశ్చిమ బెంగాల్‌లో 24 పరగణాలు, బీహార్‌లో పూర్ణియా జిల్లాలోను, మహారాష్ట్రలో రత్నగిరి, పంచమహల్ జిల్లాలోను "రబీ" పంటగా పండిస్తున్నారు. అక్టోబరు-నవంబరు మాసాల్లో విత్తబడి ఫిబ్రవరి, మార్చి నెలలో దిగుబడిని ఇస్తుంది. ప్రస్తుతం ఆంధ్రరాష్ట్రంలో అన్ని మండలాల్లో అందునా ఎత్తైన గిరిజన మండలాల్లో రబీ కాలంలో విత్తనం కొరకు కట్టెజనుమును విస్తారంగా పండిస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువుగా విత్తిన

30-40 రోజుల వయసులో నేలలో కలియదున్నబడుతుంది. కట్టెజనుము 90 శాతం వరకు వెదజల్లబడే పద్ధతిలో విత్తబడుతుంది.

నాగేటి చాలును అనుసరించి విత్తనాలను జారవేస్తూ వరుసకు వరుసకు మధ్య 25-30 సెం.మీ దూరం ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకుంటూ ఒక వరుసక్రమంలో విత్తుకోవడం మంచిది. సామాన్యంగా విత్తనాలను నేలలో 2-3 సెం.మీ లోతులో మొక్కకు మొక్కకు మధ్య 5-7 సెం.మీ దూరం ఉంచుకోవాలి. నైరుతి రుతుపవనం ప్రారంభం కాగానే విత్తబడిన పైరు, తరువాత విత్తబడిన వాటి కన్నా అధికంగా దిగుబడినిస్తుంది.

విత్తన మోతాదు :

విత్తనాలు మొలకెత్తే స్థితి, నేలలో తేమ శాతం ఆధారంగా విత్తన మొలక రేటు ఆధారపడి ఉంటుంది. విత్తన మొలకశాతం 80 శాతం కాగా అంతకు మించి కానీ ఉంటే ఒక హెక్టారుకు 25 కిలోల విత్తనం సరిపోతుంది.

వెదజల్లే పద్ధతిలో సాగు చేయాలంటే హెక్టారుకు 30 కిలోల విత్తనం అవసరం. మొదట ఉత్తరం నుండి దక్షిణమునకు తరువాత పడమర నుండి తూర్పునకు క్రమంగా వెదల్లుకుంటే పొలమంతా విత్తనాలు నేల చేరతాయి. వెదజల్లిన తరువాత కంప తోలిస్తే మట్టిలో 2-3 సెం.మీ లోతులో చేరుకుంటాయి.

కలుపు యాజమాన్యం :

వెదజల్లే పద్ధతిలో విత్తన రేటు అధికంగా ఉంటే అది కలుపు తగ్గడానికి దోహదపడుతుంది. కనపగడ్డి (సజారమ్ స్పాంటానియం) పొలాల్లో విస్తరించకుండా కాపాడుకోవాలి. కట్టెలు సేద్యంలో కలుపు తీయవలసిన అవసరం ఉండదు. హైపోమియా కలుపు పెరుగుదల, పుష్పించేకాలం, పండే పంటకాలం, కట్టె జనుము వలన ఉంటుంది. కాబట్టి మొక్కను పొలం నుండి తొలగించుకోవాలి.

పంట సరళిలో పాత్ర :

ఇది చిక్కుడు జాతికి చెందిన మొక్క. కాబట్టి దీని వేళ్ళకు నత్రజని స్థిరీకరణ బుడిపెలు ఉంటాయి. ఆ బుడిపెల్లో ఉండే బాక్టీరియా గాలిలో నత్రజనిని నేలలోనికి చేర్చి స్థిరీకరిస్తుంది. నేలను సారవంతం చేస్తుంది. కావున పొలం సారవంతపు స్థాయి పెంచడంలో కట్టెజనుము కీలకమైనది. బంగాళాదుంప, పొగాకు వంటివి సేద్యం చేస్తే క్రమంగా నిమటోడ్స్ అనే నులిపురుగులు పొలంలో చేరుతాయి. పంట మార్పిడి పంటగా ఆయా పంటల తరువాత కట్టె జనుముగా సాగు చేసి భూసారాన్ని పెంచవచ్చు. అలాగే నిమటోడ్స్‌లను తొలగించుకోవచ్చు.

పరిశోధనా ఫలితాల్లో మెట్ట సేద్యం బీన్స్ తరువాత కట్టె జనుము సాగు చేయగా దిగుబడిలో 41 వృద్ధి కనిపించింది. చెరకు, వరి, గోధమ, దోస పంటల తరువాత దీన్ని పంట మార్పిడి పంటగా పచ్చిరొట్ట ఎరువు కోసం సేద్యం చేస్తారు.

ఎరువుల యాజమాన్యం :

సాధారణంగా చిక్కుడు జాతి మొక్కలకు వేళ్ళ బుడిపెల్లో రైజోబియం లెస్యమినోసారమ్ అనబడే సూక్ష్మాంగ జీవులు పరస్పర ఆధారమగు జీవన పద్ధతి ద్వారా ఆశ్రయం పొందుతాయి. రైజోబియం సూక్ష్మాంగ జీవుల వల్ల నేలలో నత్రజని స్వీకరించబడుతుంది. కట్టెజనుము ఏపుగా పెరగడానికి హెక్టారుకు సేంద్రీయ ఎరువులు 3-5 టన్నులు అవసరం. పంట తొలిదశలో హెక్టారుకు 5-10 కిలోల నత్రజని ఎరువులు, హెక్టారుకు 40 కిలోల పొటాషియం, 20 కిలోల భాస్వరం అవసరం. సూక్ష్మపోషకాలుగా కాల్షియం, మెగ్నీషియం, జింకు, మాంగనీసు, కోబాల్ట్, ఇనుము కూడా అవసరమే. వీటి వలన నత్రజని స్థాపక బుడిపెలు బాగా పెరుగుతాయి. మొక్క ఏపుగా పెరుగుతుంది.

తెగుళ్ళు :

కట్టె జనుము సోకే తెగుళ్ళలో వడలు తెగుళ్ళు ముఖ్యమైనవి. ఇది ఫ్యూజేరియం అనబడే సూక్ష్మాంగజీవి ద్వారా సోకుతుంది. 0.15 శాతం బావిస్టన్‌తో విత్తన శుద్ధి చేసి తెగులును అదుపు చేయవచ్చు. వడలు తెగులు నివారణకు పొలంలో వేపపిండిని వేసుకోవడం ద్వారా శిలీంధ్ర పెరుగుదల తగ్గడమే కాకుండా కొంతమేర మొక్కలకు సారవంతత కూడా చేకూరుతుంది. దీనికి సోకే తెగులు ఆంత్రాక్నోస్. విత్తనాలను శిలీంధ్ర నాశకాలతో శుద్ధిచేయడం, పంటమార్పిడి, బోర్డాక్స్ మిశ్రమాన్ని వాడడం ద్వారా ఈ తెగులును అదుపు చేయవచ్చు.

చీడపీడలు :

కట్టెజనుమును ఆశించే కీటకాలలో రెక్కల పురుగులు ముఖ్యమైనవి. ఇది కాయలను ఆశించి నష్టపరుస్తుంది. 0.05 శాతం క్లోరోపైరిఫాస్ 10 రోజుల విరామంలో 4-5 సార్లు పిచికారి చేసి నియంత్రించవచ్చు.

అర్జినా జాతి చిచ్చుపురుగు కట్టెజనుము ఆకులను తిని నాశనం చేస్తుంది. 5 శాతం మిథైల్ పెరాథియాన్ పొడి వెదజల్లడం ద్వారా దీన్ని నియంత్రించవచ్చు. రసం పీల్చే పురుగులను థయామిథాక్సిన్ (0.4 గ్రా/ లీ.) లేదా ఇమిడాక్లోప్రిడ్ (0.5 మి.లీ/ లీ.) లేదా ఎసిఫేట్ (1.5 గ్రా. /లీ.) ద్రావణంలో కలిపి పిచికారీ ద్వారా అదుపుచేయవచ్చు.

విత్తనోత్పత్తి :

కట్టెజనుములో పరపరాగ సంపర్కం ద్వారా విత్తనోత్పత్తి జరుగుతుంది. కట్టెజనుము విత్తన దిగుబడి ప్రధానంగా వంగడపు

రకం. విత్తన సమయం ఆశించి తెగుళ్ళు, చీడ పీడల పై ఆధారపడి ఉంటుంది. చలి తీవ్రత లేని ప్రాంతాల్లో విత్తన సేకరణ కోసం రబీ అనువైనది.

విత్తన సేకరణ కోసం సేద్యానికి అనువగు ప్రాంతాలు :

- 24^0 ఉత్తర అక్షాంశానికి దిగువున ఉండాలి.
- 10^0 సెం. కంటే శీతాకాలపు ఉష్ణోగ్రతలు అవసరం.
- మంచి సూర్యరశ్మినిచ్చే ప్రాంతం కావాలి.
- కాయ గింజ కట్టే దశలో వర్షం కురవరాదు.
- సామాన్యంగా హెక్టారుకు 18-20 క్వింటాళ్ళ విత్తనోత్పత్తి జరుగుతుంది.
- నూరు విత్తనాల బరువు సామాన్యంగా 3.4-6.0 గ్రా. వరకు వంగడానికి ఉంటుంది.
- దీని పరపరాగ సంపర్కంలో తేనెటీగల జాతికి చెందిన కీటకాలు అనువైనవి. అంటే రబీకాలంలో కట్టెజనుమున్న ప్రాంత రైతులు తేనెటీగలు పరిశ్రమ పెట్టెలను ఎకరానికి 20-25 పెట్టుకొని అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చు.
- విత్తనోత్పత్తిలో గమనించాల్సినవి ముఖ్యంగా సాగునీరు అందుబాటు, కాయతొలిచే పురుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

నారపంటగా కట్టెజనుము :

నారకోసం పండించే రైతులు 50 శాతం పూతదశలో భూమట్టానికి దగ్గరగా కోత కోసి ఊరవేత ప్రక్రియ గోగు మాదిరిగానే చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి. విత్తనం సేకరించుకున్న తరువాత ఈ పంటలో కట్టెలను ఊరవేసుకుని నార తీసుకోవడం వల్ల నార నాణ్యతలో ఏ మాత్రం మార్పు ఉండదు. అందువల్లనే కట్టెజనుములో విత్తనాన్ని సేకరించుకొని ఆదాయం పొందిన పిదప నారపై దృష్టి పెట్టవచ్చు. పంట నాటుకున్న తరువాత 90-100 రోజుల్లో కాయ తయారవుతుంది. గోగుతో పోల్చిచూస్తే నారతీత కట్టెజనుములో సులువు. కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా ఉత్తర భారత దేశంలో రాత్రి మంచు ఎక్కువగా కురుస్తున్న ప్రాంతాల్లో 10-15 రోజులు ఆరుబయట ఉంచి నార వేరు చేస్తున్నారు.

కట్టె జనుము వల్ల ఉపయోగాలు :

- విత్తనం ఏర్పడక ముందే మొక్కను కోసి పశువులకు అపాయం కలిగించని రీతిలో మేతగా వాడుకోవచ్చు.
- ఆకులను నిర్జలీకరణ చేసి పశువులకు, కోళ్ళకు అనుబంధ ఆహారంగా వినియోగిస్తారు.

- పచ్చిరొట్ట నిలువుగా ఒక హెక్టారుకు 60-80 కిలో గ్రాముల నత్రజనిని వేరు కణుపుల ద్వారా నేలకు అందించగలరు.
- కట్టెజనుము విత్తనంలో ఉండే ప్రోటీన్లు ప్లైవుడ్ పరిశ్రమల్లో బంకగా ఉపయోగిస్తున్నారు.
- విత్తనాలు సోరియాసిస్, మూత్రాశయంలో రాళ్ళు వంటివి నయం చేయడానికి మందులుగా వాడతారు.
- కాగితం తయారీలో కట్టెజనుము కాండం కూడా ఉపయోగిస్తున్నారు. ఈ కాగితం కరెన్సీ నోట్ల తయారీలో ఉపయోగపడుతుంది.
- నారతాళ్ళు, చేపలు పట్టే వలలు మొదలగువాటి తయారీలో కూడా ఉపయోగిస్తారు. ఇది చౌడును తట్టుకోగలదు. కాబట్టి సముద్రపు తీరప్రాంత కోస్తా జిల్లాల్లో పండించుకోవచ్చు.
- హౌస్ పైపులు, కాన్వాస్, బెల్టులు, టర్పాలిన్‌లు, చెప్పులు, కార్పెట్లు, టేబుల్స్, పరుపుల తయారీలో దీన్ని ఉపయోగిస్తారు.
- నెమటోడ్‌లు, కలుపు మొక్కల నివారణకు సేద్యంతో ఇది ఉపయోగపడుతుంది. పంట మార్పిడి విధానం ద్వారా పొగాకు వంటి పంటల సేద్యంలో ఏర్పడిన నిమటోడ్‌లు దీని సేద్యం ద్వారా తొలగిపోతాయి.



దోపిడీ, దళారులు లేని వ్యవస్థకు స్వాగతం చెబుదాం...

రైతన్నకు అండగా నిలుద్దాం

మన రాష్ట్రంలో తెలుగు మహాసభలతోనూ, ఢిల్లీలో అసాధారణ గ్యాంగ్ రేప్ ఉదంతాలతోనూ పాత సంవత్సరం తీపి చేదు అనుభవాల మధ్యన ముగిసిపోయింది. 2013లో అడుగుపెట్టే ముందు వర్తమానాన్ని, భవిష్యత్‌ను చేరిచి వేసుకుంటే రైతులకు మాత్రం ఒరిగిందిలేదు. నూతన సంవత్సర సంబరాలు అంబరాన్ని అంటే వేళ, రైతుల్లో నిస్సహాయత, భవిష్యత్ పట్ల ఆందోళన కొనసాగుతూనే ఉంది. ప్రతి సంవత్సరం పంట సరిగా పండక, అతివృష్టి, అనావృష్టి ఆవరించి అతికష్ట బిగుబడులు ఒక వైపు, గిట్టుబాటు ధరలేక, సకాలంలో మార్కెట్ జోక్యం లేక, పంట అమ్మకునే సమయంలో తక్కువగానూ, దళారులు మారు చేరినికి అమ్మకునే సమయంలో ధర ఎక్కువగానూ ఉండడం, ఈ నయవంచన రైతులపట్ల చిరకాలంగా కొనసాగడం చూస్తూనే ఉన్నాం. ఎక్కడో అరుదుగా జరిగే మానవ సంబంధాల వైఫల్యాలు, రేప్‌లు, కొంపాప్రవృత్తిని కొండంతగా చేసి చూపించే సమాజం రైతుల పట్ల జరుగుతున్న వివక్షత, అన్నదాతకు జరుగుతున్న అవమానాలు వెరసి ఆత్మహత్యలకు దారితీసే సంఘటనలను సమాజం పట్టించుకోవడం లేదు. గత 20 ఏళ్లుగా రెండున్నర లక్షల మందికి పైగా రైతన్నలు ఫురుగుల అన్నమే పెరుగన్నంగా భావించి శలభాల్లా మాడి మ్రై పోతుంటే, అన్నంపెట్టే అన్నదాత పట్ల పట్టని వైఖరితో ప్రభుత్వాలు, సమాజం ప్రవర్తించడం నిజంగా అమానుషమే.

ఉత్పత్తుల పెంపుకు తమ రైతులకు విపరీతమైన సబ్సిడీలు ఇచ్చి అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశాలు తోడ్పడుతుంటే, వారి బాటలో సరళీకృత ఆర్థిక విధానాలు అమలుచేస్తున్నామని చెప్పుకునే ప్రభుత్వాలు, బహుళజాతి కంపెనీల కనుసన్నల్లో మెలుగుతూ, విత్తనాలు, ఎరువులు, ఉపకరణాలు, ఇతర అత్యాధునిక యంత్రాలను ఉదారంగా ఇచ్చి ఆదుకొని ఆహార భద్రతకు కొత్త అర్థం చెప్పే ప్రయత్నం చేయడంలేదు. సమాజానికి తిండిపెట్టే బాధ్యతను తనంతతానుగా మీదవేసుకున్నా రైతన్నల సామాజిక బాధ్యత జనాభా పెరుగుదలతో పాటు మరింత పెరిగింది. 2050 సంవత్సరం నాటికి ప్రపంచ జనాభా 600 కోట్లకు, భారత జనాభా 150 కోట్లకు చేరుకోనున్న సమయంలో స్వదేశంలో ఆహారాన్ని అందించడంతో పాటు, తనకు గిట్టుబాటయ్యే విధంగా విదేశీ మార్కెట్లలో భారత ఆహార ఉత్పత్తులు ఇబ్బడి ముబ్బడిగా ప్రవేశించేందుకు అవకాశాలను కల్పించే బాధ్యత ప్రభుత్వాలదే. మొదటి సస్యవిప్లవంలో విచ్చలవిడిగా రసాయనాలు వినియోగించి తమ పొలాల స్వభావికతను కోల్పోయిన రైతన్నలు, భావితరాలకు మిగుల్చుకునేది ఏమీ లేకపోగా, రసాయన అవశేషాలతో నిండిన ఆహార పదార్థాలను తినక తప్పడం లేదు. ఈ దుస్థితి నుంచి రైతును కాపాడి మేలు రకమైన వ్యవసాయ ఉత్పత్తులను, అదే సమయంలో ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించే విధంగానూ ప్రభుత్వాలు తోడ్పడాలి.

ఇందుకు సంబంధించి విత్తన రంగంలో రైతుకు తిరిగి తన విత్తనాన్ని తానే సృష్టించుకునే విధంగా అవకాశాలు కల్పించాలి. విత్తనంపై బహుళజాతి కంపెనీల పెత్తనం వలన వచ్చే అనర్థాలను నివారించడానికి సహజ, సేంద్రీయ వ్యవసాయానికి మార్గాలు చూపించాలి. అవసరం లేకపోయినా ఎరువులను వాడే పద్ధతిని మాని మొక్క తనంత తానుగా ప్రకృతిపరంగా ఎదిగేందుకు అవకాశాలు కలిగే విధంగా విస్తృతమైన విస్తరణ కార్యకలాపాలను చేపట్టాలి. 'అగ్రి క్లినిక్' మాసపత్రిక ఒక నిష్ణాతుడైన వ్యవసాయ నిపుణుని కలగా మీ ముందుకు వస్తున్నది. వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా, రైతును గౌరవనీయమైన భూమిపుత్రునిగా, విలువైన

ఉత్పత్తిదారుడిగా, సహజ వ్యవసాయ నిపుణునిగా గౌరవించే సమాజ ఆవిష్కరణకు పాటుపడే సమయంలో ఈ కింది సూచనలు రైతాంగ అభ్యున్నతికి తోడ్పడతాయని భావిస్తున్నాం.

1. అన్ని వృత్తులలాగానే, అందరు ఉత్పత్తిదారులలాగానే రైతు తాను పండించిన పంటకు తానే ధర నిర్ణయించుకునే సాధికారికతను సంపాదించుకోవాలి. అందుకొరకు పంటల ఉత్పత్తిదారుల సంఘాలుగా పరస్పర సహకార పరపతిచట్టం ద్వారా ఏర్పడాలి. దీనివలన రైతులకు స్వంతంగా అప్పులు ఇచ్చిపుచ్చుకునే అవకాశం, నేరుగా ఎరువులు, పురుగు మందులు కొనుక్కునే అవకాశం, సస్యయాజమాన్యానికి సరిపోయే విధంగా విస్తరణ వ్యవస్థను ఏర్పాటుచేసుకునే అవకాశం ఏర్పడుతుంది. ఈ సంఘాల ద్వారా పంటలను సమష్టిగా విక్రయించుకునే అవకాశం, ధరలను తమకు తామే నిర్ణయించుకునే అధికారం ఏర్పడుతుంది. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ధరల స్థిరీకరణ సమస్యను అధిగమించేందుకు గోదాముల నిర్మాణం కూడా చేపట్టి, ఉత్పత్తుల రవాణాకు స్వంత వాహనాల ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది.
2. రైతులు సంఘటిత పడడంతో పాటు ప్రస్తుతం గ్రామ ప్రాంతాల్లో రుణ పంపిణీకి మాత్రమే పనికి వస్తున్న సహకార వ్యవసాయ పరపతి సంఘాల లక్ష్యాలను కూడా మార్చాలి. ఇంతకు ముందున్నట్టు పరిశోధనా శాలలను కేవలం పొలం గట్లకే కాకుండా, మార్కెట్ల వరకూ తీసుకువెళ్లే అవకాశాలను ఈ సొసైటీలు స్ఫూర్తివంతంగా ముందుకు తీసుకు వెళ్లేందుకు సహకార ప్రణాళికలను మళ్లీ కొత్త ఆలోచనలతో రచించాలి.
3. ఆధునిక యంత్రాలను ప్రజలు నేరుగా కొనుక్కునే అవకాశం లేదు. మన రాష్ట్రంలో సుమారు ఒక కోటి 32 లక్షల మంది చిన్న రైతులుండగా వారు నేరుగా యంత్రాలను స్వంతంగా సమకూర్చుకునే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో పంటల ఉత్పత్తి సంఘాలుగానూ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలుగానూ, యంత్రాలను అందుబాటులో ఉంచుకుని రైతులకు ఇతోధికంగా తమ కార్యకలాపాలను నిర్వహించుకునేందుకు తోడ్పడవచ్చు.
4. వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో ప్రతి మండలానికి ఒక వ్యవసాయ ఇంజనీర్‌ను నియమించి, ప్రస్తుతమున్న వ్యవసాయ అధికారులతో సమన్వయం చేయించి, ప్రతి రైతు ఆధునిక వ్యవసాయం వైపు దృష్టిపెట్టే విధంగా ప్రభుత్వం తన ఆర్థిక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి.
5. వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ను ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ప్రవేశపెడుతున్నారు. వ్యవసాయ సంబంధిత అంశాలపై ఏకీకృత వ్యవస్థ కొరకు, అన్ని రాష్ట్రాలు ప్రభుత్వం ఇచ్చే సహకారం, ఇతర సౌకర్యాలను పొందేందుకు కేంద్ర ప్రభుత్వమే ఒక సమగ్రమైన వ్యవసాయ బడ్జెట్‌ను, రైల్వేలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల తరహాలో ప్రవేశపెట్టాలి.
6. దేశంలో ప్రతి 250 మంది రైతులకు ఒక వ్యవసాయ నిపుణుడిని నియమించాలని, స్వామినాధన్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలుచేసి, ఒక నూతన దృక్పథంతో ముందుకు వెళ్లాలి.
7. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందుల్లో ప్రధానమైనది విద్యుత్ సమస్య. ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తి పద్ధతులను ముఖ్యంగా సూర్యరశ్మి నుంచి విద్యుత్ పొందే అవకాశాలను మెరుగుపరచి ఆ తరహా కరెంటు మోటర్ల తయారీ ఒక కొత్త ప్రాతిపదికపై ప్రారంభించాలి.
8. ప్రకృతి వైపరీత్యాలు, ప్రపంచ వ్యాప్తంగా భూమి తీవ్రంగా వేడిమిని, అతివృష్టిని, వరదలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో నీటి యాజమాన్యానికి విస్తృతమైన ప్రాధాన్యత ఇవ్వాలి. ముఖ్యంగా ఇజ్రాయిల్ తరహాలో డ్రిప్ ఇరిగేషన్, మైక్రో ఇరిగేషన్ ద్వారా ఉత్తమ ఫలితాలను రాబట్టడం, పంటలను వివిధ పరిస్థితుల నుంచి కాపాడేందుకు సహజ లేక ప్లాస్టిక్ ఆచ్ఛాదన (మల్చింగ్) పద్ధతులను అందుబాటులోకి తీసుకురావాలి. డ్రిప్, మైక్రో పరికరాలు, మల్చింగ్ షీట్లకు సబ్సిడీలు అధికంగా పెంచి వీటి ప్రాముఖ్యతను తెలియజెప్పడానికి రైతులకు శిక్షణ ఇవ్వడంతోపాటు వివిధ ప్రాంతాల్లో అమలవుతున్న పద్ధతులు తెలుసుకునేందుకు యాత్రలకు పంపించాలి.
9. గ్రామ ప్రాంతాలలో పంట పొలాల నుంచి ప్రధాన రహదారులకు తమ ఉత్పత్తులను చేర్చుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. అదేవిధంగా వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, నిల్వ, శీతలీకరణ వంటి సౌకర్యాలను కలగజేయడానికి ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు తీసుకోవాలి.
10. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఈ సంవత్సరం 24 లక్షల హెక్టార్లలో పత్తిపంటను వేశారు. అదే విధంగా మిరపసాగుపట్ల ఎన్ని నష్టాలు వచ్చినా రైతులు విముఖత వ్యక్తం చేయడంలేదు. మన దేశంతో పాటు ప్రపంచ వినియోగదారుల్లో ఈ రెండు పంటలకు ఉన్న మార్కెట్ దృష్ట్యా రైతులు ఏదో ఒక రోజు తమకు కలిసివస్తుందనే దృక్పథంతో ఈ పంటల సాగుకు మొగ్గుతున్నారు. ఎగుమతి అవకాశాలు ఉన్న ఈ రెండు పంటల నియంత్రణకు, మెరుగైన సాగుకు ఒక కాటన్ బోర్డు, ఒక మిర్చిబోర్డు ఏర్పాటుకు కేంద్రం సిద్ధంగా ఉందని ఇంతకు ముందే మంత్రులు సెలవిచ్చారు. కానీ, అవి అమలులోకి రావడం లేదు. అదేవిధంగా అత్యంత వాణిజ్య విలువలున్న పసుపు పంటను కూడా సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి, పసుపు బోర్డు ఏర్పాటుకు కూడా నిర్ణయం జరిగినట్టు తెలుస్తోంది. ఈ బోర్డుల ఏర్పాటుద్వారా నూతన సంవత్సరంలో ప్రభుత్వం రైతులకు వరమిచ్చినట్టు కాగలదని భావిస్తున్నాం.

2013 సంవత్సరం రైతుల పాలిట శుభసూచకం కాగలదని, ప్రభుత్వాలు, సమాజం రైతన్న పట్ల ఆదరణ పెంచుకుని అన్నదాతను ఆదుకుంటాయని భావిస్తూ.. సస్య విప్లవంలో పాలుపంచుకుంటున్న రైతన్నలకు, శాస్త్రవేత్తలకు, వాణిజ్యవేత్తలకు, రైతు కూలీలకు, మహిళలకు నూతన సంవత్సర శుభాకాంక్షలతో..

-ఏలూరి సాంబశివరావు,
సంపాదకుడు

మిరపలో వైరస్ తెగుళ్ళు - అదుపునకు సూచనలు

బి.సి వెంకటేశ్వరరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు, రైతుశిక్షణా కేంద్రం, ఖమ్మం, ఫోన్ : 8096696072

మిరప ప్రస్తుతం పూత, కాయ దశలో ఉన్నది. ఈ దశల్లో వైరస్ తెగుళ్ళు వ్యాప్తి చెంది, రైతులను ఎక్కువ నష్టపరుస్తున్నాయి. వైరస్ తెగులుకు మందులు లేవు. కాబట్టి రైతులు ముందుగానే వీటి లక్షణాలను గుర్తించి వైరస్ సోకకుండా తగిన జాగ్రత్త వహించాలి.

మిరపలో ఆశించే వైరస్ తెగుళ్ళు చాలా రకాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి "కుకుంబర్ మొజాయిక్ వైరస్, టుబాకో మొజాయిక్ వైరస్, పొటాటో వైరస్, పీ నట్‌బడ్ నెక్రోసిస్ మరియు లీఫ్‌కర్ల్ వైరస్. ఈ వైరస్‌ల వల్ల పూర్తిగా (100%) పంటకు నష్టం కలిగిన పంట కాలాలు కూడా ఉన్నాయి.

తెగులు సోకిన మొక్కలు గిడసబారి పాలిపోయి ఉంటాయి. ఆకులు చిన్నవిగా తయారై కుచ్చులు కుచ్చులుగా ఏర్పడతాయి. కణుపులు పొట్టిగా తయారై మొక్కలు పొదలు, పొదలుగా కనిపిస్తాయి. ఆకులు ముడతలు పడడం, ఆకుల అంచులు చుట్టుకుపోవడం వంటివి గమనించవచ్చు. పీనట్‌బడ్ నెక్రోసిస్‌వైరస్ ఆశించుట వలన మొవ్వభాగం కుళ్ళి ఎండిపోతుంది. ఆకులపై పసుపుపచ్చని పొడి ఏర్పడడం, కణజాలం చనిపోయి నల్లమచ్చలేర్పడడం గమనించవచ్చు. పూత, పిందె ఏర్పడడం ఆగిపోతుంది. ఈ వైరస్ తెగుళ్ళు విత్తనం ద్వారా మరియు ఎక్కువగా రసంపీల్చే పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతాయి.

వైరస్ వ్యాప్తి అదుపునకు సూచనలు :

- ★ ప్రతి సంవత్సరం వైరస్ వచ్చే ప్రాంతాల్లో వైరస్‌కు తట్టుకునే రకాలను ఎంచుకోవాలి.
- ★ మిరప తోటలో చుట్టు పక్కల కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.
- ★ సిఫారసు మేరకు నత్రజని, పొటాష్ ఎరువులను వాడాలి. సూక్ష్మధాతు లోపాలను సవరించాలి.
- ★ చేను చుట్టూ జొన్న లేదా మొక్కజొన్నను రెండు మూడు వరుసలు వేయాలి. దానివల్ల తెగులు వ్యాప్తి చేసే పురుగుల తాకిడి మిరప పైరుపై తగ్గుతుంది.
- ★ టొబాకో మొజాయిక్ వైరస్ అయితే విత్తనశుద్ధి చేసుకొని నారు పోసుకోవాలి.
- ★ వేపగింజల కషాయాన్ని లేక నీమ్ బేస్డ్ పెస్టిసైడ్స్‌ను రెండు మూడు పర్యాయాలు పిచికారి చేయాలి.
- ★ రసం పీల్చే పురుగులను అరికట్టడానికి "ఫిప్రోనిల్ 2 మి.లీ లేక ఎసిఫేట్ 1.5 గ్రా॥ ఒక లీటరు నీటికి కలుపుకొని ఆకుల అడుగు భాగం పూర్తిగా తడిచేట్లు పిచికారి చేసుకోవాలి. లేకుంటే "పెగాసిస్" 300 గ్రా. ఎకరానికి పిచికారి చేసుకోవాలి.

*

అందరికీ నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు

దేశీయ ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో ఎదిగిన జైన్ ఇరిగేషన్ సంస్థ యొక్క మూలాలు కాడి ఎద్దుల నుండి ప్రారంభమైనవి!
ఈ నిజాన్ని విశ్లేషిస్తే లభించే నిజాలు

నేటికీ మన రైతన్నకు కాడి పశువులే అత్యంత శక్తివంతమైన వ్యవసాయ సాధనాలు. వీటి ఉపయోగానికి ఖర్చు తక్కువ. ఎంతో లాభసాటి, ఉపయోగానికి ఎంతో అనువైనవి, నమ్మకమైనవి మరియు విశ్వాసపాత్రమైనవి.

ఆధునిక నీటి పారుదల విధానం ఈ ఉపయోగాలన్నింటినీ సంకలనం చేసుకొని మరింత మెరుగైన, పటిష్ఠమైన విధానంగా రూపుదిద్దుకొంది.

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్ పై ప్రమాణాలను పరిశీలించుటయేగాక, వాటిని పరిగణనలోకి తీసుకొని కార్యాచరణలో పెట్టింది. జైన్ వ్యవస్థలోని వారంతా తరతరాలుగా వ్యవసాయదారులు, రైతుల సాధక బాధకాలు, సమస్యలు వారికి అనుభవమే. అందుకే వ్యవసాయ సంబంధిత సంక్లిష్ట సమస్యలకు పరిష్కార మార్గాలు ఇవ్వడంలో వారికి వారే సాటి. అన్నిరకాల వ్యవసాయ సమస్యలకు పరిష్కారం చూపగలిగే ఏకైక సంస్థ జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్.



జైన్

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/బి/5. పార్క్ ఎదురుగా, కెనరాబ్యాంక్ దగ్గర, గాంధీనగర్, హైదరాబాద్-500 080

ఫోన్ : 040-27611706/27614474/27612593 E-mail : jainhyderabad@jains.com, Website : www.jains.com

వడివడిగా... ముందు యుగం దూతలో 'ఏలూరి'

సాహసమే ఊపిరిగా ... అంకితభావమే ఆలంబనగా... పైపైకి

యువతరం పలు సవాళ్ళను ఎదుర్కొంటున్న దశలో, దశ-దిశ కరువై ఎక్కువ మంది జీవితంపై విరక్తితోనూ, గమ్యం దొరకని స్థితిలో పక్కదారులు పట్టడం, అనేకానేక విషమ స్థితుల మధ్య, వత్తిడిలు తట్టుకోలేక జీవన సాఫల్యాన్ని అందుకోలేకపోవడం, వాటి విషపరిణామాలను మనం గమనిస్తున్నాం. ఐయితే చాలామంది యువతరం నవభావాలతో, నవజీవన పావన శోపానాలను అందుకుంటున్నారు. చిన్నతనం నుండే తాము పెరిగిన వాతావరణం, కుటుంబ అనుబంధాలు, నెలకొని ఉన్న పరిస్థితులు, బాల్యంలోనే వారిపై పడిన ప్రభావాలు, వత్తిళ్ళను తట్టుకొని హిమాలయ స్థాయిలో ఉన్నత శిఖరాలను అందుకుంటున్న వైనం చూస్తున్నాం! అందుకే మహాకవి శ్రీశ్రీ ప్రవచనాలు భూమి అంతమయ్యే వరకు, సూర్య చంద్రులున్నంత కాలం మనమదిలో మెదులుతుంటాయి. "కొంత మంది యువకులు పుట్టుకతో వృద్ధులు, పేర్లకు, పుకార్లకు, పకీర్లకు నిబద్ధులు... కొంత మంది యువకులు పావన నవజీవన నిర్మాతలు.... ముందు యుగం దూతలు" అన్నారు ఆ మహాకవి.

రెండో కోవకు చెందిన వారు 'అగ్రిక్లినిక్' సంపాదకులు, నోవా గ్రూపు సంస్థల చైర్మన్ ఏలూరి సాంబశివరావు. ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించి, ఆ జీవనంలోని బాధలను గమనించి, ఆ అనుభవాలను అక్షర నైవేద్యాలుగా తీర్చి దిద్దుకొని, తనకు తానే ఎవరి ఆసరా లేకుండా విజయ పరంపరలో దూసుకుపోతున్న వ్యక్తిత్వం ఆయనది. అపజయాలకు వెరవకుండా, తాను నమ్మిన బాటలో, తనదైన శైలిలో పురోగమన పథం వైపు దూసుకువెళుతున్నారు. అనేక వృత్తి విద్యలు ముఖ్యంగా వైద్యవృత్తి, ఇంజనీరింగ్ విభాగాలకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో, రైతు బిడ్డగా రైతు సేవలో నిమగ్నం కావాలనే దృక్పథంతోనే వ్యవసాయ శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీని సాధించి, వ్యవసాయ నిపుణునిగా తన కర్తవ్యాలను నిర్వర్తించుకొని ముందుకు వెళ్ళడం ప్రారంభించారు.

బాల్యంలోనే చరిత్ర కారుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు, సినీ నటుడుగా, తెలుగు దేశం పార్టీని స్థాపించి భారత జాతీయ రాజకీయాలకు కొత్తగమనం చూపించిన నేతగా ముద్ర వేసుకోవడం సాంబశివరావును ఆకర్షించింది. మేరునగ ధీరుడుగా, అపూర్వ తేజంతో ఆనాటి యువతనే కాకుండా, బాల్య వ్యవస్థలో ఉన్న వారిని సైతం ఆకర్షించిన "అన్నదాత" స్ఫూర్తిని, అణువణువునా నింపుకున్నారు. ప్రకాశం జిల్లాలో పేరెన్నికగల అగ్రశ్రేణి రాజకీయ వేత్తలు ఎన్‌టిఆర్ పార్టీ పెట్టగానే భేషరతుగా ఆయనను అనుసరించి తెలుగు నాట నూతన సామాజిక విప్లవానికి బాట వేయడానికి సహకరించడం ఏలూరిని ఆకర్షించింది. నమ్మిన మాటను కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం, దాన్ని ఆచరణలో చేసి చూపడం వంటి విశ్వసనీయ రాజకీయం ప్రజల నరనరాల్లో అభిమానం రూపంలో వెల్లువై ప్రవహించగా సాంబశివరావు లాంటి నవయువకులు ఆ బాటలో పయనించడానికి నాడే కంకణం కట్టుకొన్నారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రారంభమైన చదువు వ్యవసాయంలో మాస్టర్స్ డిగ్రీతో పరిపుష్టమై, ప్రభుత్వ ఉద్యోగిగా తనకు ఇష్టమైన ఉద్యానవన అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. రాత్రనక, పగలనక రైతులతో మమేకమై, తన పరిధిని మించి తోటల పెంపకంలో తన నిపుణతను ప్రదర్శించి, రైతుల హృదయాలను చూరగొన్నారు. భారత దేశపు వ్యవసాయం తీరు తెన్నులు, ఉపకరణాలు, సస్య యాజమాన్య లోపం,

నీటి యాజమాన్యంలో నిపుణత లేకపోవడం, సరైన నిల్వ వ్యవస్థ, రవాణా సౌకర్యాలు మృగ్యం కావడం, గిట్టుబాటు ధర లేకపోవడం, రుణ ప్రణాళికలు రైతులకు లాభించకపోవడం, వెరసి వ్యవసాయం లాభసాటి వృత్తిగా మార్చేందుకు తగిన అవకాశాలు లేకపోవడం వంటి సమస్యలను తాను వంటరిగా పరిష్కరించలేను అని భావించి, ఆచరణలో సేద్యం సమగ్ర, సమృద్ధి ప్రవృత్తిగా మారేందుకు తగిన వేదికను తానే సృష్టించుకున్నారు. సమాజమే దేవాలయం, పేదవాడే దేవుడన్న ఎన్‌టిఆర్ పవిత్ర కార్యాచరణకు కొనసాగింపుగా ఆయన తన జీవన గమనాన్ని వేగవంతమైన, గుణాత్మకమైన, నలుగురికి ఉపయోగపడే అంశంగా రూపుదిద్దుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన తన విశిష్ట సేవాభావం, కార్యాచరణ తత్పరత, అంకిత భావాలను రంగరించి, తనకంటూ ఒక విశాలమైన ప్రాతిపదికను ఏర్పాటు చేసుకొని నేడు ప్రజానాయకుడిగా ముందుకు వెళుతున్నారు. అందుకు దోహదపడిన అంశాలను ఇప్పుడు మనం చర్చించుకుందాం.

నాయకత్వ లక్షణాలు :

స్వభావరీత్యా, మృదుభాషి, స్నేహశీలి అయిన సాంబశివరావుకు వ్యవసాయ నిపుణుల్లో రాష్ట్ర వ్యాప్త ఖ్యాతి ఉంది. ఆచార్య ఎన్‌జిరంగా విశ్వ విద్యాలయంలో డిగ్రీ నుండి పి.జి వరకు చదువుకునే సమయంలో ఆయన ప్రతి ఒక్కరి సమస్యపై స్పందించి, వారి సమస్యలు తన సమస్యలుగా భావించి, జనజీవన స్రవంతిలో తనదైన ముద్ర వేసుకున్నారు. సామాజిక సమస్యలపై స్పందన, ఎదిగినకొద్దీ ఒదిగిఉండే మనస్తత్వం, దానితో పాటు ధీరోదాత్తంగా సమస్యలను పరిష్కరించగలిగి, సవాళ్ళను సాహసోపేతంగా స్వీకరించగల వ్యక్తిత్వం ఆయన సొంతం. సస్య జీవనంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఒక వేదికగా నోవా అగ్రిటెక్ కంపెనీని స్థాపించినప్పుడు అది ఒక మొలక మాత్రమే. ఆ మొలకకు నీరు పోస్తూ, పెంచుతున్న సమయంలో దాని శాఖలుగా సంస్థను పలు కార్యకలాపాల వైపు విస్తరింపచేయడంలో ఆయన సహాధ్యాయులు, జూనియర్లు, సీనియర్లు, ఎంతో మంది ప్రొఫెసర్లు ఆయనకు అండగా నిలిచారు. అతని నాయకత్వ లక్షణాలకు, జన సమీకరణ శక్తికి, మానవ వనరుల అభివృద్ధి నిపుణతకు ఇదే తార్కాణం.

లాభాపేక్ష లేని వాణిజ్య వేత్త :

సాధారణంగా ఒక వ్యాపార సంస్థను స్థాపించే వారు అత్యధిక లాభాలను ఆర్జించి, అతి త్వరలో ధనవంతులు కావడానికి ఇష్టపడతారు. కానీ రైతు శ్రేయస్సే సదా మదిలో ఉండే సాంబశివరావు తన అగ్రిటెక్ కంపెనీని ఒక విశ్వాసం, ఒక నమ్మకం, ఒక విశ్వసనీయత ప్రాతిపదికగా పైకి తీసుకువచ్చారు. నూటికి నూరు శాతం నాణ్యత, వినియోగదారుడి సంతృప్తి ఆధారంగానే వ్యాపారం నిర్వహించడం లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. ముఖ్యంగా అత్యంత పెట్టుబడి, నష్టపోయే అవకాశాలున్న మిరప, పత్తి పంటలపై పురుగులు, వైరస్‌ల దాడి నుండి పంటను రక్షించేందుకు తయారు చేసిన మందులు మిక్కిలి ప్రాచుర్యం పొందాయి. అంతే కాకుండా ఉద్యాన పంటల్లో ప్రధానంగా ఎదురయ్యే నీటి సమస్య, వాటి యాజమాన్య పద్ధతులను ఆధునీకరించేందుకు ప్లాస్టిక్ మల్చింగ్ వినియోగం అందుబాటులోకి తేవడం, పత్తితీత యంత్రాన్ని రంగంలోకి తీసుకురావడంతో రైతులకు నూతన ప్రక్రియల్లో వ్యవసాయం ముందుకువెళ్ళేందుకు దోహదపడుతుంది. సర్వత్రా రైతు ప్రయోజనాలే ముఖ్యమని భావించి, అర్హులైన వ్యవసాయ నిపుణులను, వీలైనంత ఎక్కువగా వేతనాలిచ్చి, వారిని అంకిత భావంతో నిరంతరం వినియోగదారుడైన రైతును అంటిపెట్టుకునే విధంగా తీర్చిదిద్దిన ఘనతతో ఈ కంపెనీ విశిష్టమైనదిగా పేరు తెచ్చుకున్నది. రైతుకు సకాలంలో పంటల గురించిన విజ్ఞానాన్ని అందించడంలో వ్యవస్థలు విఫలమైన నేపథ్యంలో నోవా అగ్రిటెక్ కంపెనీ నిపుణులు ఆ బాధ్యతను తమపైన వేసుకుని రైతులకు వెన్నంటి ఉండడం కంపెనీపై అపార విశ్వాసాన్ని పెంచింది.

రాష్ట్రపతి అవార్డు :

పెట్టుబడుల సమీకరణ, కష్టతరమైన యాజమాన్య నిర్వహణ, సర్వత్రా పట్టిపీడిస్తున్న మానవ వనరుల సమస్య, విద్యుత్, ముడిసరుకుల కొరత, తరచుగా చిన్న పరిశ్రమలను పీడించే సమస్య. ఐదేళ్ళ క్రితం కేవలం ఒక ఐదుగురితో ప్రారంభమైన నోవా అగ్రిటెక్ కంపెనీ నేడు 350 మందికి పైగా ప్రత్యక్షంగానూ, అనేక మందికి పరోక్షంగానూ ఉపాధి కల్పిస్తూ ఈ రంగంలో మేలైన పరిశ్రమగా గుర్తింపు పొందింది. దీనికి తార్కాణం అప్పటి భారత రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ సమక్షంలో ఉత్తమ పారిశ్రామికవేత్తగా అప్పటి కేంద్ర

మంత్రి, ప్రస్తుత హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి వీరభద్రసింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సాంబశివరావు జీవన యాత్రలో ఈ అవార్డు ఆయన కీర్తి కిరీటంలో కలికి తురాయిగా భావించవచ్చు.

అగ్రిక్లినిక్ పత్రిక స్థాపన :

రైతులను గౌరవనీయమైన భూమిపుత్రులుగానూ, సహజమైన సాంకేతిక నిపుణులుగానూ, విలువైన ఉత్పత్తిదారుడిగానూ భావించే సాంబశివరావు తనదైన శైలిలో రైతులను చైతన్యపరచేందుకు, ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసేందుకు రంగుల హరివిల్లులా ఎంతో వ్యయప్రయాసలకోర్చి 'అగ్రిక్లినిక్' మాస పత్రికను గత మూడేళ్ళుగా నిరాటంకంగా ప్రచురిస్తున్నారు. ఈ పత్రిక తెలుగునాట వ్యవసాయ విజ్ఞాన పంపిణీలో మొట్టమొదటి రంగుల పత్రికగా తెలుగు పత్రికా రంగాన్ని వన్నెకెక్కించింది. ప్రపంచంలో ఎక్కడవున్నా తెలుగు రైతుల విజయ గాథలను ప్రచురిస్తూ, వారి స్ఫూర్తిని ఇతర రైతులకు పంచుతూ, ఒక రైతాంగపు సమగ్ర వేదికగా, వ్యవస్థగా రూపొందించింది. అత్యంత వ్యయంతో రైతును రాజుగా చూపెట్టాలనే ధ్యేయంతో నిర్వహిస్తున్న ఈ పత్రికకు అనుబంధంగా అంతర్జాలంలో (ఇంటర్నెట్) http://www.agriclinic.org ఆ తరువాత www.facebook.com/public/Agriclinic-Maasa-Patrika సోషల్ మీడియాలో రైతుల విజయ గాథలను, ఇక్కట్లను ప్రచురిస్తూ ప్రపంచ వ్యాప్త ఆదరణను పొందింది.

రైతు సేవా కేంద్రం :

ఒక కంపెనీ బహుముఖ సేవల ద్వారా రైతాంగాన్ని ఆదుకోవడం, నిరంతరం వారి కనుసన్నల్లో మెలగడం అరుదైన విషయం. సమాచార సాంకేతిక విప్లవాన్ని రైతులకు చేరువ చేసేందుకు ప్రయత్నంలో భాగంగా రైతు సేవా కేంద్రాన్ని సాంబశివరావు ప్రారంభించారు. అర్హత కలిగిన యువతులు, వ్యవసాయ నిపుణులుగా రోజూ వెయ్యి మందికి సలహాలివ్వగలగడం, రైతులు సానుకూలంగా ఈ వ్యవస్థ తమదేనని విశ్వసనీయత పెంచుకోవడం సాంబశివరావు నాయకత్వ ప్రతిభకు, దార్శనికతకు నిదర్శనం. ఇప్పటి వరకు 75 వేలకు మించి నాలుగు రాష్ట్రాల రైతుల వివరాలను కంపెనీ పొందుపరచగలిగిందంటే దాని అంకిత భావాన్ని అర్థం చేసుకోవచ్చు.

అభ్యుదయ రైతుగా :

ఏలూరి సాంబశివరావు తాను నమ్మిన విశ్వాసాలను ముందుకు తీసుకువెళ్ళడంలో రాజీలేని ధోరణితో వ్యవహరిస్తారు. ఎంత కృషి చేసినా ఆయన తనదైన శైలిలో పరిష్కారంగాని సమస్యలకు సమాధానం చెప్పడం, మెరుగైన వ్యవసాయం కొరకు రైతులను ప్రోత్సహించడం, గిట్టుబాటు ధరల కొరకు మార్గాలు అన్వేషించడం వంటి అంశాలను పరిశోధిస్తూనే ఉంటారు. ఆ పరిశోధనలకు ప్రాణంపోసేందుకు మెదక్ జిల్లా, జహీరాబాద్ మండలం, హుగ్గెల్లి గ్రామంలో ప్రధాన పరిశోధన-అభివృద్ధి ప్రదర్శనా క్షేత్రాన్ని 35 ఎకరాల్లో స్థాపించారు. దానికి అనుబంధంగా నిజామాబాద్ జిల్లా కామారెడ్డిలోనూ, కృష్ణాజిల్లా మక్కపేటలోనూ, ప్రకాశం జిల్లా జొన్నతాలిలోనూ, 300 ఎకరాల్లో సేద్యాన్ని ప్రారంభించారు. మల్చింగ్‌తో మిరప పంటను నాటి వివిధ ప్రాంతాల్లోని వాతావరణ పరిస్థితులకు తట్టుకునే విధంగా పంటలను అభివృద్ధి చేసి క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించారు. వేలాది మంది రైతులను ఈ క్షేత్రాలకు ఆహ్వానించి నిర్వహించిన సదస్సుల్లో ప్రముఖ శాస్త్రవేత్తలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల ప్రశంసలు పొందారు. జీరోటిల్లేజ్‌తో పత్తి సాగును నిర్వహించి, అతి తక్కువ ఖర్చుతో ఎకరాకు 18-25 క్వింటాళ్ళ పత్తి దిగుబడి చేశారు. 8 ఎకరాల్లో 340 క్వింటాళ్ళ మొక్కజొన్నను పండించి, ఆ పంట దిగుబడుల చరిత్రను తిరగరాశారు. మిశ్రమ పంటలు, అంతర పంటలు సాగు చేయడంలో దిట్ట. బంగాళాదుంప, క్యారెట్, క్యాబేజి, ఆకు కూరలు, బెండ, టమాటా కూరగాయల పెంపకంలో తనకు తానే సాటిగా నిలిచారు. అంతే కాకుండా మినుము, కంది, సోయా పంటల పెంపకంలో పేరు తెచ్చుకున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించి, కూలీల బెడదను అధిగమించే ప్రయోగాలతో రాష్ట్రంలోని రైతాంగానికి ఆదర్శ ప్రాయుడిగా ప్రముఖుల ప్రశంసలను పొందుతున్నారు.

మానవత్వం పరిఢవించిన మంచి మనిషి :

ఎన్ని వ్యాపారాలు చేసినా, ఎంత సంపాదించినా, ఎన్ని కీర్తి ప్రతిష్టలు లభించినా, హోదాల్లో ఉన్నా మనిషికి మిగిలిపోయేది మంచితనం, మానవత్వ స్ఫూర్తి మాత్రమే. ఈ లక్షణాలు నిండుగా ఉన్న సాంబశివరావు మానవ వనరుల అభివృద్ధి ద్వారా మాత్రమే దేశ ప్రగతి సుసాధ్యమని భావించే వారిలో ప్రథములు. దానికి

అనుగుణంగా విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించే లక్ష్యంలో భాగంగా ఖమ్మం జిల్లా, కొత్తగూడెంలో ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బాలోత్సవ్ నిర్వహణకు లక్షలాది రూపాయలను వితరణగా అందజేస్తారు.

తన సొంత జిల్లా, ప్రకాశంలో, తాను అతిగా ప్రేమించే రైతులు, రైతు కూలీలు అంధత్వం బారిన పడకుండా , ఉచిత నేత్ర వైద్యశిబిరాలను నిర్వహించి, సొంత ఖర్చుతో ఆపరేషన్లు చేయించి, కంటి అద్దాలను బహూకరించడం వంటి కార్యక్రమాలు అక్కడి పేద ప్రజల గుండెల్లో ఆయనపై ప్రేమ గూడుకట్టుకునే విధంగా చేసింది. వికలాంగులు, వృద్ధులు, మహిళలతో సహా వేలాది మందికి ఈ శిబిరాల ద్వారా వైద్య సహాయం అందడం సామాజికంగా గొప్ప మేలు చేసింది. పక్కనే ఉన్న గుంటూరు జిల్లాలో కూడా ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తున్నారు.

రాజకీయం – ఓ సామాజిక బాధ్యత ! :

రాజకీయ మంటే చాలామందికి పదవిని పొందే ఓ పరమపద సోపానం మాత్రమే. కానీ ఏలూరి దృష్టిలో రాజకీయం ఓ ప్రజాహితమైన కార్యక్రమం. నిత్యం పేదరికానికి వ్యతిరేకంగా, సామాజిక విలువల కొరకు పనిచేసే అస్త్రం. ఆ భావనతోనే ఆయన తెలుగుదేశం పార్టీ సభ్యుడిగా అనేకమైన సేవలతో పార్టీ అధినేత చంద్రబాబు మెప్పుపొందారు. అనేక చోట్ల వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టిఆర్ విగ్రహాల ఏర్పాటు చేశారు. రైతుల కొరకు చంద్రబాబు చేసిన పాదయాత్రలో పాలు పంచుకోవడం, హైదరాబాదులో ఆమరణ దీక్ష సమయంలో వెన్నంటి ఉండడం, గోదావరి నదిపై, బాబ్లీ వద్ద మహారాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా నిర్మించిన ప్రాజెక్టుపై పోరాటంలో బాసటగా నిలవడం ఆయనకు మంచి గుర్తింపు తెచ్చాయి.

తెలుగు వ్యవసాయ నిపుణుల విభాగాన్ని ఏర్పాటు చేసి వందలాది మంది సహచరులను తెలుగుదేశం పార్టీకి అనుబంధంగా సమీకరించి, రాబోయే ప్రభుత్వంలో రైతు పక్షపాతులకు పెద్దపీట వేసే విధంగా

ముందుకు తీసుకువెళుతున్నారు. చట్ట సభల్లో రైతులాబీకి బలం లేక కార్పోరేట్ ముందు ప్రభుత్వాలు తలవంచి మద్దతు ధరలకు అడ్డంపడడం, ఎరువులు, ఉపకరణాలు, యంత్రాలు అందుబాటులో లేకుండా చేయడం వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు వ్యవసాయ నిపుణులను అందలం ఎక్కించడం ద్వారా న్యాయం చేయవచ్చుననే భావన, సర్వత్రా వెలువడుతున్న నేపథ్యంలో సాంబశివరావు ప్రతిభకు, నిపుణతకు, అంకిత భావానికి మెచ్చి, ఆయనను ప్రతిష్టాకరమైన పర్చూరు నియోజక వర్గానికి చంద్రబాబు ఇన్‌చార్జిగా నియమించారు. నియామకం పొందిందే తడవుగా సాంబశివరావు తనదైన శైలిలో 27 రోజుల సుదీర్ఘ పాదయాత్రలో పాల్గొంటున్నారు. ప్రతిచోటా రైతులు, రైతు కూలీలు, మహిళలు, ఇతర సామాజిక వర్గాలు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నాయి.

నవ్యాంధ్ర నాయకుడు, స్వర్ణాంధ్ర భావకుడు, దార్శనికనేత చంద్రబాబు నాయుడు తిరిగి ఏలికగా వస్తే రైతులకు, ఇతర వర్గాలకు సాంత్వన రక్షణ లభిస్తుందని నమ్మే సాంబశివరావు ఆయన బాటలో కదం తొక్కుతూ కర్షకులను, పల్లెలను చుట్టివస్తున్నారు. **– అగ్రిక్లినిక్ డెస్క్**

జనవరి 20న ప్రకాశం జిల్లా కారంచేడులో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రకాశం జిల్లా, కారంచేడు, యార్లగడ్డ వారి కళ్యాణమండపంలో జనవరి 20వ తేదీన పెద్ద ఎత్తున ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నోవా అగ్రిటెక్ కంపెనీ రీజినల్ మేనేజర్ పుల్లెల అజయ్‌బాబు తెలిపారు. రోగులకు వైద్య సౌకర్యంతో పాటు ఉచిత భోజన వసతి కూడా ఉంటుందని వెల్లడించారు. లక్ష మందికి ఆపరేషన్లు లక్ష్యంగా సేవలను కొనసాగించనున్నట్లు ఆయన వెల్లడించారు. వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెంబరు : 9177998789

ఉద్యాన మొక్కల రంగంలోకి ఎన్.ఆర్.ఐ. అగ్రిటెక్

మెరుగైన విత్తనాల ఉత్పత్తిలో పేరుప్రతిష్టలు సంపాదించిన ఎన్ఆర్ఐ అగ్రిటెక్ కంపెనీ ఇక నర్సరీ ఉత్పత్తుల రంగంలోకి ప్రవేశించనున్నది. డిసెంబరు 9వ తేదీన గుంటూరు నగరంలోని సంస్థ కార్యాలయంలో తొలిసారిగా జరిగిన డీలర్ల సమావేశంలో సంస్థ అధినేతలు డా॥ ఆలపాటి రవీంద్ర, రాజా, డా॥ వెంకటేశ్వర్లు లాంఛనంగా మొక్కలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎన్ఆర్ఐ అగ్రిటెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా॥ ఆలపాటి సత్యన్నారాయణ సంస్థ కార్యకలాపాలను, వ్యాపార విస్తరణ అవకాశాలను వివరించారు. సంస్థ ఆధ్వర్యంలో ఉత్పత్తి అయిన విత్తన ప్రమాణాలు, మార్కెటింగ్ నెట్‌వర్క్‌ను విస్తరించే అవకాశాలను తెలియపరచి, డీలర్ల సందేహాలకు సమాధానాలిచ్చారు. తొలుత జనరల్ మేనేజర్ సాంబశివరావు అందరికీ స్వాగతం పలికారు.

ప్రతి పైసా పేద విద్యార్థులకే – డా॥ రవీంద్ర

సుదూరతీరాల్లో బతుకుతూ, తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపచేస్తూ, వైద్య రంగంలో తనదైన శైలిలో సేవ చేస్తూ కూడా సంపాదనలో కొంత భాగాన్ని మాతృభూమిలో పేద విద్యార్థులకు ఖర్చు పెట్టి, ఆ భూమి రుణం తీర్చుకునేందుకై ఎన్ఆర్ఐ విద్యాసంస్థలను స్థాపించామని, సంవత్సరానికి రెండు కోట్ల రూపాయలకు పైగా పేద విద్యార్థులకు సేవా భావంతో ఖర్చుపెడుతున్నామని డా॥ రవీంద్ర ఈ సందర్భంగా తెలిపారు. దానికి అనుబంధంగానే రైతు కుటుంబంలో జన్మించి, రైతుల బాధలను స్వయంగా చూసిన అనుభవంతో విత్తనాల కంపెనీని స్థాపించామని, తక్కువ ధరకు నాణ్యమైన విత్తనాల సరఫరా ద్వారా రైతులను కొంతవరకైనా మెరుగైన వ్యవసాయ పద్ధతులకు, వ్యవసాయాన్ని వాణిజ్య వృత్తిగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి జరుపుతున్నందుకు ఆనందంగా ఉందని తెలిపారు. మామూలుగా ఇతర సంస్థల్లాగా కేవలం వాణిజ్య పరంగానే ఆలోచించకుండా, డా॥ ఆలపాటి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఐదేళ్ళ పాటు పరిశోధనలు జరిపిన అనంతరమే విత్తనాలను మార్కెట్‌లో విడుదల చేసి మన్ననలు పొందగలుగుతున్నామని తెలిపారు.

ఈ సంస్థ ద్వారా వచ్చే ఆదాయం ప్రతి ఒక్క పైసా పేద విద్యార్థుల ఖాతాల్లోకే వెళ్ళిపోతుందని, ఎన్ఆర్ఐ కుటుంబసభ్యులుగా, భాగస్వాములుగా తమ డీలర్ల ప్రయోజనాలను కూడా పరిశీలనలోకి తీసుకుంటామని వెల్లడించారు. విత్తన రంగం నుండి నాణ్యమైన మొక్కల తయారీకి సంస్థ కార్యకలాపాలు విస్తరించడం ముదావహమని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి రాజా, వారి కనిష్ట సోదరుడు డా॥ వెంకటేశ్వర్లు, ఉద్యాన నిపుణులు మాధవరావు తదితరులు ప్రసంగించారు.

అనంతరం సమీపంలోని నిడుముక్కల గ్రామంలోగల ఎన్ఆర్ఐ అభివృద్ధి పరిశోధనా క్షేత్రాన్ని రవీంద్రతో సహా డీలర్లు, సంస్థ అధికారులు సిబ్బంది వివిధ రకాల మొక్కలను, విత్తన క్షేత్రాన్ని దర్శించారు.

– అగ్రిక్లినిక్ డెస్క్

రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాపాటిల్ సమక్షంలో కేంద్రమంత్రి శ్రీ వీరభద్రసింగ్ చేతుల మీదుగా జాతీయ అవార్డును అందుకుంటున్న
నోవా అగ్రిటెక్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఏలూరి సాంబశివరావు గారు

ఒక నమ్మకం ఒక విశ్వాసం ఒక విశ్వసనీయత

అదే నోవా అగ్రిటెక్

5 సంవత్సరాల నిరంతర రైతుల సేవలో....

నోవా అగ్రిటెక్ ప్రై. లిమిటెడ్

ప్లాట్ నెం. 5, MJR రెసిడెన్సి, చిన్నతోకట్ట, న్యూ బోయినపల్లి, సికింద్రాబాద్ - 500 011.

కస్టమర్ కేర్ నెం. 040-27957082

E-mail : nova.agritech@gmail.com Website : www.novaagritech.com

Range of Products

- ★ Seeds
  - Hibrid Vegetables & Chilli (ARJUN & others)
- ★ Nutrients
  - Nova CLX
  - Nova Max
  - Nova Super 789
  - Nova Boost
  - Liqui Max
  - Nova Fer
  - Nova Zinc 33%
  - Nova Zinc 12%
  - N - Cup
  - Nova Mag
  - Nova Boron
- ★ Water Soluble Fertilizers
  - Nova SOP
  - Nova K-Mag
- ★ Bio-Fungicides
  - Nova Shakthi
  - Caliber
- ★ Bio-Pesticides
  - Attack
  - Azad 300
  - Azad 1500
- ★ Bio-Fertilizers
  - Rhizobium
  - Azotobacter
  - Azospirillum
  - PSB
  - Potash Bacteria
  - Zinc Bacteria
- ★ Bio-Products (Granules)
  - Wonder CWDG
  - Pinakil GR
  - Soil N-Rich
- ★ Bio-Products
  - Mithr
  - Swarna
  - Jayam
  - Jaithra
  - Terminator
  - Terminator Gold
  - N-Counter Plus
  - Panchamruth
  - Sniper
  - N-Kick
  - Cosmo Plus
  - N-Power
  - N-Star
  - N-Shooter
  - Nova Star
  - Sanjeevani
  - Kin-Nova
  - Spark - N
- ★ Other Products
  - Rodocide
  - Suckicide
  - N-Stick

Farm Machinery

- ★ Mulch Laying Machine
- ★ Nova Cotton Picker
- ★ Nova Mulch (Mulching Film)

Services

- ★ Nova Rythu Seva Kendram
- ★ Farm Consultancy Services
- ★ Agri Clinic
  - Agricultural Monthly Magazine
- ★ Social Service Activities

AN ISO 9001 : 2008 CERTIFIED COMPANY ...for better HARVEST

వ్యవసాయ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరికరాలను రైతు ముంగిటకు చేరవేస్తూ,
భారతదేశ వ్యవసాయ ముఖచిత్రాన్ని సమున్నతంగా తీర్చిదిద్దుటకు
నోవా అగ్రిటెక్ ప్రై. లిమిటెడ్ - హైదరాబాద్ వారి అత్యాధునిక ఉత్పాదనలు

నోవా మల్చ్ TM

భారతదేశంలో మొట్టమొదటిసారిగా ప్రపంచ శ్రేణి ప్రమాణాలతో,
యు.వి. స్టెబిలైజ్డ్ టెక్నాలజీతో తయారుచేయబడిన నోవా మల్చ్™ ఫిల్మ్

పత్తి రైతులకు నోవా అగ్రిటెక్ అందించే మరో అద్భుత కానుక

నోవా కాటన్ పిక్కర్

NCP - 2011 (ప్రత్తి తీసే యంత్రం)

ప్రత్యేకతలు

- బ్యాటరీ సహాయంతో పనిచేయు పోర్టబుల్ యంత్రం
- 6 గంటల చార్జింగ్‌తో ఒక రోజు పనిచేయును.
- శుభ్రమైన పత్తి సేకరణ
- గంటకు 15-20 కిలోల పత్తి తీయగల సామర్థ్యం
- చేతిలో ఇమిడిపోయే సైజు
- పూర్తి సురక్షితం
- తక్కువ ఖర్చు, తక్కువ బరువు (500 గ్రా.)
- చిరకాల మన్నిక.

నోవా జర్మినేషన్ ట్రేలు

- జర్మినేషన్ ట్రేలలో పెంచిన నారు మొక్క వేరు వ్యవస్థను బలంగా తయారు చేసి ప్రధాన పొలంలో నాటిన వెంటనే మొక్క వేగంగా పెరిగే నాణ్యమైన దిగుబడులు అందిస్తుంది
- మొలకశాతం (Seed Vitality) 100% కలిగి ఉంటాయి
- వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందుతుంది.
- బలమైన (Seed Vigour) మరియు చీడపీడలను తట్టుకోగల మొక్కలను అందించవచ్చు
- నర్సరీ ట్రేలు దూర ప్రాంత రవాణాకు సౌకర్యంగా ఉంటాయి

NOVA Agri Tech Pvt Ltd

వివరములకు మరియు సరఫరా కొరకు సంప్రదించండి

అగ్రిప్లాస్టిక్ విభాగం - నోవా అగ్రిటెక్ ప్రై. లిమిటెడ్

MJR రెసిడెన్సి, విరల్‌నగర్, చిన్నతోకట్ట, న్యూ బోయినపల్లి, సికింద్రాబాద్ - 500 011

ఫోన్ : 040-27957082, ఫ్యాక్స్ : 040-27957081, మొబైల్ : 8121678999.

E-mail : agriplastics@novaagritech.com Website : www.novaagritech.com

AN ISO 9001 : 2008 CERTIFIED COMPANY ...for better HARVEST